www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 5-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 320 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: నవమి ఉ. 8.06, దశమి తె. 6.30 వరకు; నక్షత్రం: మూల సా 4.01 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: మ. 2.26-4.01, రా. 1.09-2.41; దుర్ముహూర్తం: ఉ. 8.56-9.43, రా. 10.21-11.08; అమృతఘడియలు: ఉ. 9.42-11.17; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 6.20 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గొలుసుకట్టు పెట్టుబడులే ఉరితాళ్లై..

ముగ్గురు కుమారులను చంపి, ఆపై ఉరేసుకున్న తండ్రి

- ఆ వ్యక్తిని నమ్మి లక్షల్లో పెట్టిన గ్రామ ప్రజలు
- డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుల ఒత్తిడి
- హాస్టల్ నుంచి పిల్లలను తీసుకొచ్చి మరీ హత్య
- ఆపై ఆత్మహత్య.. రంగారెడ్డి జిల్లాలో విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

శంకర్‌పల్లి/చేవెళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఒకసారి వెయ్యి రూపాయలు కడితే.. వరుసగా మూడు నెలల పాటు రూ. వెయ్యి చొప్పున వస్తాయి.. అదే రూ.లక్షన్నర కడితే నెలకు రూ.లక్ష చొప్పున పది నెలల పాటు వస్తాయి! బాగుంది కదా.. ఈ ఆఫర్!! దీనికి అతడూ ఆకర్షితుడయ్యాడు. ఊరి జనంలో చాలామంది అతడినే నమ్మి

మిగతా 3వ పేజీలో...

లంచాలు తీసుకున్న చట్టసభల సభ్యులు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ పొందలేరు. 1998లో ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 105, 194లకు పూర్తి విరుద్ధం. అందుకే ఆ తీర్పును కొట్టేస్తున్నాం. చట్టసభ సభ్యుల అవినీతి, లంచగొండితనం భారత దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సర్వనాశనం చేస్తుంది.

-సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం



చట్టాలకు మీరేమీ అతీతులు కాదు!

లంచం, అవినీతి కేసుల్లో ప్రజాప్రతినిధులు శిక్షార్హులే

- ఎంపీలు, ఎమ్మెల్యేల లంచాల కేసులపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
- పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ పొందలేరని తేల్చిచెప్పిన జడ్జిలు
- 1998 నాటి సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు కొట్టివేత

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దేశంలోని పార్లమెంటు, విధాన/శాసన సభల సభ్యులు లంచాలు, అవినీతి కేసుల నుంచి ఎలాంటి రక్షణా పొందలేరని, వారేమీ చట్టాలకు అతీతులు కారని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇలాంటి కేసుల్లో చట్టసభల సభ్యులు శిక్షార్హులేనని స్పష్టం చేసింది. చట్టసభ సభ్యుల అవినీతి, లంచగొండితనం భారత దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దుంప నాశనం చేస్తుందని వ్యాఖ్యానించింది. లంచాలు తీసుకుని సభల్లో ప్రసంగించడం, ప్రశ్నలు సంధించడం, ఓటు వేయడం సహా అవినీతికి పాల్పడే ఎంపీలు, ఎమ్మెల్యేలను

మిగతా 2వ పేజీలో...

గొప్ప తీర్పు

స్వచ్ఛ రాజకీయాలకు మార్గం: ప్రధాని మోదీ

అవసరమైన తీర్పిది

ఇప్పటికే ఈ నిర్ణయం తీసుకోవాల్సింది: కాంగ్రెస్

కేసీఆర్, కేటీఆర్ కొలువులు ఊడినందునే..

మీకు ఉద్యోగాలు

- ఫాంహౌస్‌లో మత్తులో ఉంటూ పాలన నడిపారు
- యువత ఉద్యోగాలడిగితే.. బర్రెలు, గొర్రెలు ఇచ్చారు
- కుక్కప్రాణానికున్న విలువ ఆనాడు పేదలకు లేదు!
- 119 నియోజకవర్గాల్లో మోడల్ గురుకులాలు
- నాకు ఇంగ్లిష్ రాదంటూ అవహేళన చేస్తున్నారు
- ఇంగ్లిష్ రాని చైనా, జపాన్ ప్రపంచాన్ని ఏలట్లేదా?
- మా మూడు నెలల పాలన చూసి.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించండి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 5192 మందికి నియామక పత్రాల అందజేత

హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీఎంగా కేసీఆర్, మంత్రిగా కేటీఆర్ ఉద్యోగాలు ఊడినందునే నేడు రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయని.. తెలంగాణ సాధన ఆశయాలు, ఆకాంక్షలు ఇప్పుడు నేరవేరుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన 543 డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, 1,463 జూనియర్ కళాశాలల లెక్చరర్లు, 2,632 టీజీటీ ఉపాధ్యాయులు, 479 మంది కానిస్టేబుళ్లు, 75 మంది వైద్య సిబ్బందికి.. ఎల్బీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నియామకపత్రాలు అందజేశారు. నిజానికి తాము 6,546 నియామక పత్రాలు ఇవ్వాలనుకున్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో కొన్ని నియామక పత్రాలు ఆగాయని.. ఈ రోజు 5,192 నియామకాలు చేపడుతున్నామని

మిగతా 14వ పేజీలో...

7, 9 తేదీల్లో ఎలివేటర్ కారిడార్లకు శంకుస్థాపన

- ఓల్డ్‌సిటీ మెట్రోకు 8న ముహూర్తం
- పనులను ప్రారంభించనున్న సీఎం రేవంత్
- 5.5 కిలోమీటర్ల పెండింగ్ పనులకు రూ.2 వేల కోట్ల మేర కేటాయింపు
- నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు కారిడార్‌కు అనుసంధానంగా పాతనగర మెట్రో అభివృద్ధి
- ఈ కారిడార్ కోసం 1,100 ఆస్తుల సేకరణ

13

ఇంటర్‌లో 40% వచ్చినా ఎస్‌జీటీకి అర్హులే

- రిజర్వేషన్ అభ్యర్థులకు శుభవార్త
- గతంలో 45% మార్కులు తప్పనిసరి
- టీచర్ పోస్టుల భర్తీకి విధివిధానాలు
- జిల్లాల వారీగా రోస్టర్ పాయింట్ల ప్రకటన
- తొలిరోజు 500 దరఖాస్తులు

14



ఉద్యోగ నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, భట్టి, కొండా, పొన్నం





ఆదిలాబాద్ విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ; సభకు భారీగా హాజరైన జనం

కాళేశ్వరంపై కుమ్మక్కు

అవినీతి జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.. కానీ, విచారణను తొక్కిపెట్టాలని చూస్తోంది

- అవినీతిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆరోపణలపర్వం
- ఆ పార్టీల పాలనతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- ఆ రెండు పార్టీలూ ఒకటే.. బీజేపీతోనే అభివృద్ధి
- కుటుంబ, వారసత్వ పార్టీలను నమ్ముకోవద్దు
- దోచుకోవడం, అబద్ధాలు చెప్పడమే వాటి లక్షణం
- బీజేపీ హయాంలోనే తెలంగాణ అభివృద్ధికి పెద్దపీట
- దేశమే నా కుటుంబం.. 140కోట్ల మంది సభ్యులు
- ఇంటిని వదిలిపెట్టి దేశ సేవ కోసం వచ్చాను
- రామాలయ నిర్మాణంలో తెలంగాణ భాగస్వామ్యం
- ఆదిలాబాద్ విజయ సంకల్ప సభలో మోదీ
- పలుమార్లు తెలుగులో మాట్లాడిన ప్రధాని

నేడు పటాన్‌చెరు సభకు మోదీ

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏం చేస్తోంది? కాళేశ్వరం అవినీతిపై విచారణ చేయాల్సి ఉండగా.. తొక్కిపెట్టేందుకు చూస్తోంది. బీఆర్ఎస్‌తో కుమ్మక్కు అవుతోంది. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై మీరు తిన్నారంటే మీరు తిన్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా ఏమీ జరగదు" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలను నమ్ముకోవద్దని, వాటికి వేర్వేరు ముఖాలు ఉండవచ్చునని, కానీ, ఉమ్మడి లక్షణం మాత్రం దోచుకోవడం.. అబద్ధాలు చెప్పడమని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించారు. తెలంగాణలో సోమవారం ప్రధాని మోదీ పర్యటించారు. ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచే దేశవ్యాప్తంగా రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు,

మిగతా 13వ పేజీలో...



కేంద్రంతో ఘర్షణకు వెళ్లం

దాంతో రాష్ట్ర ప్రజలకే నష్టం

- కేంద్రంతో కలిసే ముందుకు
- మోదీ పెద్దన్నలా సహకరించాలి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు
- మెట్రో, మూసీకి నిధులివ్వాలి: రేవంత్

13

ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్

రూ.7300 కోట్లు!

ట్రాన్సాక్షన్ అడ్వైజర్ మజార్స్ నివేదికే ఆధారం

- ఆద్యంతం గోప్యత పాటించిన నాటి ప్రభుత్వం
- రూ.7380 కోట్లకు ఒప్పించిన ఐఏఎస్‌ల కమిటీ
- వచ్చిన సొమ్ము హైదరాబాద్ నగర అభివృద్ధికి, మౌలికవసతులకు కాకుండా రుణమాఫీకి మళ్లింపు



హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డును 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వడానికి గత ప్రభుత్వం నిర్ణయించిన బేస్‌ప్రైస్ ఎంత? ఇన్నాళ్లుగా ప్రశ్నార్థకంగా ఉన్న ఈ అంశానికిప్పుడు సమాధానం దొరికింది. గత ప్రభుత్వం దీనికి నిర్ణయించిన బేస్‌ప్రైస్ రూ.7300 కోట్లు అని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ ప్రక్రియకు అప్పట్లో ఔటర్ ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా నియమించుకున్న మజార్స్ అడ్వైజరీ అనే ఫ్రెంచ్ కన్సల్టెన్సీ సంస్థ నివేదికనే ఆధారంగా చేసుకున్నట్లు తెలిసింది. ఆ సంస్థ నిర్ణయించిన బేస్‌ప్రైస్ ఆధారంగానే టెండర్ ప్రక్రియను చేపట్టారు. కానీ.. టెండర్‌లో పాల్గొన్న సంస్థలకు కూడా బేస్‌ప్రైస్‌ను తెలియజేయలేదు. ప్రభుత్వం ఈ విషయంలో ఆద్యంతం గోప్యత పాటించింది. బంగారుబాతు లాంటి ఔటర్ రింగు రోడ్డును కారుచౌకగా ప్రైవేటు సంస్థకు 30 ఏళ్లకు లీజుకు

మిగతా 12వ పేజీలో...



ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల బీఆర్ఎస్ ముఖ్యనేతలతో భేటీలో కేసీఆర్

ఐదారు నెలల తర్వాత..

ఈ సర్కారుండదు

- మళ్లీ మనదే అధికారం.. పార్టీని వీడినవారితో నష్టంలేదు
- ఎన్టీఆర్ లాంటి నాయకుడికే ఒడుదొడుకులు తప్పలేదు
- టీడీపీని చూసి నేర్చుకోవాలి.. ఓటమి ఒకందుకు మంచిదే
- ప్రజలకు ఎన్నో చేశాం.. మన విలువ త్వరలోనే తెలుస్తుంది
- గుర్రమేదో, గాడిదేదో తెలుసుకునే చాన్స్ ప్రజలకు వచ్చింది
- త్వరలోనే ఖమ్మంలో బహిరంగ సభ: మాజీ సీఎం కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి నలుగురు అభ్యర్థుల పేర్ల వెల్లడి
- బోయినపల్లి వినోద్, కొప్పుల, నామా, మాలోతు కవిత
- కేసీఆర్ సమీక్షకు హాజరుకాని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం
- కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్
- ఖమ్మం బరిలోకి రాహుల్ దిగినా ఎదుర్కొంటాం: నామా


హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వంలోకి వస్తామని కాంగ్రెస్ నేతలెవరూ అనుకోలేదు. వారికి అనుకోకుండా అధికారం వచ్చింది. దీంతో ప్రజలకు మేలు చేసేలా పాలన చేయడం వారికి చేతకావట్లేదు" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఎవరి కుంపటి వారు సర్దుకోవడమే కాంగ్రెస్ నాయకులకు సరిపోతోందని.. ఈ ప్రభుత్వం మరో 5-6 నెలల తర్వాత ఉండదని ఆయన జోస్యం చెప్పారు. "ప్రత్యామ్నాయంగా మళ్లీ మనమే (బీఆర్ఎస్) అధికారం చేపడతాం" అని పార్టీ శ్రేణులతో కేసీఆర్ అన్నట్టు సమాచారం. సోమవారం తెలంగాణ భవన్‌లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు

మిగతా 12వ పేజీలో...

ఇందిరమ్మ ఇల్లు..

స్థలం ఉన్న వారికే

- రేషన్ కార్డు ఉంటేనే పథకానికి అర్హత?
- 11 నుంచి తొలి విడత పథకం అమలు
- భద్రాచలంలో ప్రారంభించనున్న రేవంత్
- నియోజకవర్గానికి 3,500 గృహాలు మంజూరు
- ఈ ఆర్థిక ఏడాది 4,16,500 ఇళ్లు లక్ష్యం
- త్వరలోనే మార్గదర్శకాలు.. లబ్ధిదారుల ఎంపిక
- రెండో దశలో ఇళ్ల స్థలాలు లేని వారికి పథకం



'ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి పరిశీలన పత్రం' ఇలా..

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న లాంఛనంగా ప్రారంభించేందుకు కాంగ్రెస్ సర్కారు కసరత్తులు ముమ్మరం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా భద్రాచలం నుంచి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు పథకం అమలుకు సంబంధించిన కీలక అంశాలపై దృష్టిసారించారు. తొలి విడతలో.. సొంత స్థలం, రేషన్ కార్డు ఉన్న వారికే పథకాన్ని అందించాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రెండో దశలో స్థలాలు లేని వారికి స్థలం అందించి, ఆర్థిక సాయం ఇవ్వనున్నట్టు సమాచారం. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లు మంజూరు కానున్నాయి. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారుకు రూ.5 లక్షలు ఇస్తారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే మార్గదర్శకాలను విడుదల చేసి, ఆ మేరకు లబ్ధిదారులను ఎంపిక

మిగతా 3వ పేజీలో...

ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య డెయిరీ క్లస్టర్!

- దేశవ్యాప్తంగా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం
- 'డెయిరీ ఇండస్ట్రీ' కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి
- పాల ఉత్పత్తిలో రాష్ట్రం నంబర్‌వన్ కావాలి: తుమ్మల

13

మీరొక మంత్రి.. ఆ మాత్రం తెలియదా?



సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను తప్పుబట్టిన సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 4: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. హానికరమైన వ్యాఖ్యలు చేసిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ.. 'ఒక మంత్రిగా ఆ వ్యాఖ్యల పర్యవసానం ఎలా ఉంటుందో మీకు తెలిసే ఉండాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంలో తనపై దాఖలైన కేసులన్నింటినీ కలిపి విచారించాలని కోరుతూ ఉదయనిధి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ), ఆర్టికల్ 25 కింద మీ హక్కుల్ని మీరు దుర్వినియోగం చేశారు. ఇప్పుడు ఆర్టికల్ 32 కింద మీ(సుప్రీంకోర్టులో అభ్యర్థన దాఖలు చేసే) హక్కును వినియోగించుకుంటున్నారు. మీరు చేసిన వ్యాఖ్యల పర్యవసానం ఏమిటో మీకు తెలియదా? మీరేమీ సామాన్యుడు కాదు. మీరొక మంత్రి. పర్యవసానాలు మీకు తెలిసే ఉండాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈనెల 15వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసుల నుంచి ఉదయనిధికి ఉపశమనం కల్పించాలని ఆయన తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఆయనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లన్నింటినీ కలిపి విచారించాలని కోరారు. ఉత్తరప్రదేశ్, కర్ణాటక, బిహార్, జమ్మూకశ్మీర్, మహారాష్ట్రల్లో ఈ ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఉదయనిధి గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన ఒక సదస్సులో మాట్లాడుతూ సామాజిక న్యాయానికి, సమానత్వానికి సనాతన ధర్మం వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. దాన్ని నిర్మూలించాలన్నారు. ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆయన వ్యాఖ్యలు వివాదాన్ని సృష్టించాయి.

హైకోర్టు స్థలంలో ఆప్ కార్యాలయమా?

» జూన్ 15లోగా ఖాళీ చేయండి.. సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 4: హైకోర్టుకు కేటాయించిన స్థలంలో ఆప్ ప్రధాన కార్యాలయం నిర్మించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. జూన్ 15లోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. ప్రత్యామ్నాయ స్థలం కోసం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసేందుకు అనుమతి ఇచ్చింది. దరఖాస్తుపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ల్యాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసుకు సూచనలు ఇచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీ హైకోర్టు విస్తరణ కోసం కేటాయించిన స్థలంలో ఆప్ కార్యాలయాన్ని నిర్మించడం ఆక్రమణల కిందకే వస్తుందని గత నెలలో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కోర్టు ఉత్తర్వుల మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తో సమావేశం జరిపిన ఢిల్లీ ప్రభుత్వ అధికారులు రెండు నెలల్లోగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగకపోవడంతో జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోకం తీరు



చండీగఢ్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం

చండీగఢ్, మార్చి 4: చండీగఢ్ సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ఆ పార్టీకి చెందిన కుల్జీత్ సంధూ 19 ఓట్లతో సీనియర్ డిప్యూటీ మేయర్‌గా, రాజిందర్ శర్మ 19 ఓట్లతో డిప్యూటీ మేయర్‌గా ఇండియా కూటమి అభ్యర్థులపై గెలుపొందారు. ఇండియా కూటమి(ఆప్+కాంగ్రెస్) తరపున సీనియర్ డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన గురుప్రీత్ సింగ్‌కు 16 ఓట్లు వచ్చాయి. డిప్యూటీ మేయర్ అభ్యర్థి నిర్మలాదేవికి 17 ఓట్లు వచ్చాయి. సీనియర్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఒక ఓటు చెల్లలేదు. ఈ ఎన్నికలకు మేయర్ కుల్దీప్‌కుమార్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. జనవరి 30న నిర్వహించిన చండీగఢ్ మేయర్ ఎన్నికలు, ప్రిసైడింగ్ ఆఫీసర్ అనిల్ మాసిహ్ బ్యాలెట్లపై గుర్తులను చెరపడం తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అప్పుడు అనిల్ మాసిహ్.. బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను మేయర్‌గా ప్రకటించారు. వెంటనే మనోజ్.. సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించి కుల్జీత్ సంధూ, రాజిందర్ శర్మలను విజేతలుగా ప్రకటించారు. అయితే, మేయర్ ఎన్నిక వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లింది. కోర్టు మనోజ్ సోంకర్‌ను కాదని ఆప్ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌ను మేయర్‌గా ప్రకటించింది. దీంతో, సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలను సోమవారం మళ్లీ నిర్వహించారు.

ఎన్నికల బాండ్ల సమాచారం ఇచ్చేందుకు జూన్ 30 వరకు గడువు ఇవ్వండి: ఎస్బీఐ

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్లపై మొత్తం సమాచారాన్ని ఇచ్చేందుకు గడువు పెంచాలని ఎస్బీఐ సోమవారం సుప్రీంకోర్టును కోరింది. ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని గత నెల 15న తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు.. వాటి జారీని నిలిపివేయాలని తెలిపింది. ఇంతవరకు జారీ చేసిన మొత్తం బాండ్ల సమాచారాన్ని ఈ నెల 6వ తేదీలోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలని స్టేట్ బ్యాంకును ఆదేశించింది. ఆ వివరాలను మార్చి 13లోగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ఎన్నికల సంఘానికి సూచించింది. అయితే ఇందుకు తగినంత సమయం లేనందున వివరాల సమర్పణకు జూన్ 30 వరకు గడువు పెంచాలని స్టేటు బ్యాంకు కోరింది. 2012 ఏప్రిల్ 12 నుంచి 2024 ఫిబ్రవరి 15 వరకు తాము వివిధ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు 22,217 బాండ్లను జారీ చేశామని స్టేట్ బ్యాంక్ తెలిపింది. మొత్తం 44,434 సమాచార పత్రాలను డీకోడ్ చేసి సమీకరించి, పోల్చి, వివరాలను తయారు చేయాల్సి ఉంటుందని వివరణ ఇచ్చింది. ఇందుకు గడువు పెంచాలని కోరింది. ఈ విజ్ఞప్తి చేయడం ద్వారా లోక్‌సభ ఎన్నికలయ్యేంత వరకూ ఎస్‌బీఐ తప్పించుకోవాలని భావిస్తోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

క్యాన్సర్‌ను జయించిన ఇస్రో చైర్మన్

» ఆదిత్య-ఎల్1 ప్రయోగం రోజే బయటపడిన వ్యాధి

» ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన సోమనాథ్



న్యూఢిల్లీ, మార్చి 4: చంద్రయాన్-3 ప్రయోగం విజయంతో భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ కేన్సర్ బారినపడ్డారు. ఇస్రో తొలి సోలార్ విషన్ ఆదిత్య-ఎల్1 ప్రయోగం చేపట్టిన రోజే ఈ చేదు నిజం బయటపడింది. 'తార్మాక్ మీడియా హౌస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూ సందర్భంగా ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. "చంద్రయాన్-3 ప్రయోగ సమయంలోనే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. సెప్టెంబరు 2, 2023న ఆదిత్య-ఎల్1 ప్రయోగం రోజు కడుపులో సమస్యగా ఉందని వైద్య పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్ అని తేలింది. కడుపులో క్యాన్సర్ కణితి పెరిగిందని, అది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి అని నిర్ధారణ అయింది. ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు శస్త్రచికిత్సతోపాటు కీమోథెరపీ కూడా తీసుకున్నాను" అని సోమనాథ్ పేర్కొన్నారు. "చికిత్స నిమిత్తం నాలుగు రోజులే ఆస్పత్రిలో ఉన్నా. ఐదో రోజు నుంచి ఇస్రోలో రోజువారీ విధులు నిర్వర్తించా. ప్రస్తుతం నేను పూర్తిగా కోలుకున్నాను" అని సోమనాథ్ చెప్పారు.

మహువా అభ్యర్థనను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 4: లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురైన టీఎంసీ నేత మహువా మొయిత్రాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు లంచం తీసుకున్నట్లు తనపై జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుకోవాలన్న మొయిత్రా అభ్యర్థనను సోమవారం కోర్టు తోసిపుచ్చింది. పార్లమెంటులో మోదీ సర్కారును ఇరుకున పెట్టే ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందని నుంచి రూ.2 కోట్ల నగదుతో పాటు ఖరీదైన కానుకలను లంచంగా స్వీకరించారంటూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే, న్యాయవాది అనంత్ దేహ్రాదాయ్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అలాగే పార్లమెంటరీ వెబ్‌సైట్‌లో ప్రశ్నలను పోస్టు చేసేందుకు లాగిన్ అయ్యేందుకు ఐడీ, పాస్‌వర్డ్‌ను కూడా ఇచ్చారంటూ మొయిత్రాపై ఆరోపణలు వచ్చాయి.

లోక్‌సభ బరి నుంచి తప్పుకొన్న బీజేపీ ఎంపీ రావత్

లఖ్‌నవూ, మార్చి 4: ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ సిటింగ్ ఎంపీ, తాజా అభ్యర్థి ఉపేంద్రసింగ్ రావత్ ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్లు సోమవారం ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలోనే రావత్ పేరు ఉంది. అయితే ఆయనకు సంబంధించిన అభ్యంతరకరమైన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. వీడియోలో రావత్ ఓ విదేశీ మహిళతో అభ్యంతరకర స్థితిలో ఉన్నట్లుగా చూపారు. ఆయనకు బీజేపీ టికెట్ ఖరారైన వెంటనే ఈ వీడియో వైరల్ కావడం గమనార్హం. అయితే అది నకిలీ వీడియో అంటూ రావత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యర్థులు డీప్‌ఫేక్ టెక్నాలజీతో ఈ దారుణ చర్యకు ఒడిగట్టారని ఆరోపించారు. "నేను ఏ తప్పూ చేయలేదని తేలే వరకు ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయను" అని రావత్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మోదీ ఓ అబద్ధాల మాంత్రికుడు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, మార్చి 4: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కోసం వివిధ రాష్ట్రాల్లో పర్యటనలకు కదిలిన ప్రధాని మోదీ తీరును కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విమర్శించింది. మోదీ ప్రారంభించేందుకు సంకల్పించిన ప్రాజెక్టుల్లో దాదాపు అన్నీ ఆయన ప్రధాని కాకముందే పూర్తి చేసిన ప్రాజెక్టులో లేదంటే విస్తరించిన ప్రాజెక్టులే ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ దాకా తెలంగాణ, తమిళనాడు, ఒడిసా, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో పర్యటించనున్న మోదీ, ఆ రాష్ట్రాల్లో 1,10,600 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో మోదీపై 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. మోదీ ప్రారంభించనున్న ప్రాజెక్టులన్నీ ఆయన ప్రధాని కాకముందు నాటివేనని, ఆయన ఓ 'అబద్ధాల మాంత్రికుడు' (జూట్ కే జాదూగర్) అని, మీడియాను తన చుట్టూ తిప్పుకోవడం కోసం, ఫొటోల కోసం ఈ ప్రాజెక్టులను ఓ అవకాశంగా తీసుకున్నారని విమర్శించారు. తమిళనాడు కల్పకంలోని ప్లుటోనియం ఫాస్ట్ బ్రీడ్ రియాక్టర్ 22 ఏళ్ల క్రితమే ప్రారంభమైందని, పదేళ్ల క్రితం తాను అక్కడికి వెళ్లినప్పుడు 95శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని, ఇదంతా కూడా మోదీనే పూర్తిచేసినట్లుగా క్రియేట్ చేస్తున్నారని చెప్పారు.

చట్టాలకు మీరేమీ అతీతులు కాదు!

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి నిరోధక చట్టం కింద విచారించ వలసిందేనని స్పష్టం చేసింది. ఇలాంటివారు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ పొందలేరని పేర్కొంది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఇదే సమయంలో అవినీతి, లంచాల కేసుల విషయంలో చట్టసభ సభ్యులకు అనుకూలంగా 1998లో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టి వేసింది. "1998లో ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 105(2), 194(2)లకు పూర్తి విరుద్ధంగా ఉంది. అందుకే ఆ తీర్పును కొట్టేస్తున్నాం" అని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా వెల్లడించింది. "1998నాటి పీవీ నరసింహారావు కేసు విషయంలో ఇచ్చిన తీర్పుతో మేం విభేదిస్తున్నాం. ఆ తీర్పులో చట్ట సభల సభ్యులు లంచాలు తీసుకుని ఓటు వేసిన కేసుల్లో విచారణ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇది అనేక పర్యవసానాలకు దారితీస్తోంది" అని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. అంతేకాదు, రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసే ఎమ్మెల్యేలు లంచం తీసుకుంటే వారిని కూడా అవినీతి నిరోధక చట్టం కింద విచారణ చేయాల్సిందేనని ధర్మాసనం తేల్చి చెప్పింది.

అప్పట్లో ఏం జరిగింది?

1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం పార్లమెంటులో అవిశ్వాసాన్ని ఎదుర్కొంది. మైనారిటీలో ఉన్న పీవీ సర్కారు 265 ఓట్ల స్వల్ప మార్జిన్‌తో గట్టెక్కింది. పీవీ సర్కారుకు వ్యతిరేకంగా 251 ఓట్లు పడ్డాయి. ఆ తర్వాత ఏడాది పెద్ద కుంభకోణం వెలుగు చూసింది. పీవీ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసేందుకు జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) సహా ఐదు పార్టీల ఎంపీలు లంచాలు తీసుకున్నారనే ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ కేసును సీబీఐ విచారించింది. అయితే, ఆరోపణలు వచ్చిన సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన న్యాయస్థానం సభలో జరిగే కార్యకలాపాల(ఓటు వేయడం, ప్రసంగించడం)కు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ ఉంటుందని తీర్పు వెలువరించింది.

తాజా కేసు ఇదీ..

2012లో జార్ఖండ్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో జేఎంఎం అధినేత శిబు సొరేన్ కోడలు, ఆ పార్టీ ఎమ్మెల్యే సీతా సొరేన్ ఓ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు లంచం తీసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేయడంతో ఆమె తొలుత హైకోర్టును ఆశ్రయించారు. కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు. హైకోర్టు తిరస్కరించడంతో 2014లో సీతా సొరేన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తొలుత ముగ్గురు సభ్యుల ధర్మాసనం దీనిని విచారించింది. అయితే, 1998 నాటి సుప్రీం తీర్పును ఉటంకించడంతో దీనిని పరిశీలిస్తామని తెలిపింది. ఈ పిటిషన్‌ను 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్.. ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి రిఫర్ చేశారు. 1998 నాటి తీర్పును పునఃపరిశీలన చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో గత ఏడాది సెప్టెంబరు 20న నాటి తీర్పుపై ధర్మాసనం పునఃపరిశీలన చేసేందుకు అంగీకరించింది. తాజాగా తీర్పు వెలువరించింది. కాగా, మోదీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా గతంలో సుప్రీం ఇచ్చిన తీర్పును వ్యతిరేకించారు. ప్రజా ప్రతినిధులు నిర్భయంగా తమ విధులు నిర్వహించి, ఓటు వేసేందుకే వారికి ఆర్టికల్ 105 భద్రత కల్పించిందని, ముడుపులు తీసుకునేందుకు కాదని వాదించారు. పార్లమెంట్ లోపల ముడుపులకు ఒప్పందం కుదిరినంత మాత్రాన ప్రజా ప్రతినిధులు చట్టానికి అతీతులు కాదన్నారు.

ఈ ఆర్టికల్స్ ఏమిటి?



రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 105, 194 ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ విధులను నిర్భయంగా నిర్వర్తించే క్రమంలో న్యాయపరమైన విచారణ నుంచి రక్షణ కల్పిస్తున్నాయి. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. చర్చలు, అభిప్రాయాల వెల్లడిలో సభ్యులకు రక్షణగా నిలుస్తున్నాయని తెలిపింది.

గొప్ప తీర్పు: మోదీ

న్యూఢిల్లీ, మార్చి 4 : జేఎంఎం లంచం కేసులో సుప్రీం కోర్టు తీర్పును ప్రధాని మోదీ ప్రశంసించారు. "గౌరవనీయ సుప్రీంకోర్టు గొప్ప తీర్పు ఇచ్చింది.. తద్వారా స్వచ్ఛ రాజకీయాలకు గ్యారెంటీ ఉంటుంది... ప్రజలకు వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుంది..." అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. సుప్రీం తీర్పును కాంగ్రెస్ పార్టీ కూడా స్వాగతించింది. ఈ తీర్పు అవసరమని, ఇప్పటికే ఈ నిర్ణయం తీసుకుని ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ ఈ విషయమై ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ... ఇది ఏళ్లుగా సరిచేయకుండా ఉన్న అంశం అన్నారు. సుప్రీం తీర్పు వాంఛనీయం, అలాంటి తీర్పు ఇచ్చినందుకు వందనం.. స్వాగతం.. అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి విధులు సజావుగా నిర్వహించేందుకు మాత్రమే రాజ్యాంగం రక్షణ కల్పించిందని, లంచాలు తీసుకొనేందుకు కాదని సింఘ్వీ పేర్కొన్నారు. చట్టసభల సభ్యుల అవినీతి, లంచగొండితనం దేశ పార్లమెంటరీ డెమొక్రసీ పునాదులనే పెకలించి వేస్తుందని ఆయన చెప్పారు.

'పీవీ కేసు' తీర్పు వైరుధ్యాల పుట్ట

న్యూఢిల్లీ, మార్చి 4: ప్రజాప్రతినిధులకు కల్పించిన రాజ్యాంగ రక్షణలు లంచాలు, ఓటుకు నోటు వంటి అవినీతి అభియోగాలను ఎదుర్కొనే సందర్భంలో వర్తించబోవని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది. ఇంతకీ, ప్రజాప్రతినిధులకు రాజ్యాంగంలో కల్పించిన రక్షణలు ఏమిటనేది పరిశీలిస్తే.. రాజ్యాంగంలో ప్రధానంగా 105, 194 అధికరణలు ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఉన్న రక్షణలను తెలియజేస్తున్నాయి. చట్టపరమైన చర్యలకు గురవుతామేమోనన్న భయ సందేహాలకు తావులేకుండా ప్రజాప్రతినిధులు తమ విధులను నిర్భీతిగా నిర్వర్తించేందుకు ఈ అధికరణలను రాజ్యాంగంలో పొందుపరిచారు. ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగాలని, తమ ఓటింగ్ అధికారాలను సమర్థంగా వినియోగించుకోవాలని రాజ్యాంగకర్తలు భావించారు. చట్టసభల్లో ప్రజా ప్రతినిధుల వ్యాఖ్యలు, ఓటింగ్‌పై కోర్టుల్లో ప్రశ్నించకుండా రక్షణలు కల్పించారు. అయితే, వీరిపై చర్యలకు స్పీకరుకు అధికారం ఉంటుంది. అయితే, తాజా తీర్పులో సుప్రీంకోర్టు "ప్రజాప్రతినిధులు లంచాలు తీసుకోవడం చట్టసభ సభ్యులుగా వారి విధులతో ఎటువంటి సంబంధం లేని స్వతంత్ర నేరం. అందువల్ల సభ్యులకు లభిస్తున్న రాజ్యాంగ రక్షణ ఇటువంటి కేసుల్లో వారిని కాపాడలేదు. ఒకవేళ ఇటువంటి కేసుల్లో రక్షణ కల్పిస్తే, అనియంత్రిత మినహాయింపులు పొందే ఒక బృందం సమాజంలో తయారవుతుంది. అది పార్లమెంటరీ ప్రజాతంత్రం పనితీరును నిర్వీర్యం చేస్తుంది" అని పేర్కొంది. "పీవీ నరసింహారావు కేసులో తీర్పు పరస్పర వైరుధ్యాల పుట్టలా తయారైంది" అని రాజ్యాంగ ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

విద్యుత్ రంగంలో అగ్రగామిగా భారత్

ఈ ప్రయాణంలో తమిళనాడు పాత్ర కీలకం: మోదీ

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెడతామని, దీనిలో తమిళనాడు కీలకపాత్ర పోషించనుందని ప్రధాని మోదీ అన్నారు. తమిళనాట 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 'ప్రొటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' (పీఎఫ్‌బీఆర్)ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ తరహా రియాక్టర్‌ను దేశంలోనే తొలిసారిగా కల్పాక్కంలో ఏర్పాటు చేయడం విశేషం. సోమవారం మోదీ చెన్నైలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ' పథకం ద్వారా కోటి కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని, దీనికోసం రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని మోదీ ప్రకటించారు. స్థానిక వైఎంసీఏ మైదానంలో జరిగిన బహిరంగసభలో మోదీ మాట్లాడుతూ.. ముఫ్త్ బిజిలీ పథకం వల్ల ప్రజలు ఇంట్లోనే ఉంటూ.. సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని చెప్పారు. ఇలా ప్రజలు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను కేంద్రం కొనుగోలు చేస్తుందని అన్నారు. అంటే ప్రజలు ఇంట్లోనే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చని వివరించారు. తాను చెన్నై వస్తున్నానంటేనే కొందరికి కడుపు నొప్పి వస్తోందని, రోజురోజుకు ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణే కారణమని డీఎంకే, కాంగ్రెస్ పార్టీలనుద్దేశించి ఎద్దేవా చేశారు. డీఎంకే పాలకులు చేస్తున్న అవినీతిని అడ్డుకుంటున్నామని, వారు అక్రమంగా సంపాదించిన దాన్ని కక్కిస్తామని మోదీ హెచ్చరించారు.

మోదీ కా పరివార్!

వచ్చే ఎన్నికల్లో ఇదే బీజేపీ నినాదం!

» మోదీకి కుటుంబమే లేదన్న లాలూ వ్యాఖ్యలపై ఫైర్

» దేశమే తన కుటుంబమన్న ప్రధాని మోదీ

» 'ఎక్స్'లో తమ పేర్ల చివర 'పరివార్' చేర్చిన కేంద్ర మంత్రులు, బీజేపీ సీనియర్లు



అమిత్ షా ఎక్స్ ప్రొఫైల్‌లో 'మోదీ కా పరివార్' క్యాప్షన్

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీని 'చౌకీదార్ చోర్ హై' అని ఎద్దేవాచేసి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ బీజేపీకి మంచి ప్రచారాస్త్రాన్ని అందించారు. తాజాగా ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్.. కుటుంబ పాలనను వ్యతిరేకిస్తున్న మోదీకి కుటుంబమే లేదని పట్నాలో ఆదివారం వ్యాఖ్యానించారు. అంతే.. అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతామన్ వంటి కేంద్ర మంత్రుల నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా సీనియర్ నేతల వరకు.. తమను తాము మోదీ కుటుంబంగా పేర్కొంటూ సోమవారం 'ఎక్స్'లో తమ పేరు పక్కన 'మోదీ కా పరివార్' అన్న నినాదాన్ని చేర్చారు. వచ్చే ఎన్నికలకు ఇది వారి ప్రచారాస్త్రంగా మారింది. అటు ప్రధాని కూడా తెలంగాణలో జరిగిన సభలో లాలూ వ్యాఖ్యలపై స్పందించారు. యావద్దేశం తన కుటుంబమేనని ఉద్ఘాటించారు. 'నా జీవితం తెరచిన పుస్తకం. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు నా కుటుంబమే. ఏ తోడూ లేనివారికి మోదీ ఉన్నాడు. మోదీకి వారంతా ఉన్నారు. నా యావజ్జీవితం పేదలకు అంకితం' అని తెలిపారు. ప్రస్తుతం దేశమంతటా ఇదే చర్చనీయాంశమైంది. లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీ చేతికి ఆర్‌జేడీ గట్టి అంశాన్ని ఇచ్చిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. 2019 ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ రాఫెల్ జెట్ల కొనుగోలుపై ఆరోపణలు చేస్తూ 'చౌకీదార్ దొంగ(చోర్ హై)' అని విమర్శించారు. అప్పుడు మోదీ 'మై భీ చౌకీదార్ (నేను కూడా చౌకీదార్‌నే)' అనే నినాదాన్ని సృష్టించారు. బీజేపీ నేతలంతా అదే కోణంలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'మోదీపై విపక్షాల వ్యక్తిగత విమర్శలు ఇంతవరకు పనిచేయకపోగా.. వాటినే దెబ్బతీశాయి. 2014లో కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్.. చాయ్‌వాలా అంటూ మోదీని ఎద్దేవా చేయడం కాంగ్రెస్‌ను ఓటమిపాలు చేసింది. ఇప్పుడు ఇండియా కూటమి వంతు' అని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

'ఇండియా' ఎదుగుతోందనే

ఎన్నికల వేళ అసలు అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీ 'మోదీ కా పరివార్' నినాదాన్ని అందుకుందని కాంగ్రెస్ ఆరోపించింది. విపక్ష ఇండియా కూటమి ప్రజాదరణ పొందుతుండడం ఆ పార్టీని ఆందోళనకు గురిచేస్తోందని వ్యాఖ్యానించింది. 'మోదీ కుటుంబంలో మణిపూర్ మహిళలకు చోటు ఉంటుందా? ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులను మోదీ తన కుటుంబమేనని చెబుతారా? ఆత్మహత్యలకు పాల్పడుతున్న నిరుద్యోగులను మోదీ తన కుటుంబమని ఎందుకు చెప్పుకోరు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ కూడా తన బయోకు 'మోదీ కా పరివార్'ను యాడ్ చేశారు..

ప్రతి మహిళకు నెలకు 1,000


» లోక్‌సభ ఎన్నికల వేళ బడ్జెట్‌లో కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రకటన

» రూ.2వేల కోట్ల కేటాయింపు..18 ఏళ్లు పైబడినవారు అర్హులు

న్యూఢిల్లీ/సిమ్లా, మార్చి 4: ఢిల్లీలోని అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,000 ఇవ్వనున్నట్టు సోమవారం ప్రకటించింది. 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన' కింద 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి దీన్ని అమలు చేయనుంది. ఆర్థిక మంత్రి అతిషి మర్లేనా ఢిల్లీ అసెంబ్లీలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.76,000 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మహిళలకు ఆర్థిక ప్రయోజనం కల్పించే పథకాన్ని ప్రకటించారు. 'రామ రాజ్యం' కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. 18 ఏళ్లు లేదా పైబడిన ప్రతి మహిళలకు కేజ్రీవాల్ ప్రభుత్వం నెలకు రూ.1,000 ఇస్తుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పథకాన్ని ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రూ.2,000 కోట్లు కేటాయించింది. ఈ పథకం మహిళా సాధికారత దిశగా ప్రపంచంలోనే అతిపెద్ద ముందడుగు అని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'ను అమలు చేస్తామని చెప్పారు. ఈ పథకం ద్వారా సుమారుగా 45-50 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

హిమాచల్ మహిళలకు నెలకు రూ.1,500

హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు సోమవారం ఆ రాష్ట్ర మహిళలకు శుభవార్త ప్రకటించారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉన్న మహిళలకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి నెలకు రూ. 1500 ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని కోసం బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ. 800 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందిరాగాంధీ ప్యారీ బెహ్నా సుఖ్ సమ్మాన్ నిధి యోజనా పేరుతో ప్రారంభిస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 5 లక్షల మంది మహిళలు లబ్ధి పొందనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన పది గ్యారెంటీల్లో ఐదో హామీని నెరవేర్చినట్లు సుఖ్విందర్ సింగ్ వెల్లడించారు.



ఈడీ విచారణకు ఎనిమిదోసారీ కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేజ్రీవాల్ ఈడీ విచారణకు ఎనిమిదోసారి కూడా హాజరు కాలేదు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కొంతకాలంగా ఈడీ సమన్లను తిరస్కరిస్తూ వస్తున్న కేజ్రీవాల్.. సోమవారం కూడా విచారణకు వెళ్లలేదు. అయితే మార్చి 12 తర్వాత మాత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాను విచారణకు హాజరవుతానని కేజ్రీవాల్ ఈడీకి తెలిపారు. ఈడీ సమన్లు చట్టవిరుద్ధమని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీ మద్యం విధానంలో మనీలాండరింగ్ జరిగిందనే ఆరోపణలతో గతేడాది నవంబర్ 2న తొలిసారిగా కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది.

కొలంబియాలో ట్రంప్‌పై నిక్కీ హేలీ పైచేయి

» ప్రైమరీ ఎన్నికల్లో 62.9% ఓట్లు



వాషింగ్టన్, మార్చి 4: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలోకి దిగేందుకు పోటీపడుతున్న భారత సంతతికి చెందిన నిక్కీ హేలి ఆదివారం తన తొలి విజయాన్ని నమోదు చేసుకున్నారు. కొలంబియాలో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ఆమె గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఆమెకు 1,274 ఓట్లు(62.9%) దక్కాయి. ఆమె ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్ 676(33.2%) ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో రేసులో దూసుకుపోతున్న డొనాల్డ్ ట్రంప్ విజయ పరంపరకు బ్రేక్ పడింది. అయితే, ట్రంప్‌ను అధిగమించడానికి మంగళవారం జరగనున్న 15 రాష్ట్రాల ప్రైమరీల్లో నిక్కీ భారీ విజయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది.

అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పోటీకి తొలగిన అడ్డంకులు

వాషింగ్టన్, మార్చి 4: ట్రంప్‌నకు సోమవారం ఆ దేశ సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి అడ్డంకులు తొలగిపోయాయి. గత అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని అంగీకరించని ట్రంప్ క్యాపిటల్ హిల్‌పై దాడి చేయించారని, అమెరికా రాజ్యాంగం ప్రకారం ఆయన ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదని కొలరాడో, ఇల్లినాయి తదితర రాష్ట్రాలు నిషేధం విధించాయి. అయితే, ఇలాంటి అంశాలపై అమెరికా కాంగ్రెస్ మాత్రమే నిర్ణయం తీసుకోగలదని, రాష్ట్రాలకు ఆ అధికారం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అమెరికాలో ముసుగు వ్యక్తుల కాల్పుల్లో నలుగురి మృతి

కింగ్‌సిటీ (యూఎస్), మార్చి 4: సెంట్రల్ కాలిఫోర్నియాలోని కింగ్ సిటీలో ముసుగులు ధరించిన వ్యక్తులు కాల్పులు జరపడంతో నలుగురు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఒక ఇంటి బయట అవుట్‌డోర్ పార్టీ జరుగుతుండగా నల్లని ముసుగులు, దుస్తులు ధరించిన ముగ్గురు వ్యక్తులు సిల్వర్ రంగు కారులో వచ్చి కాల్పులు జరిపారు. వెంటనే ఆదే కారులో పరారయ్యారు. సంఘటన స్థలంలో ముగ్గురు పురుషులు ప్రాణాలు కోల్పోగా, మరో మహిళ ఆస్పత్రిలో మరణించారు. వారెవరు, ఎందుకు కాల్పులు జరపారన్నది ఇంకా తెలియరాలేదు.

ఇందిరమ్మ ఇల్లు.. స్థలం ఉన్న వారికే

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా.. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, గృహ జ్యోతి, రైతు భరోసా, చేయూత పథకాలకు దరఖాస్తులను స్వీకరించింది. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షల్లో దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు భావిస్తున్నారు. దాదాపు 30-40 లక్షల మంది అర్హులు ఉండొచ్చని అంచనా వేస్తున్నట్టు సమాచారం. పథకం కోసం వచ్చిన దరఖాస్తుల్లో చాలా వాటిలో లబ్దిదారులు రేషన్ కార్డు నంబర్లు వేయలేదు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత లబ్ధిదారుల సంఖ్యలో హెచ్చుతగ్గులు ఉంటాయని సర్కారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. అవసరమైతే గ్రామ సభల్లోనూ మరోసారి ఆయా దరఖాస్తులను పరిశీలించనున్నారు. అయితే గ్రామ సభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక నమూనా పత్రాన్ని సిద్ధం చేసింది. దాని ప్రకారమే దరఖాస్తుదారుల వివరాలను సేకరించనున్నట్టు తెలుస్తోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు అర్హులా..? అనర్హులా..? అనే అంశాన్ని ప్రభుత్వం మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి ఖరారు చేయనుంది. మార్గదర్శకాల విడుదల అనంతరం ఇందుకోసం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని నిర్ణయించింది. గ్రామం నుంచి మొదలుకుని మునిసిపాలిటీల్లోని వార్డుల వరకు ప్రత్యేక పరిశీలన అధికారి, పలు బృందాలతో సభలను నిర్వహించనున్నట్టు సమాచారం. ఆ సభల్లో దరఖాస్తుదారులు పథకానికి అర్హులా..? కాదా..? అనే విషయాలను తేల్చేందుకు సర్కారు ప్రత్యేకంగా 'క్షేత్రస్థాయి పరిశీలన పత్రం' తయారుచేసింది. అందులో దరఖాస్తుదారు ఆధార్, రేషన్ కార్డు నంబర్లను అడిగారు. దీని ప్రకారం ఇందిరమ్మ ఇల్లు పొందాలంటే కచ్చితంగా ఆహార భద్రత కార్డు ఉండాల్సిందేనని స్పష్టమవుతోంది. అన్ని వివరాలతో పాటు ఆహార భద్రత కార్డు నంబరును కూడా క్షేత్రస్థాయి పరిశీలన బృందం నమోదు చేయనుంది. దీంతో పాటు దరఖాస్తుదారు గ్రామంలో ఎప్పటి నుంచి నివాసం ఉంటున్నారనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. దరఖాస్తుదారులు అర్హులు అయి, ఇంటి స్థలం ఉన్న వారైతే.. ఆ స్థలం సొంతమేనా..? డీ- ఫాం పట్టానా..? లేదా పూర్వీకుల నుంచి వచ్చిందా..? అనే వివరాలను సేకరించనున్నారు. ఇంటి స్థలం లేని వారు.. స్థలం ఇవ్వాలని కోరేలా పరిశీలనా పత్రంలో ఆప్షన్ పెట్టారు. సిమెంటు రేకుల షెడ్డు ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే అనర్హులుగా పరిగణించనున్నారు. కాగా, ఈ మొత్తం ప్రక్రియ కోసం గ్రామస్థాయి సిబ్బందిని వినియోగించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది.

సీఎం భద్రాద్రి పర్యటనపై కసరత్తు

భద్రాచలం, మార్చి 4: సీఎం హోదాలో రేవంత్ రెడ్డి తొలిసారిగా ఈ నెల 11న భద్రాచలం వస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఆయన పర్యటన కోసం కసరత్తులు ప్రారంభించింది. సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగానికి దిశానిర్దేశం చేసేందుకు కలెక్టర్ ప్రియాంక మంగళవారం సమావేశం నిర్వహించనున్నారు. కాగా, ఏప్రిల్ 17న శ్రీరామనవమి వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తారని అధికారులు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే ఆయన రామయ్య దర్శనానికి వచ్చి ఆలయ అభివృద్ధిపై ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

11 నుంచి పథకం ప్రారంభం

సత్తుపల్లి, మార్చి 4: ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 11న భద్రాచలంలో ప్రారంభిస్తారని సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అదే రోజు సీతారామ ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి సమీక్షిస్తారని తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి అధికారుల సమావేశం, మునిసిపల్ బడ్జెట్ సమావేశాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేశామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపట్టారని, ఇప్పటికే మెగా డీఎస్సీ చేపట్టారని తెలిపారు. ఏ ఏ శాఖల్లో ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉందో గుర్తించి, అవసరాన్ని బట్టి వెంటనే పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. గడిచిన 75 రోజుల్లో 25 వేల ఉద్యోగాలను ఇచ్చామని తెలిపారు. ధరణి ప్రక్షాళనలో భాగంగా కమిటీని నియమించామని, ఆ కమిటీ నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈలోగా ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 2లక్షలకు పైగా దరఖాస్తులను పరిష్కరించేందుకు అన్ని స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేశామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న పొంగులేటి

ఇద్దరే విద్యార్థులు.. ఒక ఉపాధ్యాయుడు

» నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి పాఠశాలలో పరిస్థితి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 4: ఆ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే చదువుకుంటుండగా, వారికి బోధించేందుకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ పరిస్థితి నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థులు 1వ తరగతి చదువుతుండగా, వారికి ఒక ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. ఈ పాఠశాలలో గతేడాది 28 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేసేవారు. అయితే ఈ ఏడాది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీంతో ప్రస్తుతం పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులే మిగిలారు. ఒక ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి మాత్రం ప్రస్తుతం అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు.



పాఠశాలకు హాజరైన ఇద్దరు విద్యార్థులు

గొలుసుకట్టు పెట్టుబడులే ఉరితాడై..

(మొదటి పేజీ తరువాయి)

భారీగా డబ్బులు కట్టారు. ఇదంతా అతడికి పరిచయమైన ఓ వ్యక్తి తమ సంస్థలో పెట్టుబడి పెడితే బాగా డబ్బులొస్తాయని నమ్మించడం తోనే కట్టించాడు. అయితే డబ్బులేమీ రాకపోగా.. పెట్టుబడి పెట్టిన డబ్బంతా పోవడం, ఊరి జనం ఒత్తిడి చేయడంతో చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను చనిపోయే ముందు తన ముగ్గురు పిల్లలను చంపేశాడు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగటూర్‌లో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. టంగటూర్‌కు చెందిన నీరటి రవికుమార్ (35) అలియాస్ చిట్టి కొన్నేళ్లుగా ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య లత, పిల్లలు సాయి కిరణ్ (13), మోహిత్ (10), ఉదయ్ (7) ఉన్నారు. రవి తల్లి కూడా ఈ కుటుంబంతోనే ఉంటోంది. సాయి కిరణ్, మోహిత్ మొయినాబాద్ మండలంలో చిలుకూరు హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. చిన్న కుమారుడైన ఉదయ్, తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం అతడికి ఏపీలోని గుంటూరుకు చెందిన జీఎస్ఎన్ ఫౌండేషన్‌లో పనిచేసే తిరుపతి రెడ్డితో పరిచయమైంది. జీఎస్ఎస్ సంస్థలో గొలుసు కట్టు పథకం కింద పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలొస్తాయని తిరుపతి చెప్పడంతో రవి నమ్మాడు. గ్రామంలోని రైతులు, యువకులు, మహిళల నుంచి, చుట్టు పక్కల గ్రామాల నుంచి కనీసం వెయ్యి నుంచి రూ.20 లక్షల దాకా పెట్టుబడుల రూపంలో జీఎస్ఎస్ సంస్థలో కట్టించాడు. తొలుత కట్టినవారికి 20 నెలల పాటు డబ్బు చెల్లించడంతో సంస్థలో పెట్టుబడి పెట్టేందుకు ఇతరులు ఆసక్తి చూపారు. ఫలితంగా దాదాపు రూ.20 కోట్ల మేర రవిని నమ్మి కట్టారు. అయితే చాలామందికి పెట్టుబడులు పెట్టినా 3నెలలుగా సంస్థ నుంచి డబ్బులు రాకపోవడంతో తమ డబ్బులు ఇప్పించాలని రవిపై 15 రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం భార్య లతతో రవి గొడవ పడగా ఆమె, చిన్న కుమారుడు ఉదయ్‌ను ఇంట్లోనే వదిలేసి ఒక్కత్తే బుల్కాపూర్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. అదేరోజు రవి చిలుకూరు హాస్టల్‌కు వెళ్లాడు. పిల్లలకు కటింగ్ చేయించి, దిగబెడతానని నిర్వాహకులకు చెప్పి సాయి కిరణ్, మోహిత్‌ను ఇంటికి తీసుకొచ్చాడు. రాత్రి ఈ ఇద్దరు పిల్లలతో పాటు ఉదయ్‌ను నైలాన్ తాడుతో ఉరేసి చంపి.. మంచానికి కట్టేశాడు. తర్వాత.. గ్రామ శివార్లో నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకొని ఉరివేసుకున్నాడు. రవి భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదైంది. రవి ఆత్మహత్యకు జీఎస్ఎన్ సంస్థ కు చెందిన తిరుపతి రెడ్డే కారణమంటూ మృతుడి సోదరి రోదించారు.



మోహిత్, సాయికిరణ్, ఉదయ్ (ఫైల్)

కాళేశ్వరం ప్రాజెక్టుపై నేడు ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మంగళవారం జలసౌధలో నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరగనుంది. ప్రాజెక్టులోని ఏడు లింకులతోపాటు అన్ని ప్యాకేజీల్లో పూర్తయిన, పూర్తి కావాల్సిన పనులు, ప్యాకేజీల వారీగా భూములు సేకరణ వంటి వివరాలతో సమావేశానికి హాజరుకావాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలిచ్చింది. ప్రాజెక్టుకు ఇప్పటిదాకా రూ.93,872 కోట్లు వెచ్చించారు. 19.63 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటిదాకా 98,570 ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చింది. మిగిలిన 18.64 లక్షల ఎకరాలను రానున్న ఐదేళ్లలో సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కాపీ కొట్టొద్దని చెబితే కొట్టి చంపేశారు!

» డిగ్రీ విద్యార్థి దారుణ హత్య
» ఆరుగురు ఇంటర్ విద్యార్థుల ఘాతుకం
» బోధన్ బీసీ వసతి గృహంలో ఘటన

బోధన్ రూరల్, మార్చి 4: మరుసటి రోజు పరీక్ష కోసం చిట్టీలు సిద్ధం చేసుకుంటున్న ఇంటర్ విద్యార్థులను చూసి, చిట్టీలు కొట్టొద్దని, పట్టుబడితే ఇబ్బందుల్లో పడతారు అని చెప్పడమే ఆ డిగ్రీ విద్యార్థి చేసిన తప్పయింది. అతడితో వాగ్వాదం పెట్టుకున్న ఓ ఆరుగురు ఇంటర్ విద్యార్థుల అతడిని విచక్షణారహితంగా కొట్టారు. అంతర్గత అవయవాలు దెబ్బతినడంతో ఆ డిగ్రీ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని తట్టికోట బీసీ హాస్టల్‌లో ఈ ఘటన జరిగింది. మృతుడు కామారెడ్డి జిల్లా గాంధారి మండలం తిప్పారం తండాకు చెందిన వెంకట్ (23). తట్టికోట బీసీ వసతి గృహంలో చదువుతున్నాడు. అదే హాస్టల్లో స్టడీ అవర్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నాడు. ఆదివారం రాత్రి కొందరు ఇంటర్ విద్యార్థులు సోమవారం జరిగే పరీక్ష కోసం చిట్టీలు రెడీ చేసుకోవడాన్ని వెంకట్ చూసి వారించాడు. ఆగ్రహించిన విద్యార్థులు దాడికి పాల్పడటంతో వెంకట్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అతడిని మిగతా విద్యార్థులు ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి జగ్గారాం ఫిర్యాదు మేరకు పోలీసులు ఆరుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.. కాగా వెంకట్ మృతికి కారణమైన యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కుటుంబ సభ్యులు, తిప్పారం తండావాసులు సోమవారం బోధన్ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్ స్వామి, నైట్ వాచ్‌మెన్ గంగాధర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

జూన్‌లో ఎఫ్ఎంజీ స్క్రీనింగ్ పరీక్ష

నేటి నుంచి దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ స్క్రీనింగ్ టెస్ట్ (ఎఫ్ఎంజీ)ను జూన్ లో నిర్వహించ నున్నట్లు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రకటించింది. ఆ స్క్రీనింగ్ టెస్టుకు దరఖాస్తు చేయాలంటే ముందుగా అర్హతా ధ్రువపత్రం సమర్పించాలని పేర్కొంది. ఆ ధ్రువ పత్రం కోసం మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తులకు ఏప్రిల్ 30 తుది గడువుగా ఎన్ఎంసీ పేర్కొంది. కాగా, గతేడాది దేశవ్యాప్తంగా 37,827 మంది ఈ ఎగ్జామినేషన్ రాస్తే 7,781 (20 శాతం) మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

రానురాను తీసికట్టు

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో, తాము సాధించిన ఘనకార్యాలను, అందించబోయే స్వర్గాలను రాజకీయ పక్షాలు ప్రజల ముందు ఏకరువు పెడుతుంటాయి. గత ప్రభుత్వ హయాంలో తాము నిజంగా పొందిందేమిటో, కోల్పోయిందేమిటో ఓటర్లు సమీక్షించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా భావోద్వేగాల సందడి చేస్తుంటారు. నిత్యావసరాల ధరల పెరుగుదల, అధికమవుతున్న ఆర్థిక అంతరాలు, సామాజిక ఉద్రిక్తతలు, నియంతృత్వ ధోరణి, హక్కులు స్వేచ్ఛల కుదింపు, ఇటువంటి కీలక అంశాలపై చర్చ జరగవలసిన సమయం ఇది.

రానురాను భావ ప్రకటనా స్వేచ్ఛపై, ముఖ్యంగా మీడియా స్వాతంత్ర్యం మీద ఆంక్షలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా కేంద్రప్రభుత్వం నేరుగా, పరోక్షంగా విధిస్తున్న నిర్బంధ వాతావరణం వల్లనే అధికంగా ఈ ఉల్లంఘనలు జరుగుతున్నాయి. పోయిన సంవత్సరం పత్రికా స్వేచ్ఛ సూచికలో మన దేశం స్థానం దారుణంగా పడిపోయింది. మొత్తం 180 దేశాల పరిశీలనలో భారత్ 161వ స్థానంలో ఉంది. అంతకు ముందు సంవత్సరం ఉన్న 150 స్థాయి నించి ఇంకా పడిపోయిందన్న మాట. ఇంకా సులువుగా అర్థం కావాలంటే, పాకిస్థాన్ కంటె, ఆఫ్ఘనిస్థాన్ కంటె, శ్రీలంక కంటె కూడా మనం దిగువన ఉన్నామన్నమాట. బాధ్యతలు, కర్తవ్యాలు మాత్రమే ఉండాలి తప్ప, హక్కుల స్మరణ అప్రధానం కావాలనుకుంటున్న అమృతకాలంలో రానురాను పరిస్థితి మరెంతగా దిగజారుతుందో చూడాలి.

'కశ్మీర్ నరేటర్' అనే మాస పత్రికకు సహాయ సంపాదకుడిగా, విలేఖరిగా పనిచేసే ఆసిఫ్ సుల్తాన్ అనే పాత్రికేయుడిని 2018 ఆగస్టులో అరెస్టు చేశారు. మిలిటెంట్లకు ఆశ్రయం ఇస్తున్నాడని ఆయన మీద అభియోగం. కానీ, అంతకు నెలరోజుల కిందట బుర్హాన్ వనీ అనే మిలిటెంట్ మీద రాసిన ముఖచిత్ర కథనమే సుల్తాన్ మీద అధికార యంత్రాంగానికి ఆగ్రహం తెప్పించిందని అందరికీ తెలుసు. అప్పటినుంచి, అతనికి బెయిలు లేదు. 2022లో ఒకసారి బెయిల్ వచ్చింది కానీ, వెంటనే మళ్లీ అరెస్టు చేశారు. అతని మీద అభియోగాలకు ఆధారాలు లేవని బెయిల్ ఇచ్చిన స్పెషల్ కోర్టు చెప్పగా, తాజాగా, గత డిసెంబర్‌లో జమ్మూకశ్మీర్ హైకోర్టు అతని మీద కేసు కొట్టివేసి, నిర్బంధం అక్రమమని చెప్పింది. అయినా, ఫిబ్రవరి 27 దాకా విడుదల చేయలేదు. విడుదలై తన ఇంటికి వెళ్లిన సుల్తాన్‌ను మరో కేసు పేరిట తిరిగి 29వ తేదీన అరెస్టు చేశారు.

కశ్మీర్ వంటి చోట పాత్రికేయులు ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులు తెలిసినవే. అయితే, తక్కినచోట్ల పరిస్థితులు ఏమీ మెరుగుగా లేవు. సుదీర్ఘ నిర్బంధాలు, కోర్టు తీర్పులను ఖాతరు చేయకపోవడం దేశమంతటా ఉంది. కేవలం వార్తా సేకరణకు వెళ్లిన పాపానికి సిద్ధిఖీ కప్పన్ మూడేళ్లు నిర్బంధంలో గడిపారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన 'న్యూస్ క్లిక్' దాడులలో అరెస్ట్ అయిన ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థకు ఇంకా బెయిల్ దొరకలేదు. దాదాపు అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లో 'దస్తక్' పత్రిక సంపాదకురాలు సీమా ఆజాద్ మీద, మరికొందరి మీద జరిగిన ఎన్ఐఏ దాడులు తెలిసినవే. తాజాగా తెలంగాణలో 'వీక్షణం' పత్రిక సంపాదకుడి ఇంటిలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. కొవిడ్ సామూహిక అంత్యక్రియల కాలంలో గంగానదిలో కళేబరాల ఫోటోలు తీసి ప్రచురించిన కోపంతోనే కాబోలు, పాతికేళ్ళుగా ఉంటూ, దేశంలోనే స్థిరపడిన ఫ్రెంచి పాత్రికేయురాలు వనెసా డౌనాక్‌ను బలవంతంగా వెనక్కు పంపించారు. దేశంలో వాస్తవికత కంటె, దాన్ని బయటకు చెప్పడమే పాలకులకు ఇబ్బందికరం అవుతోంది. తాజాగా జార్ఖండ్‌లో ఒక స్పానిష్ మహిళపై జరిగిన సామూహిక అత్యాచారం సందర్భంగా వస్తున్న ట్వీట్ల నిరసనను జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు తప్పుపట్టారు. దేశాన్ని అప్రదిష్టపాలు చేసే విధంగా సోషల్ మీడియాలో ఎందుకు రాయాలని ఆమె ప్రశ్న. పాలకుల ఒడిలో కూర్చున్న మీడియా తప్ప, తక్కిన అన్నిటికి గడ్డు కాలమే కొనసాగుతోంది. మునుముందు, కొత్త నేరచట్టాలు, డిజిటల్ మీడియా చట్టాలు పాత్రికేయుల స్వేచ్ఛకు మరిన్ని సంకెళ్లు బిగించబోతున్నాయి కూడా.

అన్నిటి కంటె దురదృష్టకరం ఏమిటంటే, ఈ స్వేచ్ఛల గురించి గట్టిగా నిలదీయగలిగిన ప్రజాస్వామిక ఉద్యమమేదీ దేశంలో లేకపోవడం. గొంతువిప్పగలిగిన అతి కొద్ది మందిని దేశద్రోహులుగా, కమ్మీలుగా, ప్రభుత్వ వ్యతిరేకులుగా చిత్రించే దుర్మార్గం కొనసాగుతున్నది. ప్రజాస్వామ్యానికి కాపలాదారులుగా ఉండే పాత్రికేయుల విశ్వసనీయతను, నైతిక స్థైర్యాన్ని దానదండోపాయాల ద్వారా దెబ్బతీస్తున్నప్పుడు, నష్టపోయేది కేవలం మీడియా మాత్రమే కాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, తాను తిరిగి అధికారంలోకి వస్తే మెరుగైన స్వేచ్ఛలను కల్పిస్తామని తమ మేనిఫెస్టోలో ప్రకటించాలి. ప్రతిపక్ష కూటమిగా రంగంలో ఉన్న పక్షాలు, తమ ప్రధాన ప్రచారాంశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణను చేర్చుకోవాలి. ప్రస్తుతం దేశంలో ఉన్న వాతావరణంలో, పత్రికాస్వేచ్ఛతో సహా ఏ స్వేచ్ఛలనయినా పునరుద్ధరిస్తామని చెప్పడం ఏ పక్షానికయినా రాజకీయంగా ప్రమాదకరమే. కానీ, నష్టాలకు సిద్ధపడి అయినా ముందుకు అడుగువేసేవారే ఫలితాలను కూడా సాధిస్తారు.

అనేక రకాల మాధ్యమాలలో పనిచేస్తున్న పాత్రికేయులు, వారి వృత్తి సంఘాలు పత్రికాస్వేచ్ఛను అణచిపెడుతున్న ధోరణులను గట్టిగా వ్యతిరేకించాలి. ప్రజాభిప్రాయాలను ప్రభావితం చేయగలిగే రంగమే భయానికో, భక్తికో మౌనంగా ఉండిపోతే, ప్రజాస్వామ్యానికి ఏది రక్షణ?

30 ట్రిలియన్ ఆర్థికంగా భారత్

'నేను మూడోసారి అధికారాన్ని చెలాయించడానికి తాపత్రయపడడం లేదు. ఈ దేశంలో పేద పిల్లల భవిష్యత్తు కోసం, కోట్లాది మహిళలు, యువత కలలు నెరవేర్చడం కోసం, ప్రపంచ దేశాల్లో అగ్ర రాజ్యంగా భారత్ గుర్తింపు పొందడం కోసం బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని భావిస్తున్నాను' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల బీజేపీ జాతీయ సదస్సులో స్పష్టం చేశారు. మరోసారి అధికారం రావడం అతి పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను. దేశ ప్రజలు బీజేపీపై మరింత విశ్వాసం పెంచుకుని తమ కలల్ని మరింత సార్థకం చేస్తుందనే ఆశలతో మనను అధికారంలోకి తీసుకువస్తున్నారు. అందువల్ల మన బాధ్యత మరింత పెరుగుతుందని' మోదీ చెప్పారు. ప్రజల కలల్ని తప్పక నెరవేరుస్తామనే విశ్వాసం కలిగించేందుకు మన పార్టీ ప్రతి కొత్త ఓటరును చేరుకోవాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని మోదీ అన్నారు. 'రాబోయే 100 రోజుల్లో, మన మందరం ప్రతి కొత్త ఓటరు, ప్రతి లబ్ధిదారుడు, ప్రతి కమ్యూనిటీని చేరుకోవాలి. అందరి విశ్వాసం, మద్దతును మనం గెలుచుకోవాలి...' అని ఆయన చెప్పారు. ప్రతి పక్షాలకు ఎలాగూ అభివృద్ధి గురించిన ఆలోచన లేదు. వికసిత్ భారత్ గురించి దేశమంతటా మార్మ్రోగుతున్నప్పటికీ ప్రతిపక్ష నేతలు దాని గురించి పెదవి విప్పడం లేదు. అందుకు కారణం కళ్ల ముందు జరుగుతున్న అభివృద్ధి గురించి తప్పుడు వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తమను తిరస్కరిస్తారని వారు భయపడుతున్నారు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

కేంద్రంలో మూడోసారి మోదీ సారథ్యంలో బీజేపీ అధికారంలోకి వచ్చే విషయంపై దేశంలో ఎవరికీ సందేహం లేదు. అసలు అధికారంలోకి వస్తామా, లేదా అన్న సంశయం మోదీకి ఎప్పుడూ లేదు. 370 సీట్లకు పైగా బీజేపీ సాధించాలనే లక్ష్యాన్ని ఎలా నెరవేర్చుకోవాలన్న విషయంపై ఆయన ఎప్పుడో పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఆ విషయానికి సంబంధించి పార్టీ వ్యూహరచన ఇప్పటికే పూర్తయింది. ఎంతో ముందుగా వ్యూహరచన చేయకపోతే ఒక్క రోజులోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఒకేసారి 195 మంది అభ్యర్థులను ఖరారు చేయగలిగేదే కాదు. మొదటి జాబితాలోనే 33 మంది సిట్టింగ్ ఎంపీలను తొలగించారంటే, 34 మంది కేంద్రమంత్రులకు మళ్లీ అవకాశాలిచ్చారంటే బీజేపీ ఎంతో కాలం నుంచి అభ్యర్థుల పనితీరును, బలాబలాలపై విభిన్న వర్గాల నుంచి సమాచారం సేకరించిందని అర్థమవుతోంది.

అధికారంలోకి రావడం మాత్రమే కాదు, అధికారంలోకి వచ్చిన వెంటనే ఏమి చేయాలన్న విషయమై కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే నిర్ణయించుకున్నారు. మరో రెండు నెలల పాటు దేశంలో ఎన్నికల హడావిడి ఉన్నప్పటికీ అభివృద్ధి ఆగకూడదని ఆయన భావిస్తున్నారు. అందుకే ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి ముందే ఆయన బుధవారం నాడు అత్యంత కీలకమైన కేంద్ర కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే వంద రోజులకే కాదు, అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో, ఆ తర్వాత రానున్న అయిదు సంవత్సరాల్లో ఏమి చేయాలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిందిగా ఆయన కేంద్ర కేబినెట్ మంత్రులను, అధికారులను ఆదేశించారు. మనం తీసుకోవాల్సిన కీలక చర్యలేమిటి, వాటిలో వేగంగా ఎన్నిటిని అమలు చేయగలం, మన ప్రాధాన్యాలేమిటో, వ్యూహాలేమిటో రూపొందించి కేబినెట్ సెక్రటేరియట్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలైన తర్వాత తమ మంత్రి పదవులు ఉంటాయా లేదా అన్న ఆలోచన లేకుండా దేశం గురించి ఆలోచించి ప్రణాళికలు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు.



మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌ను ప్రపంచ అగ్రరాజ్యంగా మార్చాలన్న లక్ష్యం తప్ప మరే లక్ష్యమూ మోదీ మనసులో లేదు. మేలో అధికారంలోకి రాగానే వికసిత్ భారత్‌ను సాధించేందుకు వందరోజుల ఎజెండాను ఆయన రూపొందించుకున్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రవేశపెడుతున్న తీరునే కాకుండా ప్రభుత్వ వ్యవస్థల్ని నిర్మాణాత్మకంగా మార్చేందుకు ఆయన మనసులో ఎన్నో నిర్ణయాలు ఉన్నాయని కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆయన సుదీర్ఘ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది.


మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దేశాన్ని ప్రపంచంలో అగ్ర రాజ్యంగా మార్చాలన్న లక్ష్యం తప్ప మరే లక్ష్యం మోదీ మనసులో లేదు. మేలో అధికారంలోకి రాగానే వికసిత్ భారత్‌ను సాధించేందుకు వందరోజుల ఎజెండాను కూడా ఆయన రూపొందించుకున్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రవేశ పెడుతున్న తీరునే కాకుండా ప్రభుత్వ వ్యవస్థల్ని కూడా నిర్మాణాత్మకంగా మార్చేందుకు ఆయన మనసులో ఎన్నో నిర్ణయాలు ఉన్నాయని కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆయన చేసిన సుదీర్ఘ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే ఈ దేశం రూపురేఖలు మార్చివేసే సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. జూన్‌లో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో విప్లవాత్మక, ప్రగతిశీలమైన నిర్ణయాలు ఉంటాయని ఆయన ఇప్పటికే సంకేతాలు పంపుతున్నారు. బడ్జెట్‌లో వార్షిక లక్ష్యాలతో పాటు, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు తగిన చర్యలు ఉండాలని ఆయన భావిస్తున్నారు. 2047 కల్లా దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు వచ్చే అయిదేళ్లలో ఏమి చేయాలో ఆయన మనసులో ఒక స్పష్టత ఉన్నది. తన టీమ్ కూడా తన లాగే ఆలోచించేందుకు ఆయన ఇప్పటి నుంచే వారిని మానసికంగా సిద్ధం చేస్తున్నారు.

2047 కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశం కావాలని ఆయన ఎందుకు అంటున్నారు? 1947లో స్వాతంత్ర్యం వచ్చిన రీత్యా ఆ తర్వాత వందేళ్లకైనా దేశం అగ్రరాజ్యంగా మారకపోతే, ఇంకా వర్ధమాన దేశంగానే మిగిలిపోతే ఆ దేశ నాయకుల గురించి ప్రజలు ఏమనుకుంటారు? నిజానికి ఈ వందేళ్లలో 60 ఏళ్ల పాటు కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలే దేశాన్ని పాలించాయి. అయినప్పటికీ కాంగ్రెస్ సాధించలేని ఫలితాలను బీజేపీ హయాంలోనైనా సాధించేందుకు మోదీ కృతనిశ్చయంతో ఉన్నారు. 2047 కల్లా భారత్ 30 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మారినప్పుడే, భారతీయుడి తలసరి ఆదాయం 2400 డాలర్ల నుంచి 18వేల అమెరికన్ డాలర్లకు పెరిగినప్పుడే, స్థూల దేశీయోత్పత్తి 29.02 డాలర్లకు చేరుకున్నప్పుడే అది అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. భారత్‌ను అగ్రరాజ్యంగా చూడాలన్న ఆకాంక్ష నెరవేర్చే దిశగా మోదీ 2021 డిసెంబర్ 17న చర్యలు ప్రారంభించారు. వివిధ కీలక ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యదర్శులతో ఉజ్వల భవిష్యత్‌కు భారత్‌ను సిద్ధం చేయడం అనే లక్ష్యంతో బ్లూప్రింట్ తయారు చేయడం గురించి చర్చలు జరిపారు. గ్రామీణ రంగం-వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, వనరులు, సంక్షేమం, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం-పరిశ్రమ, టెక్నాలజీ, సుపరిపాలన, దేశ భద్రత, విదేశాంగ వ్యవహారాలు అనే రంగాల్లో విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశారు. ఏ ఏ రంగాల్లో ఎన్నెన్ని రెట్లు అభివృద్ధి జరిగితే వికసిత్ భారత్‌గా మారతామో ఈ పత్రంలో అంచనా వేశారు. ఎగుమతి లక్ష్యాలను నిర్దేశించారు. ప్రాంతీయ అసమానతలను చెరిపివేసేందుకు అవసరమైన వ్యవస్థాగత సంస్కరణలను నిర్ణయించారు. ప్రపంచంలోని వంద గ్లోబల్ సంస్థల్లో కనీసం పది కంపెనీలు మన దేశానికి చెందినవై ఉండాలని, 100 గ్లోబల్ విద్యాసంస్థల్లో పది యూనివర్సిటీలు మన దేశానికి చెందాలని మోదీ కలలు కన్నారు. అనుక్షణం ఈ దిశన జరుగుతున్న అభివృద్ధిని సమీక్షించి, తప్పులను సవరించుకునే యంత్రాంగాన్ని రూపొందించాలని భావించారు. ఈ మధ్య కాలాన్ని అమృత కాలంగా ఆయన అభివర్ణించారు. ఏ లక్ష్యాన్నైనా ముందే నిర్ణయించుకుని దాన్ని నిర్ణీత కాలవ్యవధిలో సాధించడం మోదీ స్వభావం. ప్రతి భారతీయుడూ దేశం గురించి మోదీలా ఆలోచిస్తే మన దేశం అనతి కాలంతో అగ్రరాజ్యంగా మారుతుందనడంలో సందేహం లేదు.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

అహింస వెనుక అసలు నిజం!

ప్రపంచ నాగరికతకు భారతదేశం ఏం అందించింది? అంటే వెంటనే యోగా గుర్తుకొస్తుంది. చదరంగం ఆట మనసులో మెదులుతుంది. సర్వసంగ పరిత్యాగులైన రుషులు స్ఫురణకు వస్తారు. గణితం గమనంలోకి వస్తుంది. భారత నాగరికతా ప్రయాణంలో విశిష్టతలకు సంబంధించిన నిర్ధారణలు చాలానే ఉన్నాయి. భిన్న నాగరికతలతో సరిపోల్చి చరిత్రకారులు తేల్చిన వాటిల్లో కొన్నిటిని చూస్తే హృదయాలు ఉప్పొంగుతాయి. మరికొన్నిటి విషయాల్లో విముఖతలూ వ్యక్తమవుతాయి. గొప్ప సంగతులన్నిటికీ భారతదేశమే మూలమన్న సంకుచితత్వం ఆ నిర్ధారణల్లో కనపడదు. ప్రజాస్వామ్యానికి భారతదేశమే పుట్టినిల్లుగా చెప్పే అతిశయోక్తులకు వాటిలో చోటుండదు. ఆధునిక రాజ్యాంగ ఆదర్శాలన్నిటికీ రామరాజ్యంలో పునాదులు ఉన్నాయన్న విపరీత వాదనా వినపడదు. అనాదిగా భారత్‌ది విశ్వగురు పాత్రేనంటూ సాగుతున్న విపరీత ప్రచారమూ కనపడదు. మన చరిత్రను నిష్పక్షపాతంగా పరిశీలించిన వారిలో ఎ.ఎల్. బాషమ్ ఒకరు. ఆయన 1950ల్లో రాసిన 'ద వండర్ దట్ వజ్ ఇండియా' పుస్తకం చాలా ప్రాచుర్యం పొందింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు ఇప్పటికీ దాన్ని, ప్రాచీన భారత చరిత్రకు సంబంధించి ఎంతో విలువైన పుస్తకంగా భావిస్తాయి. సంస్కృతంతో పాటు మరికొన్ని భారతీయ భాషలను స్వయంగా నేర్చుకుని మరీ మన చరిత్రను అర్థంచేసుకోటానికి, మదింపువేయటానికి బాషమ్ చేసిన ప్రయత్నం అందులో అడుగడుగునా కనపడుతుంది. గతం పట్ల తీవ్ర విముఖతో మితిమీరిన ఆరాధనో లేకుండా సమతూక చిత్రణనే అందులో చూస్తాం.



యుద్ధాలు, హింసలు, ఆక్రమణలు, పరాజితులపై విజేతల జీవన విధానాన్ని రుద్దటం, బలవంతపు మతమార్పిడులు, అధిక భూశిస్తు పీడనలు, బానిసత్వ బంధనాలు అన్ని దేశాల్లోనూ ఒకనాడు ప్రబలంగా ఉండేవి. వీటిల్లో కొన్నిటికి సంబంధించి భారత్ భిన్నదారుల్లో నడిచింది. ఆ భిన్నదారులే ఒకనాడు భారత్‌ను ముందుకు నడిపించాయి. కాల గమనంలో అవే అడ్డుగోడలుగా మారాయి. భిన్నదారుల్లో ప్రధానమైందిగా చెప్పుకోవాలంటే ముందుగా మనకు కనపడేది అహింస. అంటే భారత చరిత్రలో హింస నిర్వహించిన పాత్ర తక్కువగా ఉండటం. దీన్ని గురించి విపులంగా, వాస్తవిక దృష్టితో అనితరసాధ్యం అన్నట్లుగా విశ్లేషించిన వారిలో దామోదర ధర్మానంద కోసంబికి మొదటి స్థానం ఇవ్వాలి. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. ఎంతో సంక్లిష్టతలతో కూడిన సుదీర్ఘచరిత్రపై కోసంబిదైనా మరొకరిదైనా తుది తీర్పు లాంటిదేమీ ఉండదు. కొత్త ఆధారాలు, నూతన విశ్లేషణలు వచ్చినపుడు కొన్ని నిర్ధారణలు మారటం సహజం.

భారతీయ సంస్కృతి ఆగ్నేయాసియా దేశాల్లో ప్రవేశించటాన్ని అహింసాయుత పరివర్తనకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. క్రీస్తు పూర్వమే ఈ దేశాలకు భారత వర్తకుల ప్రయాణాలు మొదలయ్యాయి. అక్కడే కొందరు శాశ్వత నివాసాలు, స్థానికులతో వివాహబంధాలు ఏర్పరచుకున్నారు. ఆ తర్వాత బ్రాహ్మణులూ బౌద్ధ బోధకులూ వెళ్లారు. వలస వచ్చిన భారతీయుల ప్రభావంతో స్థానిక సంస్కృతులు ఉత్తేజితమయ్యాయి. క్రమేపీ భారతీయ సమాజాన్ని పోలిన కొన్ని వ్యవస్థలు ఏర్పడ్డాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం స్థానికులకు అందింది. వర్గాలు ఏర్పడ్డాయి. వ్యవసాయం బలపడింది. సంస్కృతం వందలేళ్లు రాజభాష అయ్యింది. దేవాలయాలు ఏర్పాటయ్యాయి. తర్వాతి కాలంలో ఆ దేశాలపై చైనా, ఇస్లాం సంస్కృతుల ప్రభావం పడినా భారతీయులు ఆదిలో అందించిన ఘన ఉత్తేజం గణనీయమైంది. అహింసా దారుల్లోనే మరో ముఖ్య పరిణామం మధ్య ఆసియా మీదుగా జరిగింది. మనిషి కేంద్రంగా, అతని పరివర్తనే ఆలంబనగా కొత్త నైతిక దృష్టితో తలెత్తిన జీవన విధానం బౌద్ధం. మొదట్లో ఎంతో హేతుబద్ధతతో, మూఢనమ్మకాలకు తావియ్యని కొత్త జీవన తత్వంగా బౌద్ధం ఉనికిలోకి వచ్చింది. ఆ తర్వాత చాలా మార్పులకు లోనైనా కొన్ని శతాబ్దాలు సమాజాన్ని ముందుకు నడిపించటంలో బౌద్ధం గణనీయ పాత్రను పోషించింది. అటువంటి బౌద్ధం మధ్య ఆసియా మీదుగా చైనా, జపాన్, కొరియాలకు వ్యాపించటం ప్రపంచ చరిత్రలో మరో ముఖ్యమైన పరిణామం. సంస్కృతీ విస్తరణ, తాత్విక ఆలోచనల వ్యాప్తి వంటివి కాకుండా ప్రపంచానికి భారతదేశం అందించిన వాటిల్లో ఇంకా ఘనమైనవీ ఉన్నాయి. పత్తి, చెరకు, బియ్యం, సుగంధ ద్రవ్యాలు, కోళ్ల మచ్చిక, చదరంగం, దశాంశ పద్ధతి, బీజగణితం, సూర్య కేంద్ర సిద్ధాంత పోకడలు లాంటివి ప్రపంచానికి అందటంలో భారత్ పాత్ర ఎనలేనిది. పత్తి లేనిదే ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉండేది కాదు. పారిశ్రామిక యుగానికి ముందు వ్యవసాయం తర్వాత అత్యంత కీలమైనది వస్త్రపరిశ్రమే. భారత దేశానికి పాశ్చాత్య వర్తకులు ఒకనాడు వరుసకట్టడానికి వస్త్ర తయారీలో మన నైపుణ్యమే ప్రధాన కారణం. అంతెందుకు వస్త్ర తయారీలో కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టటంతోనే బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం మొదలైంది.



■ రాహుల్ కుమార్

వేరే దేశాల్లో అహింసాయుతంగా భారత సంస్కృతీ వ్యాప్తి గురించి ఎవరికీ పెద్దగా భిన్నాభిప్రాయాల్లేవు. కానీ అంతర్గతంగా కులం ఆధారంగా నెలకొన్న సామాజిక వ్యవస్థ వందల ఏళ్ల పాటు దేశంలో నలుమూలలకు విస్తరించటంలో హింస కంటే అహింస పాత్రే ఎక్కువ. చాలా దేశాల్లో పరాజితులను సంపూర్ణంగా లొంగదీసుకున్నారు. కొన్నేళ్లకు వాళ్ల సంస్కృతీ పునాదులను పెకలించి వేశారు. మరికొన్ని చోట్ల బానిసలుగా మార్చారు. బలప్రయోగం, హింసతో విజేతలు తాము అనుకున్న సామాజిక మార్పును సాధించారు. భారతదేశంలో వేల తెగలు ఒకనాడు విడివిడిగా స్వంత అస్తిత్వంతో కొనసాగాయి. ఉత్తరాదిలో గంగా సింధు నదుల మధ్య నాలుగు కులాలతో ప్రారంభమైన సామాజిక వ్యవస్థ విస్తరించే క్రమంలో యుద్ధాలు అసలు జరగకుండా ఉండలేదు. కానీ అవి పరాజితుల సంపూర్ణ అస్తిత్వ హరణానికి దారితీయలేదు. విస్తరణ క్రమంలో బలవంతుల ఆధిపత్యాన్ని అంగీకరించిన తెగలను, జాతులను కొత్తకులాలుగా స్వీకరించి రైతులుగా, చేతివృత్తుల వారుగా, శ్రామికులుగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో చోటు కల్పించారు. అట్లా చోటు కల్పించటమే కాకుండా అప్పటిదాకా ఉన్న వారి కట్టుబాట్లను, సంప్రదాయాలను, ప్రత్యేకతలను కూడా కొనసాగనిచ్చారు. తెగల దేవతలకు స్థాయిని బట్టి సముచిత స్థానాలను ఇచ్చారు. అమ్మదేవతలు పార్వతి ప్రతిరూపాలుగా మారారు. పురుష దేవుళ్ల శివ, విష్ణు అంశాలను పుణికిపుచ్చుకున్న వారిగా చిత్రీకరించారు. హనుమాన్, గణేశ్ లాంటి ఒకనాటి తెగల దేవుళ్లు హిందూ దేవతా ప్రపంచంలో ప్రముఖ స్థానాన్ని పొందారు. ఈ పరిణామం వందలేళ్లు కొనసాగింది. ఇందులో భాగంగానే దేవతా ప్రపంచం విస్తరించింది. పురాణాలు, స్థలపురాణాల్లో కొత్త కథలు, గాథలు చరిత్ర పొడవునా చేరుతూనే ఉన్నాయి. అందుకే సంఖ్యలో భారత దేవతా ప్రపంచంతో సాటిరాగల లోకం మరొకటి లేదు. తెగలు పవిత్ర చిహ్నాలుగా భావించే కొన్ని జంతువులు ప్రధాన దేవుళ్లకు వాహనాలుగా మారిపోయాయి. కొన్ని వృక్షాలు పవిత్ర స్థానాన్ని పొందాయి. తెగలు కులాలుగా మారే పరిణామం ఏదో ఒక శతాబ్దానికే పరిమితం కాలేదు. సుదీర్ఘకాలం అది సాగింది కాబట్టి కులాల సంఖ్యకూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. వేదకాలంలో చాతుర్వర్ణ ప్రస్తావన మాత్రమే కనపడుతుంది. అదే మనుస్మృతి కాలం నాటికి వందల కులాలు వచ్చాయి. వీటిని వివరించటానికే వర్ణ సాంకర్య సిద్ధాంతాన్ని పుట్టించారు. సంప్రదాయం ప్రకారం నాలుగు వర్ణాలు దైవ సృష్టి కాబట్టి.. కొత్తకులాలను వివరించటానికి వర్ణసాంకర్య సిద్ధాంతమే స్మృతికారులకు సహజం అనిపించింది. తెగల్లోని అంతర్వివాహ పద్ధతి యథాతథంగా కులాల్లోకి వచ్చింది. దాంతో కులం ఇంకా గట్టిగా స్థిరపడింది. వ్యవసాయాన్నో, వృత్తినో స్వీకరించి విస్తరిస్తున్న సమాజంలో భాగం కాకుండా సొంత అస్తిత్వం కోసం పట్టుపట్టిన వారిని దూరంగా అట్టిపెట్టి, హీనంగా చూడటం కూడా ఈ పరిణామంలో భాగంగా జరిగింది.

అతి తక్కువ హింసతో జరిగిన ఈ సామాజిక పరివర్తనను ఇతర దేశాల కంటే నాగరికమైనదిగా కోసంబి భావించారు. చారిత్రకంగా అమిత ప్రాధాన్యం కలిగిన విషయంగానూ పరిగణించారు. అమెరికా, యూరప్‌లో జరిగినట్లుగా ఆదిమ తెగలను, జాతులను హింసతో లొంగదీసుకుంటే భారత్ ఎంతో క్రూరత్వానికి పాల్పడాల్సి వచ్చేదని కూడా వ్యాఖ్యానించారు. తక్కువ హింసతో జరిగిన సమాజ పరివర్తనకు కావల్సిన సైద్ధాంతిక, భావజాల సంపత్తిని సృష్టించటంలో బ్రాహ్మణుల పాత్ర చాలా ఉంది. సృష్టికర్తలు తామే కాబట్టి మత, పురాణసాహిత్యంలో ఆధిపత్యాన్ని కల్పించుకున్నారు. శాంతియుత సమాజ పరివర్తనకు ఒక దశలో తోడ్పడిన ఈ పద్ధతులను దైవిక నిర్ణయాలుగా భావించటం క్రమేపీ పెరిగింది. దీంతో తర్వాతి దశల్లో ప్రగతి పరంగా ముందడుగులు వేయటానికి కావాల్సిన భావనా సంపత్తిని సమకూర్చుకోలేని దుస్థితి ఏర్పడింది. విదేశీ ఆక్రమణలను ఎదుర్కోలేని నిస్సత్తువ ఆవహించింది. సముద్ర ప్రయాణం ద్వారా ఆగ్నేయాసియా దేశాల్లో నాగరికతను విస్తరింపచేసిన దేశానికి తర్వాత చరిత్రలో సముద్ర యానమే అరిష్టంగా పరిణమించింది. తెగల ఆచారాలను, మూఢ భావాలను మార్పులూ చేర్పులతో కొనసాగించటంతో పూజారి వర్గానికి స్థిరవృత్తి దండిగా దొరికింది.

శాంతియుత పరివర్తన కోసం ఒకనాడు స్వీకరించిన భావాలు, విశ్వాసాలు అనంతర కాలంలో సమాజ పరివర్తననే అడ్డుకునే స్థాయికి చేరాయి. అందుకే చరిత్రలో అన్ని కాలాలకు వర్తించే మంచి భావాలు పరిమిత సంఖ్యలోనే ఉంటాయి. చరిత్ర చెప్పే ఈ పాఠాన్ని నేర్చుకోటానికి వీల్లేని వాతావరణం దేశంలో ఇప్పుడు క్రమేపీ విస్తరిస్తోంది. మన గతాన్ని అంతా యథాతథంగా స్వీకరించి ప్రతిరోజూ భుజాలు చరుచుకోవాలనే విపరీత ధోరణితో కృత్రిమ దేశ భక్తి పెరిగితే పెరగొచ్చు. సుదీర్ఘ చరిత్రలోని పరిణామాల పట్ల వివేచన మాత్రం పెరగదు.

> శాంతియుత పరివర్తన కోసం ఒకనాడు స్వీకరించిన భావాలు, విశ్వాసాలు అనంతర కాలంలో సమాజ పరివర్తననే అడ్డుకునే స్థాయికి చేరాయి. అందుకే చరిత్రలో అన్నికాలాలకు వర్తించే మంచి భావాలు పరిమిత సంఖ్యలోనే ఉంటాయి. చరిత్ర చెప్పే ఈ పాఠాన్ని నేర్చుకోటానికి వీల్లేని వాతావరణం దేశంలో ఇప్పుడు క్రమేపీ విస్తరిస్తోంది. మన గతాన్ని అంతా యథాతథంగా స్వీకరించి ప్రతిరోజూ భుజాలు చరుచుకోవాలనే విపరీత ధోరణితో కృత్రిమ దేశభక్తి పెరిగితే పెరగొచ్చు. సుదీర్ఘ చరిత్రలోని పరిణామాల పట్ల వివేచన మాత్రం పెరగదు.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

కార్పొరేట్ ఎజెండాకు జెండామోసిన జేపీ!

దేశవ్యాప్తంగా రైతుల ఉద్యమం బలపడుతున్న కొద్దీ కేంద్ర ప్రభుత్వం ఉద్యమ నాయకత్వంపై, ఉద్యమ డిమాండ్‌లపై దుష్ప్రచారం సాగిస్తున్నది. పంటలకు ప్రకటించే కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని రైతు ఉద్యమం ముందుకు తెచ్చిన ముఖ్యమైన డిమాండ్‌ను, ఇతర డిమాండ్లను తప్పు పడుతూ, కేంద్ర ప్రభుత్వానికి నిత్యం వత్తాసు పలికే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ (జేపీ) లాంటి వాళ్ళు కూడా మీడియాలో మాట్లాడుతున్నారు. ఫిబ్రవరి 25న ఆంధ్రజ్యోతిలో 'జబ్బు కంటే ప్రమాదం 'మద్దతు' ఔషధం' పేరుతో ఆయన రాసిన వ్యాసం ఇందులో భాగమే.

రైతు పక్షపాతిగా చెప్పుకునే ఆయన ఈ వ్యాసంలో ఎక్కడా, తమ డిమాండ్లను వినిపించడానికి కేంద్ర ప్రభుత్వం రైతులను ఢిల్లీలోకి అనుమతించాలని గానీ, రైతు సంఘాలతో చర్చించాలని గానీ, రైతులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని గానీ కోరకపోగా, రైతులను రైతు సంఘాలు పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించడం గమనార్హం. ఆయన వ్యాసంలో ఎక్కడా రైతులు పండించే అన్ని రకాల పంటలకు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు ప్రకటించాల్సిన అవసరం గురించి ప్రస్తావించలేదు. అన్ని పంటలకు సమగ్ర ఉత్పత్తి ఖర్చులను లెక్కించి, స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా కనీస మద్దతు ధరలను ప్రకటించాలని కూడా అడగలేదు.

కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారతదేశం బయటకు రావాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని రైతులు చేసే డిమాండ్లు ఆయనకు పనికిమాలిన డిమాండ్లుగా కనిపించాయి. రైతు సంఘాలు తప్పుడు వాదనలతో ఈ డిమాండ్లు ముందుకు తెచ్చి రైతులను పక్కదారి పట్టిస్తున్నాయని ఆయన వ్యాసంలో విమర్శించారు. పైగా రైతుల డిమాండ్లను నెరవేర్చడానికి బడ్జెట్‌లో డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని కూడా ఆయన వాపోయారు. జేపీ చేసే ఈ వాదనలన్నీ రైతుల గొంతును బలహీనపరిచి, మోదీ ప్రభుత్వ చర్యలను బలపరిచేవే. అంటే అసంఘటితమైన, ఆర్థికంగా బలహీనమైన భారత రైతులను తిమింగలాల వంటి కార్పొరేట్ మార్కెట్ శక్తులకు వదిలేసి, ప్రభుత్వం పక్కకు తప్పుకోవాలని ఆయన చెప్పకనే చెబుతున్నారన్నమాట.

2020 జూన్‌లో మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను దేశమంతా వ్యతిరేకిస్తే డాక్టర్ జేపీ మాత్రం వాటిని బలంగా సమర్థించారు. రైతు ఉద్యమ ఒత్తిడికి లొంగి మోదీ ప్రభుత్వం ఆ మూడు చట్టాలను రద్దు చేయడాన్ని కూడా ఆయన సహించలేకపోయారు. ప్రభుత్వం చేతకాని తనాన్ని ప్రదర్శించి రైతులకు లొంగిపోయిందని విమర్శించారు.

1990 దశకం నుంచీ నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల సమర్థకుడిగా, దేశ అభివృద్ధి నమూనాలో ప్రభుత్వాల పాత్ర తగ్గి, మార్కెట్ శక్తుల క్రియాశీల పాత్ర పెరగాలన్నది జేపీ కోరిక. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలని, అన్ని రంగాల్లోకీ విదేశీ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య సంస్థలు రావాలని, దేశాల మధ్య వాణిజ్యంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ముఖ్యమైన పాత్ర పోషించాలని జేపీ గట్టిగా వాదిస్తారు.

ఈ దేశం సంక్షేమ రాజ్యంగా వర్ధిల్లాలని; పేదరికం, ఆర్థిక అసమానతలూ, సామాజిక వివక్షా దేశంలో కొనసాగినన్ని రోజులూ ప్రభుత్వాలు ప్రజల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలని భారత రాజ్యాంగం కోరుకున్నదనీ మర్చిపోయి ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక పేరుతో పనిచేసే డాక్టర్ జేపీ చేసే వాదనలు చూస్తే దేశంలో ఆయన ఎటువంటి సంస్కరణలను కోరుకుంటున్నారో స్పష్టమవుతుంది.

కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ, మొత్తం దేశ పాలనా వ్యవస్థలో కీలక సంస్థలను నియంత్రణలోకి తెచ్చుకుంటూ, రాష్ట్రాల హక్కులను కూడా హరిస్తూ, దేశ ప్రజల పట్ల అత్యంత నిరంకుశ పాలకుడిగా వ్యవహరిస్తున్న మోదీనీ, ఆయన విధానాలనూ జయప్రకాష్ నారాయణ అమితంగా ఆరాధిస్తారని కూడా మనం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం అవినీతిలో కూరుకుపోయింది కనుక, ప్రజలు దానిపై ఆధారపడకూడదని, సమర్థంగా పని చేసే ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు ప్రజలకు న్యాయం చేస్తాయని కూడా ఆయన నమ్ముతున్నారు. మనల్ని నమ్మమంటున్నారు.

> జయప్రకాష్ నారాయణ బలంగా సమర్థించే నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన గత మూడు దశాబ్దాలుగా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి ఎందుకు బయటపడవేయలేకపోయాయో, రైతు కుటుంబాల ఆదాయాలను ఎందుకు పెంచలేకపోయాయో, ఈ మూడు దశాబ్దాల్లో మూడు లక్షలమంది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో ఆయన మనకు ఎప్పుడూ చెప్పరు.



వివిధ రంగాలలో కార్పొరేట్ సంస్థల వైఫల్యం, ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పన్ను రాయితీలు అందించినా, ఆయా సంస్థలను నడపలేక ఆర్థికంగా దివాళా తీయడం, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎగ్గొట్టడం– వీటిపై ఆయన పెద్దగా విమర్శనాత్మకంగా స్పందించరు. ఈ బడా కార్పొరేట్ సంస్థలకు దేశ సహజ వనరులను కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను కూడా పెద్దగా విమర్శించరు. ఆయా ప్రైవేట్ సంస్థల లాభాపేక్షపై, అక్రమ పద్ధతులపై ఎప్పుడైనా ప్రభుత్వాలు విధించే ఆంక్షలను కూడా ఆయన సహించరు. పైగా అటువంటి వాటిని లైసెన్స్‌రాజ్ చర్యలుగా విమర్శిస్తారు.

భారత రైతుల ఆదాయాలు పెంచడానికి ప్రభుత్వాలు నిర్దిష్టంగా ఏమి చేయాల్సి ఉంటుందో ఆయన తన వ్యాసంలో ఎక్కడా సూచించలేదు. ఆయన ఈ వ్యాసంలో చేసిన కొన్ని సూచనలు – పంట ధరలని అణగదొక్కుతున్న అన్ని నియంత్రణలను తొలగించడం, చౌక ధర దిగుమతులు వెల్లువెత్తకుండా హేతుబద్ధమైన సుంకం విధించడం, ధరల అంతరాల్ని తట్టుకునేలా నిల్వ, ఋణ వ్యవస్థలను బలోపేతం చేయడం, అదనపు విలువను ప్రోత్సహించడం, మార్కెట్ గొలుసును కుదించడానికి రిటైల్ చెయిన్ల ఏర్పాటు, ఎగుమతులకు ప్రోత్సాహం... ఈ సూచనలన్నీ కూడా ప్రభుత్వాల పాత్రను పూర్తిగా పక్కన పెట్టి, ప్రైవేట్ రంగ పాత్రను పెంచేవే. ఆహార శుద్ధి పరిశ్రమల ఆవశ్యకతను, నిల్వ సదుపాయాల అవసరాన్ని ఆయన గుర్తిస్తారు కానీ, ఇందులో రైతు సహకార సంఘాల పాత్రను బలోపేతం చేయడం కాకుండా, ఆయన ఆ బాధ్యతను కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని వాదిస్తారు.

భాష వేరు గానీ, ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికా చాలా కాలంగా భారత దేశాన్ని అడుగుతున్న డిమాండ్లు ఇవే. మన దేశంలో కనీస మద్దతు ధరలను ప్రకటించడం మానేయాలని, ప్రభుత్వ సేకరణను మానేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తేయాలని అమెరికా చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నది. రైతుల సంక్షేమం పేరుతో భారత ప్రభుత్వం చేసే పై చర్యలన్నీ, మార్కెట్‌ను వక్రీకరిస్తున్నాయని, భారత రైతులకు సరైన ధరలు అందకుండా చేస్తున్నాయని కూడా అమెరికా వాదిస్తున్నది. ఈ మేరకు ఆ దేశం WTO కోర్టులో భారతదేశంపై కేసు కూడా వేసింది. డాక్టర్ జయప్రకాష్ నారాయణ చేసిన ప్రధాన సూచనలు కూడా ఈ అమెరికా చేస్తున్న వాదనల కోవకు చెందినవే.

సన్నకారు, చిన్నకారు రైతులు 80శాతం ఉన్న మన దేశంలో ఆయన సూచనలు, నిజంగా వ్యవసాయ కుటుంబాల సంక్షోభాన్ని పరిష్కరిస్తాయా? రైతులు గ్రామం దాటి తమ ఉత్పత్తులను బయటకు తీసుకువెళ్లలేని పరిస్థితి ఉన్నచోట, తమ ఆర్థిక అవసరాల కోసం వెంటనే పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఉన్నచోట, ప్రభుత్వాల సేకరణ వ్యవస్థలు ఉనికిలో ఉండాలని, కేవలం, వరి గోధుమ లాంటి పంటలను మాత్రమే కాకుండా ఇతర ఆహార పంటలను కూడా సేకరించడం లాంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని ఆయన తన వ్యాసంలో ఎక్కడా అడగలేదు. ప్రభుత్వ జోక్యం లేకుండా, ప్రైవేట్ వ్యాపారులు రైతులకు ఎక్కువ ధరలు చెల్లించిన ఉదాహరణలను కూడా ఆయన తన వ్యాసంలో ఎక్కడా ప్రస్తావించలేదు. పైగా అన్ని చోట్లా ప్రైవేట్ వ్యాపారులు కనీస మద్దతు ధరలు చెల్లించకుండా, అతి తక్కువ ధరలకే పంటలను సేకరించడానికి ప్రయత్నం చేయడం రైతులకు ఉన్న అనుభవం.

జయప్రకాష్ నారాయణ బలంగా సమర్థించే నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన గత మూడు దశాబ్దాలుగా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి ఎందుకు బయటపడవేయలేకపోయాయో, రైతు కుటుంబాల ఆదాయాలను ఎందుకు పెంచలేకపోయాయో, ఈ మూడు దశాబ్దాల్లో మూడు లక్షలమంది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో ఆయన మనకు ఎప్పుడూ చెప్పరు.

అమెరికా, యూరప్‌లలో కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగాన్ని శాసిస్తున్నప్పటికీ, అక్కడి ప్రభుత్వాలు వందల బిలియన్ల డాలర్లు అక్కడి రైతులకు సబ్సిడీలుగా ఎందుకు అందిస్తున్నాయో కూడా ఆయన మనకు చెప్పడు. ఆయా దేశాల రైతులలో కూడా ప్రతి సంవత్సరం చిన్న రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో కూడా ఆయన మనకు వివరణ ఇవ్వడు.

కానీ మళ్ళీ మళ్ళీ వ్యవసాయ కుటుంబాల సంక్షోభ నివారణ బాధ్యతను కార్పొరేట్ సంస్థల కేంద్రంగా పనిచేసే మార్కెట్ వ్యవస్థ పైనే ఆయన పెడతారు. ఆయన లక్ష్యం స్పష్టం. రైతులే ఆయనను మరింత లోతుగా కొత్త కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరముంది.

● కన్నెగంటి రవి

రైతు స్వరాజ్య వేదిక



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.3 కనిష్ఠం 21.7

ట్రాకింగ్ లేని ట్యాంకర్



వస్తదో.. రాదో.. సమాచారమే ఉండదు

- సంప్రదించేందుకు కనీసం ఫోన్ నంబరూ ఇవ్వరు!
- నీటికోసం నగరవాసులకు తప్పని ఇక్కట్లు
- టెక్నాలజీ వినియోగంలో వాటర్‌బోర్డు వెనుకడుగు
- ట్యాంకర్లలో అక్రమాలకు చెక్ పడుతుందనేనా?

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన ఆహారం ఎక్కడి వరకు వచ్చిందో, ఎంతసేపట్లో వస్తుందో ట్రాకర్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కానీ.. వాటర్‌బోర్డు అందిస్తున్న నీళ్ల ట్యాంకర్లకు ట్రాకర్లు లేవు. ఎక్కడుందో.. ఎప్పుడు వస్తుందో తెలుసుకునే పరిస్థితి లేదు. బుకింగ్ చేసిన వెంటనే మొబైల్‌కు బోర్డు నుంచి మెసేజీ వచ్చినా, సంప్రదించేందుకు అందులో మొబైల్ నంబర్ ఉండదు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు వరకు సుమారు కోటిన్నర జనాభాకు తాగునీటిని అందిస్తున్నప్పటికీ, టెక్నాలజీని వినియోగించకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దారితప్పుతున్న ట్యాంకర్ల జాడ తెలిసిపోతుందనే ట్రాకర్లపై ఆసక్తి చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ సిటీ, మార్చి4 (ఆంధ్రజ్యోతి) వేసవికావడంతో ఇళ్లల్లోని బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో చాలామంది వాటర్‌బోర్డు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. అయితే, నిర్ణీత సమయంలో ట్యాంకర్ రాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్యాంకర్లకు ట్రాకర్ ఏర్పాటుచేస్తే ఎప్పుడు వస్తుందో తెలిసే అవకాశం ఉన్నా వాటర్ బోర్డు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

ఎండలు ముదరక ముందే నగరవాసులకు నీటి అవసరాలు పెరిగాయి. వాటర్‌బోర్డు రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న నీరు ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో నీటిట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తున్నది. బోర్డు పరిధిలో 1200కు పైగా వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. సాధారణ సమయాల్లో ఒక్కో ట్యాంకర్ రోజూ రెండు నుంచి మూడు ట్రిప్పులు తిరుగుతుంది. డిమాండ్ నేపథ్యంలో ప్రస్తుతం ఒక్కో ట్యాంకర్ పదికి పైగా ట్రిప్పులు తిరుగుతోంది. అయినా వినియోగదారులకు నిర్ణీత సమయానికి డెలివరీ కావడం లేదు.

వచ్చేదెప్పుడో?

వాటర్‌బోర్డులో ట్యాంకర్ బుక్‌చేస్తే మెసేజ్‌లో కేవలం టోకెన్‌నంబర్, పిన్‌నంబర్ మాత్రమే వస్తున్నాయి. నీటిని నింపే ఫిల్లింగ్ స్టేషన్, తీసుకొచ్చే ట్యాంకర్, డ్రైవర్ నంబర్లు ఉండవు. ఎప్పటికి డెలివరీ అవుతుందో సమయం కూడా ఉండదు. ఇంటికి ట్యాంకర్ చేరేంత వరకూ వినియోగదారులు కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురుచూడాల్సిందే. ఒక్కోసారి వస్తదో.. రాదో కూడా తెలియక ఆందోళన చెందుతున్నారు.

కారణం ఇదేనా..?

వాటర్‌బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్యాంకర్లలో అత్యధికం అధికారులు, ఉద్యోగులు, బోర్డు యూనియన్ నేతలవే. ఒక్కొక్కరికి ఐదు నుంచి పదికి పైగా ట్యాంకర్లున్నాయి. కొన్ని ట్యాంకర్లు డెలివరీ చేయకపోయినా బిల్లులు చెల్లిస్తున్న పరిస్థితులున్నాయి. ఒకటి, రెండు ట్రిప్పులు తిరిగినా, పదికి పైగా ట్రిప్పులు తిరిగినట్లు బిల్లులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో బుక్ చేసుకోగానే వినియోగదారుడికి ట్యాంకర్ నంబర్‌తో పాటు డ్రైవర్ వివరాలు మెసేజ్ రూపంలో వెళ్తే ఈ పప్పులుడకవు. ఏ ట్యాంకర్ ఎవరికి వెళ్లిందో ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. తప్పుదారి పడుతున్న ట్యాంకర్లకు చెక్ పడుతుంది. అందువల్లే ట్యాంకర్ నంబర్‌తో పాటు జీపీఎస్ ఆధారంగా ట్యాంకర్‌ను ట్రాక్ చేసే సదుపాయం కల్పించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాటర్‌బోర్డు వెనుకడుగు

సాధారణంగా ఆన్‌లైన్‌లో క్యాబ్, ఆటో, బైక్ బుక్ చేస్తే సంబంధిత డ్రైవర్ నంబర్‌తో పాటు వాహనం ఎక్కడుందో ట్రాక్ చేయవచ్చు. వాటర్‌బోర్డులో సాంకేతిక నిపుణులు ఉన్నా, ట్యాంకర్‌ను ట్రాక్‌చేసే సదుపాయం తేవడం లేదు. నీటిబిల్లుల బిల్లింగ్ విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, ప్రత్యేక యాప్ తెచ్చిన అధికారులు, నీటి ట్యాంకర్లను నిర్ణీత సమయానికి డెలివరీ చేసే చర్యలు మాత్రం చేపట్టడం లేదు.



కళాకారుల ప్రదర్శనలు

కలర్స్ ఆఫ్ ఇండియా

- అలరించిన ప్రదర్శనలు

ఖైరతాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కలర్స్ ఆఫ్ ఇండియా పేరిట ఒకే వేదికపై 600 మంది కళాకారులు గంటపాటు ఇచ్చిన ప్రదర్శన సందర్శకులను అలరించింది. పీపుల్స్‌ప్లాజాలో జరుగుతున్న జాతీయ సంస్కృతీ మహోత్సవం సోమవారం అద్భుత ప్రదర్శనలకు వేదికగా మారింది. కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రదర్శనలను తిలకించి కళాకారులను అభినందించారు. అనంతరం అక్కడి స్టాళ్లను సందర్శించారు. పలురాష్ట్రాలకు చెందిన వంటకాలతో కూడిన స్టాళ్లలోని రుచులను సందర్శకులు ఆస్వాదిస్తున్నారు. ఈ ఉత్సవం మంగళవారం ముగియనుంది.



స్టాల్‌లోని వస్త్రాలను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గీత దాటొద్దు..

- రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం
- సీపీ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్



హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కొరడా ఝులిపిస్తున్నారు. మహానగరంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పాత అధికారులు బదిలీ కావడం, కొత్త అధికారులు పూర్తిస్థాయిలో కొలువుదీరకపోవడంతో ట్రాఫిక్ కార్యాచరణ, క్రమబద్ధీకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. కొన్నిచోట్ల క్షేత్రస్థాయి

మిగతా 8వ పేజీలో..

మూడో అంతస్తు నుంచి పడి

వృద్ధురాలి మృతి

7



భవనంపై నుంచి దూకి

బలవన్మరణం

- పెళ్లి కాలేదని యువతి..
- పనిఒత్తిడితో వివాహిత..

వయసు మీరుతున్నా పెళ్లి కావడం లేదని ఓ యువతి ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇంకోచోట కార్యాలయం నాలుగో అంతస్తు దూకి మహిళ బలవన్మరణానికి పాల్పడింది. వేర్వేరు పరిధుల్లో జరిగిన ఘటనలు ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి.

అఫ్జల్‌గంజ్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. జియాగూడ ఎంసీహెచ్ బ్లాక్‌కు చెందిన ప్రదీప్, గీత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమార్తె పూజ(30)కు ఇంకా పెళ్లి కాలేదు. సంబంధాలు కుదరడం లేదని మనస్తాపానికి గురైన పూజ సోమవారం తాము

మిగతా 8వ పేజీలో..

కమలంలో టికెట్ల లొల్లి

అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తి



హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఎంపికలో బీజేపీ అధిష్ఠానం అవలంబించిన తీరుపై మురళీధర్ రావు అనుచరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈటలకు టికెట్ కేటాయించినట్లు ప్రకటన వెలువడిన తర్వాత శనివారం రాత్రి మురళీధర్ రావు ఓ ట్వీట్ చేయడంతో కలకలం రేగింది. 'మల్కాజిగిరిలో నా కోసం పనిచేసిన వారికి ధన్యవాదాలు... త్వరలోనే అనుచరులు, కార్యకర్తలను వ్యక్తిగతంగా కలుస్తా, ఆపై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తా' అని ఆయన ట్వీట్ చేశారు. మల్కాజిగిరి టికెట్ కోసం బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఎం.కొమురయ్య, సీనియర్ నాయకులు చాడ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, తూళ్ల వీరేందర్‌గౌడ్, మల్లారెడ్డి, పన్నాల హరీ‌ష్‌రెడ్డి, సామ రంగారెడ్డి ప్రయత్నాలు చేశారు. గత లోక్‌సభ ఎన్నికలో ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు పోటీ చేశారు. ఈ సారి పోటీకి ఆయన ఆసక్తి చూపలేదు. మల్కాజిగిరి టికెట్ తనకే ఇస్తానని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో మురళీధర్‌రావు నియోజకవర్గంలో అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రచారం చేసుకుంటున్నారు. ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటుచేశారు. చాయ్‌పే చర్చ కార్యక్రమాలతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. డిజిటల్ హిందూ కార్యక్రమాలను నిర్వహించారు. ఫిర్ ఏక్ బార్ మోదీ పేరుతో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. టికెట్ ఖరారు చేసే రోజు కూడా మూసాపేటలో అభిమానులు, అనుచరులతో సమావేశం నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాల కోసం పని చేస్తున్న వారికి టికెట్ ఇవ్వడం లేదంటూ సోషల్ మీడియాలో కార్యకర్తలు,

మిగతా 8వ పేజీలో..



త్వరలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు..!

- ఎన్నికల షెడ్యూల్ ఊహాగానాల నేపథ్యంలో చకచకా ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రెండోవారంలో వెలువడే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. నగరంలోని ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల్లో స్పీడ్ పెంచాలని నిర్ణయించింది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల8న పాతబస్తీలో మెట్రోకారిడార్ పనులకు శంకుస్థాపనతో చేయడంతో పాటు, రూ. 178 కోట్ల వ్యయంతో బైరామల్‌గూడ చౌరస్తాలో నిర్మించిన సెకండ్ లెవల్ వంతెనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 9న ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఎల్‌బీనగర్ చౌరస్తా వైపు నుంచి ఒవైసీ ఆస్పత్రి, ఒవైసీ ఆస్పత్రి నుంచి ఎల్‌బీనగర్ వైపు వచ్చేలా ఎడమ, కుడివైపు వంతెనలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు సెకండ్ లెవల్ వంతెన ప్రారంభమైతే బైరామల్‌గూడ జంక్షన్ స్వరూపం మారనుంది. ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి.


జీరో బిల్లు..



గృహజ్యోతి పథకంలో భాగంగా సోమవారం ముషీరాబాద్‌లో మహిళలకు జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీఎస్ఎస్పీడీసీఎల్ మెట్రోజోన్ సీజీఎం నరసింహస్వామి, సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ బ్రహ్మం

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

చెరువు చెరువుకో కబ్జా కథ!



సున్నం చెరువు

ఐటీ కారిడార్ నుంచి నాగోలు శివారు వరకూ, నల్లగండ్ల పెద్ద చెరువు, దుండిగల్ చిన్న చెరువు.. ఇలా ప్రతి చెరువు పరిధిలోనూ ఆక్రమణలు కనిపిస్తున్నాయి. కొన్నింటిని గుర్తించి కూలగొడుతూనే.. కొత్తగా మరిన్ని నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు అధికారులు. ఈతంతు గ్రేటర్‌లో కొన్నేళ్లుగా జరుగుతూనే ఉంది.

హైదరాబాద్ సిటీ నెట్‌వర్క్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లోని సున్నం చెరువులో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎఫ్ఎటీఎల్ పరిధిలో 78, బఫర్ జోన్‌లో 38 అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి బంధువులకు సంబంధించిన కంపెనీ బఫర్ జోన్‌లో విల్లాలు నిర్మించింది. రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ), జీహెచ్ఎంసీ నుంచి అనుమతులూ ఆ ప్రాజెక్టుకు సులువుగా వచ్చాయి. ఫిర్యాదులు వచ్చినా.. నిర్మాణదారులకు నోటీసులిచ్చి పనులు నిలిపివేసిన దాఖలాలు లేవు. అలాగే గగన్‌పహడ్‌లోని సర్వే నెంబర్ 247లో ఉన్న మామిడికుంట చెరువు వాస్తవ విస్తీర్ణం 19.15 ఎకరాలు. కానీ ప్రస్తుతం చెరువు విస్తీర్ణం 13 ఎకరాల లోపే ఉంటుంది. కొందరు ప్రైవేట్ వ్యక్తులు చెరువును పూడ్చే ప్రయత్నం చేస్తే స్థానికులు అడ్డుకొని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఎడ్లవానికుంట అన్యాక్రాంతం కాకుండా జీహెచ్ఎంసీ చర్యలు 8

చెరువులు చెర -2

ఫతుల్లగూడ చెరువు




చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన నిర్మాణాలు

18 ఎకరాల నుంచి 10 ఎకరాలకు..

నాగోల్‌లోని ఫతుల్లగూడ చెరువు చుట్టూ ఏడేళ్ల క్రితం ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. ఫెన్సింగ్ తొలగించి మరీ ఆక్రమణదారులు కబ్జాకు పాల్పడుతున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు గుడ్డిగా అనుమతులిస్తుండడంతో ఎఫ్‌టీఎల్ పరిధిలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. శాశ్వత నిర్మాణాలూ మొదలయ్యాయి. 18 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు విస్తీర్ణం ప్రస్తుతం 10 ఎకరాలకు తగ్గింది. ఉప్పల్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలో ఉండడంతో చెరువు పరిరక్షణను ఎవరూ పట్టించుకోవడం లేదు.

చిన్న దామెర చెరువు



చిన్నదామెర చెరువు ఎఫ్‌టీఎల్‌లో బస్సుల పార్కింగ్

ఇంత గుడ్డిగా అనుమతులిస్తారా?

దుండిగల్‌లోని చిన్న దామెర చెరువును పరిశీలించిన అధికారులు.. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో విద్యాసంస్థలు ఉండడం చూసి షాక్‌కు గురయ్యారు. ఇంత గుడ్డిగా అనుమతులిస్తున్నారా..? అక్రమంగా నిర్మిస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అని అధికారులను అడిగినట్టు తెలిసింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో కలిపి 133 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉండగా.. ఆక్రమణలతో సగానికి తగ్గింది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఓ ఏరోనాటికల్ కళాశాల, ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన భవనాలున్నాయి. ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించిన మేడ్చల్ కలెక్టర్, ఇతర విభాగాల అధికారులు బఫర్ జోన్‌లో కొత్తగా పార్కింగ్ స్థలం, షెడ్ల నిర్మాణం, క్యాంటీన్ ఉన్నాయని, కొత్తగా రోడ్లు వేస్తున్నట్టు గుర్తించారు. పరిశీలన అనంతరం రోడ్లను, ఓ షెడ్డును తొలగించిన అధికారులు ఇతర నిర్మాణాల జోలికి వెళ్లలేదు.

సరూర్‌నగర్ చెరువు



అక్రమణలకు గురైన సరూర్‌నగర్ చెరువు

ఎఫ్‌టీఎల్ పరిధిలో 130 ప్లాట్లు

సరూర్‌నగర్ చెరువులో ఇప్పటికీ ఆక్రమణలు కొనసాగుతున్నాయి. 1974లో చెరువు విస్తీర్ణం 63 హెక్టార్లుగా ఉండేది. 1996 నాటికి 52 హెక్టార్లకు కుంచించుకుపోయింది. గత రెండున్నర దశాబ్దాల్లో కబ్జాలు పెరిగి ప్రస్తుతం 30 హెక్టార్లలోపు విస్తీర్ణంలో మాత్రమే ఉంది. చెరువు పక్కనున్న 70 ఎకరాలను ప్రభుత్వం నుంచి సింగరేణి ఉద్యోగులు తీసుకున్నారు. 500 ప్లాట్లు చేసి.. ఒక్కొక్కరికి ఒక్కో ప్లాట్ చొప్పున కేటాయించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో 130 ప్లాట్లు ఉండగా.. గతంలో అక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని నిలిపివేశారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగాలు పట్టించుకోకపోవడంతో కొంత కాలంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ సైదాబాద్, సరూర్‌నగర్ మండలాల పరిధిలో ఉండడంతో రెండు మండలాల అధికారులు మాకు సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు.

సాహిత్య ఉత్సవానికి మెర్సీమార్గరేట్‌కు ఆహ్వానం


మెర్సీమార్గరేట్

రవీంద్రభారతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ వేదికగా కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక 'ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' జాతీయ సాహిత్య ఉత్సవానికి నగరానికి చెందిన ప్రముఖ కవయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత మెర్సీమార్గరేట్‌కు ఆహ్వానం లభించింది. ఈ నెల 11 నుంచి 16వరకు ఈ సదస్సు జరగనుంది. ఈ జాతీయ సాహిత్య ఉత్సవంలో పాల్గొనాలని మెర్సీ మార్గరేట్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.కె.శ్రీనివాసరావు లేఖ పంపారు. ఈ సందర్భంగా మెర్సీమార్గరేట్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యవ్యాప్తికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5 తరగతిలో ప్రవేశానికి గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే బాలబాలికలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా పదిమంది చొప్పున బాలబాలికలను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు హైదరాబాద్ కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 83749-09268, 95535-54455 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అధిక ఫిర్యాదులు ఆ విభాగానివే..!


ఫిర్యాదులు స్వీకరిస్తున్న రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 67 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో మెజార్టీ టౌన్ ప్లానింగ్‌కు సంబంధించినవే ఉన్నాయి. కేంద్ర కార్యాలయంతోపాటు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో మొత్తం 187 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు ప్రకటించారు. ఈ ఫిర్యాదులను వారంలోగా పరిష్కరించాలని కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశించారు.

లింగంపల్లి - ఘట్‌కేసర్ మధ్య నేటి నుంచి ఎంఎంటీఎస్ సర్వీసు ప్రారంభం

భెల్‌కాలనీ/కుషాయిగూడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో లింగంపల్లి - ఘట్‌కేసర్‌ల మధ్య ఎంఎంటీఎస్ రైలు సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ తొమ్మిది బోగీలతో గల ఎంఎంటీఎస్ రైలు రెండు ట్రిప్పులు తిరిగే విధంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా రైలు ట్రిప్పులను పెంచుతామని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ఎంఎంటీఎస్ సమయం వివరాలు..

ప్రారంభం సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ నుంచి ఉదయం 10.45కి ఎంఎంటీఎస్ బయలుదేరి చర్లపల్లికి 10.59గంటలకు, నేరేడ్‌మెట్‌కు 11.21కి, అమ్ముగూడకి 11.29కి, భూదేవీనగర్‌కు 11.36కి, సుచిత్ర సెంటర్‌కు 11.45కి, ఫిరోజ్‌గూడ 11.54కు, భరత్‌నగర్ 12.03కు, బోరబండ 12.07కు, హైటెక్‌సిటీకి 12.12, హఫీజ్‌పేట్‌కి 12.18, చందానగర్‌కి మధ్యాహ్నం 12.23, లింగంపల్లికి 12.40కి చేరుతుంది.

'శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి'

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ఈ నెల 6 నుంచి ఆరు రోజుల పాటు కీసరగుట్టపై జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో ఆయా శాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ దాదాపు 1800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని, 56 సీసీ కెమెరాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత బస్సు సౌకర్యాంలో భాగంగా 300 బస్సులు జాతరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు కలెక్టర్ గౌతమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి కీసరగుట్ట క్షేత్రంపై కలియతిరిగారు.

అపోలో ఆస్పత్రిలో మహిళకు కార్-టీ సెల్ థెరపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి కార్ - టీ సెల్ థెరపీని నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన 50 ఏళ్ల మహిళా రోగి కొంతకాలంగా మల్టిపుల్ మైలోమా (బ్లడ్ కేన్సర్ కండిషన్)తో బాధపడుతున్నది. ఆమె ఇటీవల అపోలో కేన్సర్ సెంటర్ వైద్యుల వద్దకు రాగా, ఆమెకు వైద్య పరీక్షలు చేసి కేవలం కార్-టీ థెరపీ ద్వారానే చికిత్స అందించడానికి అవకాశముందని నిర్ధారించుకుని వైద్య ప్రక్రియను ప్రారంభించారు. చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ టీ-సెల్ (కార్-టీ) థెరపీని విజయవంతంగా నిర్వహించి కేన్సర్ చికిత్సలో అపోలో ఆస్పత్రి మరో మైలురాయిని చేరుకుందని అపోలో కేన్సర్ సెంటర్ హెమటాలజిస్ట్, బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ లోకిరెడ్డి చెప్పారు. అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడంలో తమ ఆస్పత్రి ముందంజలో ఉంటున్నదన్నారు.

24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య



ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో టెట్‌తోపాటు 24వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ సాధనకోసం మహాధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. ఇరవై సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఐదువేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ టీచర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి భర్తీ చేయాలన్నారు. బీసీ యువజన సంఘంరాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత జరిగిన ధర్నాలో బీసీ నేతలు గువ్వల భరత్, నందగోపాల్, రామకృష్ణ, నరసింహాగౌడ్, పోతులారం కృష్ణ, ప్రీతమ్, రాందేవ్, ఉదయ్, సతీష్, నిఖిల్, రఘుపతి, కరుణశ్రీ జయంతితోపాటు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు వేతనాలు పెంచాలి'

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ రెండో వేతన సవరణ కమిషన్ కమిషనర్ శివశంకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు గత వేతన సవరణల్లో జరిగిన అన్యాయాలపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని వేతనసవరణ కమిషన్‌ను కోరారు. ల్యాబ్ టెక్నీషియన్లకు వృత్తిపరంగా ఉన్న రిస్క్ ఫ్యాక్టర్స్ వల్ల కలిగే జీవితకాల ఆరోగ్య ప్రమాదాలకై, విద్య వైద్యం కోసం ప్రత్యేక అలవెన్సు మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడంతస్తుల మేడపైనుంచి పడి వృద్ధురాలి మృతి



శారద బెన్ (ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉతికిన దుస్తులు ఆరేస్తూ మూడంతస్తుల మేడ పైనుంచి కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీలో ఇతీష్ కుమార్ కుటుంబం నివాసం ఉంటున్నది. సోమవారం ఇంట్లోని వారంతా పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఇతీష్‌కుమార్ తల్లి శారద బెన్(70) మూడంతస్తుల భవనంపై దుస్తులు ఆరవేస్తుండగా కళ్లు తిరిగి పై నుంచి కింద పడింది. మృతిచెందింది. శబ్దం రావడంతో నాలుగో అంతస్తులోని భావన పటేల్ బయటకు వచ్చి చూసి ఇతీష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇతీష్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ భాను ప్రకాశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

నగరంలో టానిక్ లిక్కర్స్ సెంటర్లలో వాణిజ్య పన్నుల శాఖ సోదాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టానిక్ లిక్కర్స్ గ్రూప్‌నకు చెందిన షాపులు, వాటి అనుబంధ సంస్థలలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 11గంటల వరకు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీలతో పాటు నగరంలో సుమారు 10చోట్ల సోదాలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న బ్రాండ్స్‌కు సంబంధించి కొనుగోలు వివరాలు.. ఎప్పుడు ఆర్డర్ ఇచ్చారు.. ఎక్కడి నుంచి సరఫరా అయింది? వాటికి సంబంధించిన లేబుల్స్ వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు వివరించిన తర్వాత తదుపరి చర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు.

విదేశాలకు తల వెంట్రుకల ఎగుమతిలో అక్రమాలు

- ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును అనుమతించిన కోర్టు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు తల వెంట్రుకలు(జుట్టు) ఎగుమతి చేసి కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డ కేసులో ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును కోర్టు అనుమతించింది. జుట్టు అక్రమ ఎగుమతులపై ఈడీ నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు చెందిన 17 మందిపై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును గత ఆగస్టు 21న నాంపల్లి పీఎంఎల్‌ఏ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును కోర్టు ఇటీవలే అనుమతించినట్లు ఈడీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వెంట్రుకలను మిజోరం వద్ద భూమార్గంలో మయన్మార్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాంకు ఎగుమతి చేసినట్లు లభించిన ఆధారాల మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ పలు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో రూ. 1.21 కోట్లు లెక్కలోలేని నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని రూ. 7.85 కోట్లు ఫ్రీజ్ చేసింది.

వైభవంగా తిరు కళ్యాణోత్సవం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్

చాంద్రాయణగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేశవగిరిలో లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో సోమవారం స్వామి వారి తిరు కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈవో శివ రుద్రప్ప, పాలక మండలి చైర్‌పర్సన్ జుర్కి. సంతోషిరాణి, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, ఉమా మహేశ్వరి, రవి రాహుల్, పి.చంద్రశేఖర్, మీనాక్షి, పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఇంటెలిజెన్స్ ఏసీపీ రుద్రభాస్కర్, నాయకులు జుర్కి రాజేందర్, వెంకటేశ్, ప్రమోద్ కార్వంకర్, రాజు ముదిరాజ్, జంగరాజు తదితరులు పాల్గొన్నారు

పట్టువస్త్రాల సమర్పణ

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి పల్లకీ ఊరేగింపు పురవీధులలో వైభవంగా జరిగింది. చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్, ఎస్ఐ పోచయ్య స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

అన్ని రంగాల్లో రాణించేలా

విద్యార్థులను ప్రోత్సహించాలి

ఎంఈవో రామిరెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రామిరెడ్డి, జి.శరవణ్‌కుమార్

రాజేంద్రనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆదర్శ విద్యాలయ హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ జి.శరవణ్‌కుమార్, కళ్యాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామిరెడ్డి ప్రారంభించారు. ఇంగ్లిష్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు లఘు నాటికలను ప్రదర్శించారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు తాము నేర్చుకున్న పాఠాలను ప్రదర్శనల రూపంలో వివరించారు. గణితంలో ప్రాజెక్టులను ప్రాక్టికల్‌గా చేసి వాటిని వివరించారు. సైన్స్ ఫెయిర్‌లో వాతావరణ మార్పులను తట్టుకునే విధానాలు, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడటం లాంటివి చేసి చూపించారు. విద్యార్థుల ప్రదర్శనలను చూసిన ఎంఈఓ రామిరెడ్డి వారిని అభినందించారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు అన్ని రంగాలలో రాణించేలా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు. పోటీ ప్రపంచంలో అన్ని రంగాలలో రాణించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు జి.సుబ్బారావు, ప్రధానోపాధ్యాయురాలు గిరిజాదేవి, ఉప ప్రధానోపాధ్యాయురాలు అఫ్సర్ షాహీన్, ఉపాధ్యాయులు కిరణ్మయి, రేష్మా, నమ్రత, తులసి, ప్రమీల, నాగశ్రీ, లావణ్య, ఎం.రాంబాబు యాదవ్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలి



డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వై.శ్రీధర్, జి.బాబురావు తదితరులు

రాజేంద్రనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నవజ్యోతి యూత్ క్లబ్ వెనుకాల, జగ్జీవన్‌రాం కాలనీలో, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుటి వీధిలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, చాలా వీధులలో వీధి దీపాలు సరిగా వెలుగడం లేదని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు అన్నారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, వాటర్‌వర్క్స్ డీజీఎంను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్‌రాం కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శివరాంపల్లి సరస్వతి శిశు మందిర్ రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉందన్నారు. వైకుంఠధామం వద్ద వ్యర్థాలను పడేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మూల శ్రీనివాస్‌గౌడ్, ఎస్. విఠల్, పులిమామిడి రవీందర్, పసుపుల సందీప్ ముదిరాజ్, రాపర్తి రాకేశ్‌గౌడ్, స్వామి, కవిత తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నిర్వహణలో స్త్రీ పాత్ర గొప్పది

స్త్రీ శక్తి - సోషల్ స్ఫూర్తి కవి సమ్మేళనంలో వక్తలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ, సామాజిక నిర్వహణలో స్త్రీ పాత్ర గొప్పదని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం తెలంగాణ సారస్వత పరిషత్తులో స్ఫూర్తి కుటుంబం సంస్థ ఆధ్వర్యంలో స్త్రీశక్తి-సోషల్ స్ఫూర్తి నిర్వహణలో స్త్రీశక్తి సమ్మేళనం పేరిట కవి సమ్మేళనం నిర్వహించారు. అతిథులుగా తెలుగు వర్సిటీ చిత్రవాణి విభాగం డిప్యూటీ డైరెక్టర్ అయినంపూడి శ్రీలక్ష్మి, ప్రముఖ రచయిత్రి శైలజమిత్ర రమణి, డా.నాగేశ్వరి, డా.విమల, స్రవంతి, గీత, వాసుశ్రీ తదితరులు పాల్గొని కవయిత్రులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక విశ్వగురువు గురు విశ్వస్ఫూర్తి ఆశయ సంకల్పమైన మానవత, ఆత్మీయత, సమాజ స్థాపనే లక్ష్యంగా స్ఫూర్తి కుటుంబం ఏర్పడిందని అన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం, స్త్రీ ఆరవతనం అనే గురు విశ్వస్ఫూర్తి రచనలలోని ప్రతిపాదనలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు కవయిత్రులు తమ కవితలను చదివి వినిపించారు.

ఔటర్‌పై ప్రమాదం

- కారు ఢీకొని ఆర్మీ జవాన్ మృతి



కులాన్ (ఫైల్)

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం నార్సింగ్ వద్ద ఓ వ్యక్తి ఔటర్ రింగ్ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టుకు వేగంగా వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారుల సమాచారం మేరకు నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతి చెందిన వ్యక్తి గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్న కులాన్‌గా గుర్తించారు. కులాన్ మృతి విషయం తెలుసుకున్న గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ జవాన్లు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు. సాధారణంగా పాదచారులకు ఔటర్ రింగ్‌రోడ్డు పైకి అనుమతి లేదు. కానీ అతడు అక్కడకు ఎందుకు వెళ్లాడు అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

రాజేంద్రనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):అనుమానంతో భార్యను హత్య చేశాడో వ్యక్తి. ఈ సంఘటన మైలార్‌దేవుపల్లి డివిజన్ శాస్త్రీపురం కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అమిత్‌లాల్ సాహు(43)కి వివాహం కాగా భార్య వెళ్లిపోయింది. అదే ప్రాంతానికి చెందిన మధుబాయి(29)కి వివాహం అయింది. భర్త మరణించడంతో సాహును పెళ్లి చేసుకుంది. వీరికి బాబు. ఇద్దరూ కలిసి శాస్త్రీపురంలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ వద్ద పనులు చేస్తున్నారు. పనిచేస్తున్న చోట మధుబాయి ఇతర కార్మికులతో చనువుగా మాట్లాడుతుండటం అమిత్‌లాల్ సాహుకు నచ్చలేదు. ఈ విషయమై వారం రోజుల నుంచి భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోంది. ఆదివారం రాత్రి మధుబాయి నిద్రపోయిన తర్వాత కూరగాయలు కోసే కత్తితో ఆమె మెడ కోయడానికి ప్రయత్నించాడు. మధుబాయి లేచి కేకలు వేయడంతో సరదాగా అని చెప్పి సముదాయించాడు. కొద్దిసేపటికి ఆమె నిద్రలోకి జారుకున్న తర్వాత బండరాయితో తలపై మోది హత్య చేశాడు. అనంతరం మైలార్‌దేవుపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఇన్‌స్పెక్టర్ పి. మధ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.కోదండరాం

విద్యారంగాన్ని గాడిలో పెట్టాలి

- కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలి
- పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్ ఎం.కోదండరాం, విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక నాయకులు ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు మాట్లాడారు.

అంగన్‌వాడీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి పేద విద్యార్థులను శారీరకంగా, మానసికంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, హాస్టల్స్, కళాశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని మరింత పెంచాలన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ నోటిఫికేషన్ ఇచ్చే విధంగా క్యాలెండర్‌ను రూపొందించాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీ.శ్రీకాంత్, ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు మమత, జిన్నారపు రాజేశ్వర్, గడ్డం శ్యామ్, ఖానాపురం రాజేష్, అశోక్, ఆసిఫ్, గణేష్, గౌతమ్, షరణ్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/JyiCtVp లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్‌గా కె.ఆదిరెడ్డి



ఆదిరెడ్డి

చాంద్రాయణగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్‌గా కె.ఆదిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఇక్కడ పనిచేసిన రాఘవేంద్ర బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆదిరెడ్డి ఫలక్‌నుమాకు బదిలీపై వచ్చారు. ఈయన నగరంలో పలు స్టేషన్లలో ఎస్ఐగా, ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. అర్హులకు అందని 'గృహజ్యోతి'

చాంద్రాయణగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొంతమంది అర్హులకు గృహజ్యోతి పథకం అందని పరిస్థితి నెలకొంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఫోన్ నంబర్ వివరాలు అందజేసినా, నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించని వారు కూడా పథకానికి ఎంపిక కాకపోవడంతో విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి.

'కేఎల్‌ఆర్‌కు చేవెళ్ల ఎంపీ టికెట్ కేటాయించాలి'

పహాడిషరీఫ్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి కేటాయించాలని కాంగ్రెస్ జల్‌పల్లి మునిసిపాలిటీ కో-ఆర్డినేటర్ తయ్యాబ్ దయన్ని డిమాండ్ చేశారు. కాలనీలు, బస్తీల్లో పేదల దాహార్తి తీర్చడానికి కేఎల్‌ఆర్ ట్రస్ట్ తరఫున ఉచితంగా ఆయన బోర్లు వేయించారని, లీడ్ ఇండియా సంస్థ స్థాపించి ఎంతోమందికి ఉపాధి కల్పించారన్నారు. కేఎల్‌ఆర్‌ను చేవెళ్ల నుంచి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కేఎల్‌ఆర్‌కు చేవెళ్ల ఎంపీ టికెట్ కేటాయించాలని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫాక్స్ ద్వారా విజ్ఞప్తులు పంపించామని తయ్యాబ్ దయ్యాని పేర్కొన్నారు.

ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ చేవెళ్ల అభ్యర్థిగా అబ్బాసీ



చార్మినార్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా మొగల్‌పురాకు చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీని ఖరారు చేశామని ఆ పార్టీ అఖిల భారత అధ్యక్షుడు సయ్యద్ హమీద్ హుస్సేని సుత్తారీ వెల్లడించారు. మొఘల్‌పురాలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు.

'అసదుద్దీన్ ప్రజలకు ఏమీ చేయలేదు'

చార్మినార్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్‌ను త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించి బీజేపీకి పట్టం కట్టనున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసదుద్దీన్ ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో పరిధిలోని ప్రాంతాలు నేటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని, పాత బస్తీలో మెట్రో రాకుండా అడ్డుకుంది మజ్లిస్ పార్టీ అని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పాతబస్తీ ప్రజలు ఎంఐఎంను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

- జోనల్ కమిషనర్ వెంకన్న

మదీన, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. సోమవారం నర్కి పూల్‌బాగ్‌లో జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంతోష్‌నగర్‌కు చెందిన ఆస్తి పన్ను సమస్యలపై మూడు, మలక్‌పేట సర్కిల్‌లో అక్రమ నిర్మాణం, చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో నాలా విస్తరణ, విద్యుత్ స్తంభం ఏర్పాటు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్(యూబీడీ) అమీనాబీ, టౌన్‌ప్లానింగ్ జోన్ సిటీ ప్లానర్ శ్యామ్‌కుమార్, జోనల్ ఏఎంసీ రాజారావు, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ఈఈ హరికిశోర్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఎంసీ మహేందర్‌రెడ్డి

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

మదీన, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల కోసం ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చని, జీరో విద్యుత్ బిల్లు రాని వారు మరలా దరఖాస్తు చేసుకోవచ్చని చాంద్రాయణగుట్ట సర్కిల్-8 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పూల్‌బాగ్‌లో జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు, ఏదైనా కారణంతో దరఖాస్తు తిరస్కరణకు గురైనవారు మరలా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, సెల్‌ఫోన్ నంబర్లతో డివిజన్లవారీగా కేటాయించిన కౌంటర్లలో అందజేయవచ్చన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్ల బడ్జెట్‌తో గల్ఫ్‌సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బహుజన ముక్తి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర నాయకులు దేవతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గల్ఫ్ సంక్షేమ బోర్డు సాధన కోసం రిలే నిరాహార దీక్ష చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంసోల్‌లక్ష్మణ్ మాట్లాడారు. కార్యక్రమంలో బహుజన ముక్తిమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వలిగె ప్రభాకర్, బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, ఉపాధ్యక్షులు జి.శ్యామల్ రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉప్పులేటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల మేనిఫెస్టో విడుదల చేస్తున్న కోదండరాం

మైనారిటీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి

పురానీహవేలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మైనారిటీలకు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పథకాల్లో తగినవాటా కల్పించి వారి జీవన పరిస్థితులు మెరుగుపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రొఫెసర్ కోదండరాం కోరారు. సోమవారం పురానీహవేలి డివిజన్ పరిధి చత్తాబజారులోని ఎస్ఐఓ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీల కోసం అమలవుతున్న విద్యా పథకాలను కేంద్ర నిలిపి వేయడం తగదని, విద్యాసంస్థల్లో వివక్ష నిర్మూలించి, జాతీయ సమైక్యతకు ప్రమాదం వాటిల్లే కార్యక్రమాలను మానుకోవాలని హితవు పలికారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు.. విద్యార్థుల విద్య సంబంధిత అంశాలతో కూడిన విద్యార్థుల మేనిఫెస్టో విడుదల చేసింది. కార్యక్రమంలో ఎస్ఐఓ జాతీయ కార్యదర్శి అబ్దుల్లా ఫైజ్, ఫరాజ్, జమాతె ఇస్లామి హింద్ తెలంగాణ ఉపాధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

12న పీజీఈసెట్ నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పీజీఈసెట్ నోటిఫికేషన్‌ను ఈనెల 12న విడుదల చేసేందుకు జేఎన్‌టీయూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 19 ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు.

ఈఏపీసెట్‌కు 40వేల దరఖాస్తులు

ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కామన్‌ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసెట్)కు సోమవారం వరకు సుమారు 40వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఈఏపీసెట్ కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో 25,800మంది దరఖాస్తు చేసుకోగా, ఫార్మసీ, అగ్రికల్చర్ పరీక్షకు 14,708మంది.. రెండు పరీక్షల కోసం మరో 42మంది దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ తెలిపారు. ఈఏపీసెట్-2024కు గత నెల 26న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన సంగతి తెలిసిందే.

అబ్దుల్ రహ్మాన్ కోసం గాలింపు

● రాడిసన్ కొకైన్ పార్టీలో సాగుతున్న దర్యాప్తు

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాడిసన్ హోటల్ కొకైన్ పార్టీ వ్యవహారంలో ప్రధాన డ్రగ్స్ సరఫరాదారు అబ్దుల్ రహ్మాన్ పోలీసులకు ఇంకా దొరకలేదు. సోమవారం పోలీసుల ఎదుట హాజరైన సందీప్‌కు రక్తనమూనాలతో పాటు వివిధ పరీక్షలు నిర్వహించారు. మరోవైపు ఆదివారం రాత్రి నటి లిషి కూడా గచ్చిబౌలి పోలీసుల ముందు హాజరుకావడంతో ఆమెకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు చెప్పారు. ఇక పోలీసుల ముందుకు రావాల్సిన వారిలో శ్వేత, నిర్మాత నీల్‌లు మాత్రమే ఉన్నారు. వారిద్దరిలో నీల్‌కు అమెరికా పౌరసత్వం ఉండటంతో ఆయన అక్కడికి పారిపోయినట్లు తెలిసింది. శ్వేత కూడా నేడు పోలీసుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయని సమాచారం.

పార్లమెంట్‌లోనూ కాంగ్రెస్‌దే జోరు!

● మూడునెలల్లో నాలుగు గ్యారంటీలు అమలు చేశాం
● ఉప్పల్ నియోజకవర్గ సమావేశంలో మంత్రి తుమ్మల

ఉప్పల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఫలితాల జోరు పార్లమెంట్ స్థానాల్లోనూ ఉండబోతున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలను మూడు నెలల్లోనే అమలు చేసి ప్రజాప్రభుత్వంగా చరిత్రలో నిలిచామని పేర్కొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.

17 స్థానాల్లో ఎగిరేది మూడురంగుల జెండానే

తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తున్నారని మంత్రి తుమ్మల ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ ఉండబోతున్నదన్నారు. మల్కాజిగిరి నుంచి పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో ప్రజలు గమనిస్తున్నారని మంత్రి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ మూడురంగుల జెండాకే అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు.



ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కష్టపడదాం.. రాహుల్‌ని ప్రధానిని చేద్దాం

కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పనిచేయాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలన్నారు. తద్వారా దేశంతోపాటు తెలంగాణను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అంతేగాకుండా బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టేలా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు మందముల రజితారెడ్డి, బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్, నాయకులు కంది ఆదిరెడ్డి, జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, చెన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి రూ.47లక్షల జరిమానా

● 2013లో ప్రసవం సమయంలో డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలింత మృతి
● వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించిన భర్త
● 30 రోజుల్లోగా పరిహారం చెల్లించాలని ఫోరం తీర్పు

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యపరమైన నిర్లక్ష్యంతో బాలింత మృతికి కారణమైన ఓ ఆస్పత్రికి వినియోగదారుల ఫోరం రూ.47లక్షల జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని బాలింత భర్త, కుమార్తెకు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. హైదరాబాద్ నగరానికి చెందిన హరిప్రసాద్ భార్య 2013లో గర్భవతి అయినప్పుడు ఈస్ట్ మారేడ్‌పల్లిలోని ఓ నర్సింగ్‌హోమ్‌లో రెగ్యులర్‌గా చెకప్ చేయించుకుంది. డెలివరీ డేట్ దగ్గర పడటంతో డాక్టర్ సూచన మేరకు 2013, ఆగస్టు 10న ఆస్పత్రిలో చేరింది. ఆగస్టు 11న ఉదయం 8.58గంటలకు నార్మల్ డెలివరీ అయిందని, పాప పుట్టిందని చెప్పిన వైద్యులు.. 9.20 గంటలకు తల్లికి బ్లీడింగ్ అవుతుందని, ఆమెకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. తమకు ఇన్సూరెన్స్ కవరేజీ ఉందని, వేరే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలిస్తామని హరిప్రసాద్ చెప్పినా వినిపించుకోకుండా చికిత్స చేస్తామన్నారు. 10.20 గంటలకు బాలింతకు రక్తం, ప్లాస్మా కావాలని, ప్యారడైజ్ వద్ద ఉన్న సన్‌షైన్ ఆస్పత్రి నుంచి తీసుకురమ్మని కోరారు. హరిప్రసాద్ రక్తం తీసుకొని 11.25 గంటలకు ఆస్పత్రికి చేరుకున్నాడు. అప్పటికే పరిస్థితి విషమించిందని చేతులెత్తేసిన వైద్యులు 11.45 గంటలకు హరిప్రసాద్ భార్య చనిపోయిందని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భార్య చనిపోయిందని హరిప్రసాద్ ఆరోపించాడు. ఆస్పత్రి సమీపంలో బ్లడ్ బ్యాంకులున్నా తనను దూరంగా ఉన్న సన్‌షైన్ ఆస్పత్రి నుంచి రక్తం తీసుకురమ్మన్నారని, వైద్యులు బ్లడ్ గ్రూపింగ్ చేయనందువల్ల రక్తం తీసుకువచ్చేందుకు ఆలస్యమైందన్నారు. వైద్యులు నిర్లక్షంతో తన కుమార్తెకు కన్నతల్లి లేని లోటును కలిగించారని, తనకు జరిగిన నష్టానికి పరిహారంగా రూ.99 లక్షలు చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల ఫోరంలో అప్పీలు చేశాడు. అయితే, బాలింత ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే పేరుగాంచిన సన్‌షైన్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తం, ప్లాస్మా కొనుగోలు చేయాలన్నామని, హరిప్రసాద్ భార్య మొదటి సారి ఆస్పత్రికి వచ్చిన సమయంలోనే ఆమె బ్లడ్ గ్రూపింగ్ చేశామని, ఇందులో వైద్యుల నిర్లక్షం ఏదీ లేదని, కేసును కొట్టి వేయాలని ఆస్పత్రి తరఫు న్యాయవాది కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ప్రసవం తర్వాత రోగికి సరైన చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్షం చేశారని గుర్తించింది. బాధితుడికి రూ.43.57 లక్షలు 7% వార్షిక వడ్డీతో కలిపి 30 రోజుల్లో చెల్లించాలని తీర్పునిచ్చింది. తల్లిలేని లోటును తీర్చడం ఎవరికీ సాధ్యం కాదని చెప్పిన ధర్మాసనం ఆస్పత్రి చెల్లించిన పరిహారంలో సగం మొత్తం పాప పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించాలని సూచించింది.

ట్యాంక్‌బండ్‌పై టీఎస్ సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి : వంగపల్లి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ఉద్యమ నాయకురాలు, తొలి డిప్యూటీ స్పీకర్, మంత్రి టీఎస్ సదాలక్ష్మి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టాలని టీఎస్ ఎమ్మార్పీస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో సదాలక్ష్మి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సదాలక్ష్మి గత ఆరు దశాబ్దాల పాటు రాజకీయాలలో ఉండి మంత్రిగా పేద ప్రజలకు ఎన్నో సేవలందించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బంగారు శ్రీనివాస్, పాలగుడు శ్రీనివాస్, కొల్లూరి వెంకటేష్, శ్యామ్‌రావు, వెంకట్, రమేష్, ప్రవీణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాభిక్ష జీఓ కోసం ఎదురుచూపులు

సైదాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జైలులో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష కార్యరూపం దాల్చడంలో ఆలస్యమవుతుండటంతో ఖైదీలు, వారి కుటుంబసభ్యులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. జీఓ విడుదల కోసం ఖైదీల కుటుంబ సభ్యులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారు కారాగారం వద్ద నిరీక్షిస్తున్నారు. జీఓ రాలేదని తెలిసి కన్నీటి పర్యంతమవుతున్నారు. మరోవైపు ఖైదీలు జైలులో క్షణమొక యుగంలా గడుపుతున్నారు. జీఓ విడుదల గురించి అధికారులను అడిగితే మంత్రిమండలి ఆమోదించి గవర్నర్ అనుమతికి పంపిందని, ఉత్తర్వులు రావాల్సి ఉన్నదని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జైళ్లలో క్షమాభిక్షకు అర్హులైన 231 మంది ఖైదీల వివరాలను జనవరి 26కు ముందే సీఎంఓ, సీఎస్, హోంశాఖ కార్యాలయాలకు పంపారు. పాలనా వ్యవహారాలలో ఇబ్బందుల వల్లే జీఓ ఆలస్యమవుతున్నట్లు సమాచారం. క్షమాభిక్ష జీఓ ఉత్తర్వులు వెలువడితే 231 మంది ఖైదీల్లో 212మంది జీవిత ఖైదీలు, వివిధ నేరాలతో శిక్షపడిన 12 మంది విడుదల కానున్నారు. 2022 ఆగస్టులో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల దృష్ట్యా రాష్ట్రంలోని వివిధ జైళ్లలో సత్ప్రవర్తన కలిగిన 75 మంది ఖైదీలను విడుదల చేస్తున్నట్లు కేబినెట్ తీర్మానించినా అమలుకు నోచుకోలేదు. గవర్నర్ స్పందించి ఖైదీలకు క్షమాభిక్ష పెట్టాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

విద్యాసంవత్సరంలో కొత్తబస్సులు

● జూన్‌నాటికి బస్సుల సంఖ్య పెంపు..

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. జూన్‌నాటికి గ్రేటర్‌లో బస్సుల సంఖ్య పెంచేదిశగా ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్తబస్సులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలంటూ టీఎస్ఆర్టీసీ ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. ఎలక్ట్రిక్ బస్సులు రావడంలో ఆలస్యమైతే ముందు డీజిల్ బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చేదిశగా ఆర్టీసీ చర్యలు తీసుకుంటున్నది. ప్రస్తుతం 2,638 బస్సులున్నాయని, వాటిని 3,638లకు పెంచే లక్ష్యంగా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆరు నెలల్లో 500 ఎలక్ట్రిక్, మరో 500 డీజిల్ బస్సులు గ్రేటర్‌లో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ఆర్టీసీ దసరా లక్కీడ్రా విజేతలు వీరే

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దసరా లక్కీ డ్రా విజేతలను ఆర్టీసీ సోమవారం ప్రకటించింది. దసరా సందర్భంగా ఆర్టీసీలో ప్రయాణం చేసిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని అప్పట్లో యాజమాన్యం ప్రకటించింది. అయితే, దసరా నాటికి ఎన్నికల కోడ్ రావడంతో డ్రాను వాయిదా వేశారు. సోమవారం కాచిగూడ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఈ లక్కీ డ్రాలో ఆర్ఎం వరప్రసాద్, డీవీఎంలు విజయ్‌భాను, సుచరిత, జగన్, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ బాలాజీ, కాచిగూడ డిపో మేనేజర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

పురుషుల విభాగంలో బి.జంగయ్య (ఇబ్రహీంపట్నం డిపో పరిధి), ఎస్.నిరంజన్ (బడంగ్‌పేట డిపో), ఎ.రామచంద్రరెడ్డి (దిల్‌సుఖ్‌నగర్ డిపో), భరత్ (మిథాని డిపో), అఖిల్ (ముషీరాబాద్ డిపో), మహిళా విభాగంలో యామిని (ఇబ్రహీంపట్నం డిపో), బి.శిరీష (విధాని డిపో), సునీత (రాజేంద్రనగర్ డిపో), మానస (బర్కత్‌పుర డిపో), ఎం.ప్రవీణ (కాచిగూడ డిపో) లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచారని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఎడ్లవానికుంట అన్యాక్రాంతం కాకుండా చర్యలు

రాయదుర్గం, మార్చి4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని ఎడ్లవానికుంట అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 5,300 ఎకరాల ఎఫ్‌టీఎల్ విస్తీర్ణంలో ఉన్న నోటిపై చెరువును కొందరు అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నం చేశారని, ఈ నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించారని, కోర్టు ఆదేశాలను ఆసరాగా చేసుకుని మొత్తం చెరువును ఆక్రమించేందుకు యత్నించారని వివరించారు. అయితే, చెరువును అన్యాక్రాంతం కాకుండా లేక్స్ అధికారులు నిరోధించారని తెలిపారు. గోపన్‌పల్లి గ్రామంలో ఉన్న జీహెచ్ఎంసీ నోటిపై చేసిన వాటర్ బాడీ ఇటీవల లేక్స్ డిపార్టుమెంట్స్ చెరువు పునరుద్ధరణ, వివిధ అభివృద్ధి పనులైన ప్రధాన బాండ్ నిర్మాణం, ఇన్‌లెట్ పునరుద్ధరణ, ఫెన్సింగ్ మొదలైన పనులు చేపట్టినట్లు తెలిపారు. సర్వేనెంబర్ 71/1, 71/2 సంబంధించిన పట్టాదారులు ట్యాంక్ బెడ్‌లోని భూ ఆస్తిని దెబ్బతీసినందుకు జిల్లా కలెక్టర్ వారికి నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న సరస్సుల పునరుజ్జీవనం, అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ప్రోగ్రాం కింద వివిధ కార్పొరేట్ కంపెనీలు దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చాయని జీహెచ్ఎంసీ తెలిపింది. ఆమోదించబడిన ప్రణాళికలు, డిజైన్ల ప్రకారం నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో సీఎస్ఆర్ ఏజెన్సీలు సరస్సు పునరుద్ధరణ పనులు చేపట్టనున్నాయి. పెద్దచెరువు నల్లగండ్ల ఎఫ్‌టీఎల్ భూముల్లో సరస్సుల అభివృద్ధి జరగలేదని, ఇంకా పెద్దచెరువు గంగారం, పటేల్‌చెరువు గోపిచెరువు, గోపన్‌పల్లి ట్యాంకుల అభివృద్ధి కార్యకలాపాలు కూడా నిబంధనల ప్రకారం చెరువు బఫర్ జోన్‌లో ఉన్నాయన్నారు. జంగంకుంట రెవెన్యూ అధికారులతో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

60లో ఉన్నాం.. బదిలీ నుంచి మినహాయించరూ..!

రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న ఎస్సైల ఆవేదన..

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'అనారోగ్యంతో ఉన్నాం. ఎన్నో రోగాలతో సతమతమవుతున్నాం. ఉద్యోగ విరమణకు దగ్గర పడుతున్నాం. ఈ వయసులో స్థిర నివాసం నుంచి మళ్లీ 15-20 కి.మీ. దూరంలో విధులకు వెళ్లి అక్కడే విధులు నిర్వహించి రావడం కష్టంగా మారనుంది. వయసు రీత్యా ఏడాదిలో రిటైర్ అయ్యే వారిని బదిలీ నుంచి మినహాయించాలి'. 60లో ఉన్న ఎస్సైల ఆవేదన ఇది. పోలీస్‌స్టేషన్లకు దగ్గరల్లో నివసిస్తూ రిటైర్మెంట్ కోసం వేచి చూస్తున్నామని, నెలల వ్యవధిలో కొందరు.. ఏడాది కాలం వ్యవధిలో మరి కొందరు రిటైర్ కాబోతున్నారని బదిలీ ఆదేశాలు అందుకున్న ఎస్సైలు తెలిపారు.

మమ్మల్ని ఉన్న చోటే ఉండనిస్తే ఆరోగ్య రీత్యా మేలుచేసిన వారవుతారని కోరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల 71మంది ఎస్సైలను బదిలీ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దానికి అనుగుణంగా నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఉన్న ఎస్సైలు కొత్తచోట చేరాల్సి ఉంది. 71మంది ఎస్సైలలో సుమారు సగం మంది 60లో పడిన వారే.. కొందరు 60కూడా దాటేసిన వారు ఉండడం గమనార్హం.

40ఏళ్ల సర్వీస్

60 ఏళ్ల వయస్సులోనూ ఎస్సై స్థాయిలో ఉన్న వారంతా కానిస్టేబుల్ స్థాయి నుంచి క్రమంగా హెడ్ కానిస్టేబుల్, ఆ తర్వాత ఏఎస్సై, ఎస్సైగా పదోన్నతి పొందిన వారే. 40ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించి చివరి దశకు చేరుకున్నారు. అలాంటి అధికారులకు స్థాన చలనం భారంగా మారింది. నేరుగా ఎస్సై స్థాయిలో ఎంపికై వచ్చిన వారు బదిలీపై వెళ్లడం సాధారణమేనని, వారంతా 30నుంచి 40ఏళ్ల వయసులోపు ఉంటారని వయస్సు పైబడిన ఎస్సైలు చెబుతున్నారు. కానీ వృద్ధాప్య దశలో ఉన్న తాము బదిలీపై కొత్త పీఎస్‌కు వెళ్లాలంటే భారమవుతోందని ఆవేదన చెందుతున్నారు.

ట్రై కమిషనరేట్‌కు కొత్త డీఎస్పీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ట్రై కమిషనరేట్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. తాజా బదిలీల్లో రాజేంద్రనగర్ ఏసీపీగా శ్రీనివాస్ తుల, శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీగా పి.నాగభూషణం, మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీగా ఎం.శ్రీనివాసరావు, సైబరాబాద్ సిటీ డబ్ల్యు సీఎ్ ఎడబ్ల్యు ఏసీపీగా వి.ప్రసన్నకుమార్, సైబరాబాద్ ఎకనామిక్స్ అఫెన్సెస్ వింగ్ ఏసీపీలుగా నారాయణసింగ్, మురళీకృష్ణ, అంబర్‌పేట్ పీటీసీ డీఎస్పీగా సీహెచ్ ఉమామహేశ్వరరావు, సీసీఎస్ డీడీ ఏసీపీగా కిరణ్‌కుమార్ ఎం, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీగా సత్యనారాయణ, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీగా బాలాజీ అంబోత్, సౌత్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీగా కె.లక్ష్మణ్, హైదరాబాద్ సిట్ ఏసీపీగా విజయసారథి.

నటుల క్రికెట్‌లీగ్‌ను ప్రోత్సహించాలని 'మా'కు వినతి

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ, టీవీ నటుల క్రికెట్ లీగ్ పోటీలను ప్రోత్సహించాలని మా(మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణును ఎక్స్(ట్విటర్)లో సినిమా అభిమానుల ఐక్యవేదిక అధ్యక్షులు పూర్ణచందర్ రావు కోరారు. ఉప్పల్ స్టేడియంలో ఈనెల 15 నుంచి జరిగే క్రికెట్ సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలకు తెలుగు సినీహీరోలు, ప్రముఖ నటీనటులు హాజరై ఆటగాళ్లను ప్రోత్సహించాలని కోరారు. సినిమా అభిమానులకు ఆహ్లాదపర్చడంతోపాటు తెలుగు సినిమా పరిశ్రమ ఐక్యతను చాటాలని కోరినట్లు ఆయన తెలిపారు.


ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డ బంగారం

ఫిబ్రవరిలో 13.61 కిలోల బంగారం పట్టివేత

● రూ.6.03కోట్ల విలువైన పుత్తడి స్వాధీనం

శంషాబాద్ రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా విదేశాల నుంచి తీసుకొచ్చిన 13.61కిలోల బంగారం ఫిబ్రవరి నెలలో పట్టుబడిందని శంషాబాద్ ఎయిర్‌పోర్టు కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. గత ఫిబ్రవరి నెలలో వేర్వేరు తేదీల్లో దుబాయ్ నుంచి ముగ్గురు మహిళా ప్రయాణికులు అక్రమంగా బంగారాన్ని తరలించారని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వారిని తనిఖీ చేయగా 13.61కిలోల బంగారం పట్టుబడిందన్నారు. దీని విలువ రూ.6.03కోట్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. నిందితులు పొట్టలో, లోదుస్తుల్లో, మెర్క్యురీ కోటింగ్, చైన్స్ రూపంలో బంగారాన్ని తరలించేందుకు యత్నించారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

గీత దాటొద్దు..

(5వ పేజీ తరువాయి)

ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్‌ను గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రంగంలోకి సిటీ సీపీ

నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి, కష్టాల నుంచి వాహనదారుల నుంచి గట్టెక్కించడానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రహదారి భద్రతా మాసోత్సవాల్లో ట్రాఫిక్ విషయంలో పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కంటే ముందు ఎన్‌క్రోచ్‌మెంట్స్‌పై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు.

ఆక్రమణలపై కొరడా

రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాలతో రోడ్లన్నీ నిండిపోతున్నాయి. కొన్నిప్రాంతాల్లో చిరు, ఫుట్‌పాత్ వ్యాపారులు వ్యాపారాలను రోడ్డుపై నిర్వహిస్తున్నారు. దాంతో రోడ్లు కుంచించుకుపోయి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ట్రాఫిక్ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈనేపథ్యంలో పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రోడ్డుపై ఆక్రమణలను తొలగిస్తున్నారు. గీత దాటితే వేటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

కమలంలో టికెట్ల లొల్లి

(5వ పేజీ తరువాయి)



అనుచరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నాయకులు ఎన్నికల్లో అభ్యర్థికి సహకరించకూడదని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు వారు ఇటీవల ఓ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని విరించి ఆస్పత్రి చైర్మన్, లతా మా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలతకు కేటాయించడంతో కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకులను కాదని, ఇతరులకు టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థానం నుంచి గతంలో రెండు సార్లు పోటీ చేసిన భగవంత్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, పొన్న వెంకటరమణ, రూప్‌రాజ్ టికెట్ ఆశించారు. ఈసారి టికెట్ భగవంత్‌రావు, సుభాష్‌చందర్‌జీలో ఎవరికో ఒకరికి ఇస్తారని ఊహించారు. చివరకు మాధవీలతకు కేటాయించారు. మాధవీలత ఎంపికపై ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. రాజాసింగ్ హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

భవనం పైనుంచి దూకి బలవన్మరణం

(5వ పేజీ తరువాయి)

ఉంటున్న భవనం ఐదో అంతస్తుపై నుంచి కిందికి దూకింది. ఒక్కసారిగా పెద్దశబ్దం రావడం తో కుటుంబసభ్యులు, స్థానికులు చూడగా తీవ్రగాయాలతో పూజ రక్తపుమడుగులో పడి ఉంది. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రామోజీఫిల్మ్ సిటీలో ఉద్యోగి..


సాయికుమారి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్ : రామోజీఫిల్మ్ సిటీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంది. పనిఒత్తిడితోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదులో చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్, సాయికుమారి దంపతులు నగరానికి వలసొచ్చి కుంట్లూర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి బాబు, పాప ఉన్నారు. దంపతులు రామోజీఫిల్మ్‌సిటీలో పని చేస్తున్నారు. సాయికుమారి (34) కాల్ సెంటర్‌లో పని చేస్తోంది. సోమవారం ఉదయం షిఫ్ట్‌లో కార్యాలయానికి వెళ్లింది. 9 గంటల సమయంలో కార్యాలయంలోని నాలుగో అంతస్తులోకి వెళ్లి కిటికీలను తెరిచి అందులో నుంచి కిందకు దూకింది. తలపగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పనిఒత్తిడితో రెండు రోజులుగా ఆమె మానసికంగా ఇబ్బందులకు గురౌతున్నట్లు తెలిసింది. భర్త శ్రీనివాస్‌కు కూడా ఆమె ఆదే విషయం తెలిపింది. ఆమెకు ధైర్యం చెప్పిన భర్త ఆత్మస్థైర్యం నింపేందుకు ఆదివారం బయటకు తీసుకెళ్లాడు. సోమవారం ఉదయం విధులకు వెళ్లిన ఆమె తోటి ఉద్యోగులతో బాగానే ఉన్నది. ఉదయం 8.30 సమయంలో సిబ్బంది టిఫిన్ చేసేందుకు వెళ్తూ సాయికుమారిని కూడా పిలిచారు. ఆమె వెళ్లలేదు. అందరూ టిఫిన్ చేసేందుకు వెళ్లగానే కార్యాలయంలోని కిటికీ నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది.



గొంతులోకి ఆహారం తన్నుకురావడం, ఛాతీలో మంట, పుల్లటి త్రేన్పులు లాంటి అసిడిటీ లక్షణాలు కనిపిస్తే, చేతికందిన యాంటాసిడ్ మింగేస్తూ ఉంటాం. కానీ సమస్యను తాత్కాలికంగా దూరం చేసే ఈ మందుల మీదే ఆధారపడుతూ ఉంటే, సమస్య మరింత ముదిరి కడుపులో అల్సర్లు తయారవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అల్సర్... ఆమడదూరం

తిన్న ఆహారం జీర్ణం కావడానికి కడుపులో ఒక ఏర్పాటు ఉంటుంది. అదే హైడ్రోక్లోరిక్ యాసిడ్. ఈ ఆమ్లం నుంచి రక్షణ కోసం జీర్ణాశయం లోపల పల్చని పొర ఉంటుంది. అయితే ఈ యాసిడ్ అవసరానికి మించి ఉత్పత్తి అయినా, జీర్ణాశయం లోపలి రక్షణ పొర బలహీనపడినా సమస్యలు మొదలవుతాయి. అరుదుగా కొందరిలో అసలు లక్షణాలే కనిపించవు. అయితే అసిడిటీ నుంచి తప్పించుకోవడం కోసం యాంటాసిడ్స్ మీద ఆధారపడుతూ ఉంటాం. కానీ నిజానికి ఈ మందులన్నీ ఆ ఆమ్లాన్ని పలుచన చేసేవే తప్ప దాని స్రావాన్ని నియంత్రించలేవు. అలాగే జీర్ణాశయం లోపలి రక్షణ పొర బలహీన పడటానికి కారణాల్ని తెలుసుకుని వాటిని సరిద్దిదనంతకాలం ఈ సమస్య పదే పదే తలెత్తుతూనే ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే మూల కారణాన్ని కనిపెట్టి తగిన చికిత్సనందించాలి. ఒకవేళ పూర్తిగా యాంటాసిడ్‌ల మీదే ఆధారపడుతూ కాలం గడిపేస్తూ ఉంటే కొంతకాలానికి సమస్య మరింత ముదిరి జీర్ణాశయం లోపలి గోడలు దెబ్బతిని పరిస్థితి సర్జరీకి దారితీయవచ్చు.

అల్సర్లలో రకాలు

సాధారణంగా అల్సర్లు జీర్ణాశయం, చిన్న పేగు మొదటి భాగమైన డియోడినమ్‌లో తలెత్తుతాయి. అల్సర్లు తలెత్తటానికి ఎన్నో కారణాలుంటాయి. శరీరంలో రక్షణ వ్యవస్థ మందగించటం వల్ల జీర్ణాశయం లోపలి పొర బలహీనమయితే అందుకు కారణాలను కనిపెట్టి వాటిని చక్కదిద్దాలి. ఒకవేళ ఆమ్లం అవసరానికి మించి ఉత్పత్తి అవుతుంటే దానికి మూల కారణాన్ని వెతికి దాన్ని సరిచేయటంతోపాటు స్రావం ఉత్పత్తిని నియంత్రించాలి. అలాగే అల్సరు రకం, తీవ్రత, మందులకు స్పందించే విధానం ఆధారంగా చికిత్సనందించాలి. అల్సర్లలో కూడా రకాలుంటాయి. అవేంటంటే...

- **ఆమ్లం కారణంగా:** అవసరానికి మించిన ఆమ్ల స్రావం వల్ల అల్సర్లు తలెత్తుతాయి.
- **బ్యాక్టీరియా వల్ల:** కలుషిత నీటి ద్వారా హెలికోబాక్టర్ పైలోరి అనే బ్యాక్టీరియా పొట్టలోకి చేరి అల్సర్లు తయారవుతాయి. ఈ అల్సర్లని నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్‌గా కూడా మారతాయి.
- **క్యాన్సర్:** క్యాన్సర్‌తో కూడిన అల్సర్లు కూడా తయారవుతాయి.

అల్సర్లకు ప్రధాన కారణాలు

అస్తవ్యస్థ జీవన విధానం, ఆహార నియమాలు పాటించకపోవటం, ఎక్కువ మసాలాలు, కారం ఉన్న ఆహారం ఎక్కువగా తీసుకోవటం, ఒత్తిడి, ఆందోళన, నొప్పి తగ్గించే మందులు, యాంటిబయాటిక్ మందుల్ని విచక్షణారహితంగా వాడటం, మద్యపానం, ధూమపానం, పొగాకు నమలటం, కాఫీలు ఎక్కువగా తాగటం, హెచ్.పైలోరీ బ్యాక్టీరియా జీర్ణాశయంలోకి చేరటం, క్యాన్సర్ మొదలైన కారణాల వల్ల అల్సర్లు తయారవుతాయి.

లక్షణాలు ఇలా...

ఛాతీ ఎముక, నాభికి మధ్య, పక్కటెముకల కింద, వీపులో నొప్పి అల్సర్ ప్రధాన లక్షణాలు. సాధారణంగా ఈ లక్షణాలు ఆహారం తీసుకున్న కొన్ని గంటల తర్వాత మొదలవుతూ ఉంటాయి. అంటే భోజనానికి భోజనానికి మధ్య ఖాళీ సమయంలో, రాత్రి వేళ విడవకుండా నొప్పి ఉంటుంది. అలాగే ఏదైనా ఆహారం తీసుకున్న వెంటనే నొప్పి తగ్గిపోతూ ఉంటుంది. కొందరిలో వాంతి, ఉబ్బరం లక్షణాలు కూడా ఉంటాయి. ఇవన్నీ అల్సర్ ప్రారంభ లక్షణాలు. అల్సర్ మరింత ముదిరినప్పుడు జీర్ణాశయం రక్తనాళాలు చిట్లి రక్తస్రావం అవుతుంది. రక్తస్రావం ఎక్కువగా ఉంటే రక్తం, యాసిడ్ కలిసి కాఫీ రంగులో వాంతులవుతాయి. మలం కూడా నలుపు రంగులో ఉంటుంది.

ఈ సమస్య మరింత ముదిరితే జీర్ణాశయంలో రంధ్రం పడి తిన్న ఆహారం పేగులు, పొట్ట మధ్య ఉండే ఖాళీ ప్రదేశంలోకి వెళ్లిపోతుంది. అప్పుడు ఎంతో ప్రమాదకరమైన పరిస్థితి వస్తుంది. ఈ స్థితికి చేరుకున్న రోగి ప్రాణాలను కాపాడటం కష్టం. కొందరిలో డియోడినమ్‌లో పదే పదే అల్సర్లు తయారవుతూ వాటంతటవే మానుతూ ఆ ప్రదేశంలో మచ్చలా తయారవుతుంది. ఈ మచ్చ వల్ల చిన్నపేగు మార్గం మూసుకుపోయి సమస్య తలెత్తుతుంది. దాంతో తిన్న ఆహారం వెంటనే వాంతి అయిపోతూ ఉంటుంది.

యాంటాసిడ్స్ వాడొచ్చా?

యాంటాసిడ్‌లు ప్రభావవంతమైనవి కావు. అవి కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందించగలుగుతాయి. ఎందుకంటే ఏ రకమైన యాంటాసిడ్ అయినా పొట్టలోని ఆమ్లాన్ని స్థిరం చేయగలుగుతుందే తప్ప దాని ఉత్పత్తిని తగ్గించలేదు. ఆమ్లం ఉత్పత్తి కారణంగా తలెత్తే అల్సర్‌కైతే యాంటాసిడ్లను వాడినా ఫర్వాలేదు. అల్సర్‌కు కారణం బ్యాక్టీరియా, క్యాన్సర్‌లు అయిన పక్షంలో యాంటాసిడ్‌లు వాడుతూపోతే సమస్య మరింత ముదిరి ప్రాణాలకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉంటుంది. కాబట్టి ఏ రకమైన అల్సరో తెలుసుకోకుండా తక్షణ ఉపశమనం కోసం యాంటాసిడ్లను వాడుతూ కూర్చోకూడదు. అల్సర్ లక్షణాలు అడపాదడపా అందరిలో ఏదో ఓ సందర్భంలో కనిపిస్తాయి. అయితే ఎప్పుడైనా భారీ భోజనం తిని అల్సర్ లక్షణాలు కనిపించినప్పుడు యాంటాసిడ్ వాడి ఉపశమనం పొందటం మంచిదే! అయితే ఆ అవసరం ఎంత తరచుగా వస్తుందో గమనించాలి. ఒకవేళ వారంలో నాలుగైదు రోజులు అల్సర్ లక్షణాలు కనిపించినా, పదే పదే యాంటాసిడ్ వాడాల్సిన అవసరం పడుతున్నా ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. యాంటాసిడ్‌లకు దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. మెగ్నీసియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ అనే రెండు రకాల యాంటాసిడ్‌లలో వేర్వేరు సైడ్ ఎఫెక్ట్స్ కనిపిస్తాయి. అల్యూమినియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల మలబద్ధకం, మెగ్నీసియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల డయేరియా వస్తుంది. మనంతట మనం యాంటాసిడ్‌లను ఎంపిక చేసుకుంటే ఈ దుష్ప్రభావాలను బలవంతంగా భరించాల్సి ఉంటుంది. అలాకాకుండా వైద్యుల పర్యవేక్షణలో వాడితే ఆ సైడ్ ఎఫెక్ట్స్‌ను వైద్యుల దృష్టికి తీసుకెళ్తాం కాబట్టి వైద్యులు వేరే మందులను లేదా కాంబినేషన్ డ్రగ్స్‌ను సూచిస్తారు.

అల్సర్లు రాకుండా...



- సమయానికి ఆహారం తీసుకోవాలి.
- మసాలాలు, కారం, కొవ్వులు, పుల్లటి పదార్థాలు వీటిలో వేటి వల్ల మంట తలెత్తుతుందో కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి.
- కలుషిత నీరు తాగకూడదు. పరిశుభ్రత పాటించాలి.
- నొప్పి తగ్గించే మందులు పరిమితంగా వాడాలి.
- ఒత్తిడి తగ్గించుకోవాలి.
- ధూమపానం, మద్యం మానేయాలి.

మూలికా వైద్యం

యూరియా పెరిగితే?

ప్రతి ఒక్కరి రక్తంలో యూరియా ఉంటుంది. అయితే శరీరంలోని నిర్దిష్ట ప్రదేశంలో పనితీరు క్రమం తప్పడం మూలంగా రక్తంలోని అధిక యూరియాను శరీరం తొలగించలేకపోతూ ఉంటుంది. దాంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ ఇబ్బందులను తొలగించాలంటే యూరియా ప్రభావాల పట్ల అవగాహన కలిగి ఉండాలి.

రక్తంలో యూరియా స్థాయి పెరిగితే మూత్రపిండాలు, ఇతర అంతర్గత అవయవాల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. ఫలితంగా హార్ట్ ఫెయిల్యూర్, మూత్రసంబంధ సమస్యలు, వాంతులు, పల్చని విరేచనాలు, మధుమేహం వేధిస్తాయి. ఇదే పరిస్థితి దీర్ఘకాలం పాటు కొనసాగితే తీరని దాహం, ఒంట్లో నీరు నిల్వ ఉండిపోవడం, తలనొప్పి, నీరసం, తలతిరుగుడు, పొట్టలో నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ ఇబ్బందులను తొలగించాలంటే రక్తంలో యూరియా స్థాయిని నియంత్రించాలి.



మూలిక ఔషధాలు

మూత్రక్రిచంతక చూర్ణం, పునర్నవ మండూర్, వరుణాధి వటి లాంటివి యూరియా వల్ల పెరిగిన మూత్రపిండాల మీది ఒత్తిడిని తగ్గిస్తాయి. రక్తంలోని యూరియాను తగ్గించి, మూత్ర వ్యవస్థ పనితీరును సరి చేస్తాయి.

- **పునర్నవ:** పున, నవ అనే రెండు పదాల నుంచి పునర్నవ జనించింది. పున అంటే మళ్లీ అనీ, నవ అంటే కలిసి అనీ అర్థం. రెండు ఔషధాలు కలిసి మూత్ర వ్యవస్థ పనితీరును మెరుగు చేస్తాయని చెప్పడమే ఈ మందు పేరు వెనక ఉన్న ఉద్దేశం. ఈ ఔషధం మూత్రపిండాల్లో నిల్వ ఉండిపోయిన అత్యధిక ద్రవాలను బయటకు వెళ్లగొట్టి, మూత్ర పిండాల వాపును తగ్గిస్తుంది. ఈ ఔషధానికి ఎటువంటి దుష్ప్రభావాలూ ఉండవు.
- **వరుణ:** మూత్ర పిండాల్లోని సూక్ష్మ రాళ్లను విరగ్గొట్టి మూత్రం ద్వారా బయటకు వెళ్లగొట్టే శక్తి ఈ ఔషధానికి ఉంది. మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను కూడా ఈ మందు నయం చేయగలదు. మూత్రనాళంలో పేరుకుపోయి మూత్రవిసర్జనకు ఆటంకంగా మారిన అంశాలను బయటకు వెళ్లగొట్టగలదు. మూత్రపిండాల వాపు, నొప్పులను కూడా నయం చేయగలదు.
- **గోఖుర:** మూత్రపిండాల్లో బలహీనపడిన కణాలకు కొత్త జీవం అందిస్తుంది. కొత్త కణాల పుట్టుకకు తోడ్పడుతుంది.
- **హైగ్రోఫీలియా ఆరిక్యులేటా:** రక్తంలో పెరిగిన యూరిక్ ఆమ్లాన్ని తగ్గించే ఔషధమిది.

ఈ ఔషధాలతో పాటు ఆహారంలో మాంసకృత్తుల స్థాయిని తగ్గించి, ఎక్కువగా ద్రవాహారం తీసుకుంటూ మర్దన, యోగాసనాలను అనుసరించాలి.

డ్రగ్స్... ఈ మధ్య కాలంలో తరచూ వార్తల్లో వినిపిస్తున్న పదం. యువతను నిర్వీర్యం చేసే ఈ డ్రగ్స్‌లో అనేక రకాలు ఉన్నాయంటారు అమెరికా గ్రీన్‌వ్యాలీలోని 'బ్రాడీ స్కూల్ ఆఫ్ మెడిసిన్'లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఉత్పల స్రవంతి. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి చికిత్స చేయటంలో విశేషమైన అనుభవం ఉన్న స్రవంతి... మత్తు పదార్థాల్లో ఉన్న తేడాల గురించి... వాటికి అందుబాటులో ఉన్న చికిత్సల గురించి 'నవ్య డాక్టర్'కు ప్రత్యేకంగా వివరించారు.



డ్రగ్స్ వాడకం.. ఒక రోగమే!

"డ్రగ్స్ అనే పదాన్ని అందరూ విరివిగా వాడేస్తూ ఉంటారు. కానీ అన్ని డ్రగ్స్ మాదకద్రవ్యాలు కావు. వాస్తవానికి కొన్ని రకాల మత్తు పదార్థాలను పరిమితమైన డోస్‌లో శరీరానికి ఎక్కువ నొప్పి తెలియకుండా ఉండటానికి ఇస్తూ ఉంటారు. ఇవి తాత్కాలికమైనవి. మెదడుపై పని చేయనవి. ఉదాహరణకు మన దేశంలో కొన్ని వందల సంవత్సరాలుగా నల్లమందును కొన్ని రకాల మానసిక వ్యాధుల నివారణకు వాడుతున్నారు. అయితే ఈ మధ్యకాలంలో అమెరికాలో జరిపిన తాజా అధ్యయనాలలో నల్లమందు లాంటి వాటివల్ల తాత్కాలిక ఉపశమనమే తప్ప వేరే ఇతర దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉండవని తేలింది. ఇక కొందరు మాదకద్రవ్యాలకు ఎందుకు అలవాటుపడతారనేది చాలా ముఖ్యమైన ప్రశ్న. కొందరు ఏంగ్జైటీని తగ్గించుకోవటానికి వీటిని వాడటం మొదలుపెడితే... మరికొందరు తమలో ఉన్న భయాలను తొలగించుకోవటానికి వాడతారు. దీనివల్ల తమకు స్వేచ్ఛ లభించినట్లు భావిస్తారు. క్రమేపీ దానిని అలవాటుగా మార్చుకుంటారు.

ఎన్ని రకాల డ్రగ్స్ ఉన్నాయి?

మనం ప్రతి రోజూ రకరకాల మాదకద్రవ్యాల పేర్లు వింటూ ఉంటాం.



వీటిలో ముఖ్యమైనవి గంజాయి(కెనబీస్), కొకైన్, హెరాయిన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ, ఎల్ఎస్‌డీ. వీటిలో ఎక్కువ ప్రమాదకరమైనవి హెరాయిన్, కొకైన్. మన దేశంలో ఇప్పటిదాకా హెరాయిన్ అలవాటు వదిలించటానికి ట్రీట్‌మెంట్‌లు అందుబాటులోకి రాలేదు. మనం ఈ మాదకద్రవ్యాల గురించి తెలుసుకుందాం.

గంజాయి: ఒకప్పుడు దీనిని కేవలం నిద్రపట్టడానికి అవసరమైన సాధనంగా వాడేవారు. ఆ తర్వాత దీని వాడకం బాగా పెరిగింది. ఈ మధ్యకాలంలో మన తెలుగు రాష్ట్రాల్లో విరివిగా లభిస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. దీని ఖరీదు తక్కువ కాబట్టి.. స్కూళ్లలోను, కాలేజీలలోను చదివేవారు ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో ఇది ఆన్‌లైన్‌లో కూడా ప్రవేశించింది. ఆన్‌లైన్‌లో 'సీబీడీ' పేరిట గంజాయి వేర్వేరు రూపాల్లో దొరుకుతూ ఉంటుంది. సాధారణంగా గంజాయి... మన మెదడులో ఎనండోమైడ్ అనే ఒక కెమికల్‌పై ప్రభావం చూపిస్తుంది. దీనివల్ల భయం, సంకోచం, బెరుకుతనం... తొలగిపోతాయి. స్వేచ్ఛగా తమకు నచ్చిన విషయాలను చెప్పగలుగుతారు. నిర్ణయాలు తీసుకోవటానికి అవసరమైన రియాక్షన్ సమయం తగ్గిపోతుంది. అందువల్ల యుక్తవయస్సులో ఉన్నవారు దీనిని ఎక్కువగా వాడుతూ ఉంటారు. దీని వల్ల తాత్కాలికంగా అనేక లాభాలు ఉన్నట్లు కనిపిస్తాయి. కానీ దీని దీర్ఘకాల ప్రభావం చాలా చెడు చేస్తుంది. దీనిని ఎక్కువ కాలం ఉపయోగిస్తే- మెదడులోని ముందు భాగం ఫ్రంటల్ కార్టెక్స్‌పై ప్రభావం చూపుతుంది. దీనికి బానిస అయినవారి కోసం ప్రత్యేకమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

హెరాయిన్: అత్యంత ప్రమాదకరమైన మాదకద్రవ్యమిది. రకరకాల రంగుల్లో లభిస్తుంది. రంగుల ఆధారంగా దీని శక్తి మారుతూ ఉంటుంది. హెరాయిన్ మన మెదడులోని కణాలపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. దీని వల్ల అతివేగంగా దీనికి అలవాటు పడిపోతారు. ఇప్పటి దాకా మన దేశంలో ఈ అలవాటు ఉన్నవారికి చికిత్స చేసే సమర్థమైన పద్ధతులు అందుబాటులోకి రాలేదు. అమెరికాలో అయితే హెరాయిన్ డిఎడిక్షన్‌కు మంచి చికిత్సలు ఉన్నాయి.

- 'జీన్స్ లోడ్ ది గన్... బట్ ఎన్విరాన్‌మెంట్ పుల్స్ ది ట్రిగ్గర్' అంటారు. మాదకద్రవ్యాల వాడకం అలవాటు కావటానికి జన్యువులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. చుట్టుపక్కల ఉన్న వాతావరణం వీటికి తోడ్పడితే ఆ ప్రభావం మరింతగా ఉంటుంది.
- మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని క్రిమినల్స్‌లా చూడకూడదు. సానుభూతితో అర్థం చేసుకోవాలి. అప్పుడే వారు త్వరగా కోలుకుంటారు.
- తల్లితండ్రులు యుక్త వయస్సులో ఉన్న పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వారు ఏవైనా మానసిక సమస్యలతో బాధపడుతున్నారేమో గమనించాలి. మానసిక సమస్యలు ఉన్నవారు త్వరగా మాదకద్రవ్యాలకు అలవాటు పడే అవకాశముంది.

ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. హెరాయిన్ అలవాటు నుంచి తప్పించటానికి చవకగా లభించే ఒక మందును మన దేశానికి చెందిన రెడ్డి ల్యాబ్స్ తయారు చేసి సరఫరా చేస్తోంది. కానీ ఆ మందు మన దేశంలో లభించదు. దేశంలో హెరాయిన్ బారినపడే వారి సంఖ్య పెరుగుతోంది కాబట్టి- ఈ మందు మన దేశంలో కూడా లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటే మంచిది.

కొకైన్: ఇతరులతో మాట్లాడటానికి సంకోచించేవారు.. భయాలు ఎక్కువగా ఉన్నవారు తీసుకొనే మాదక ద్రవ్యమిది. ఉన్నత వర్గాల్లో దీనిని ఎక్కువగా తీసుకుంటారు. ముఖ్యంగా పార్టీలకు వెళ్లేవారిలో దీని వాడకం ఎక్కువ కనిపిస్తుంది. దీనిని వాడిన తర్వాత సంకోచాలన్నీ తొలగిపోతాయి. ఎటువంటి భయం లేకుండా ఇతరులతో మాట్లాడగలుగుతారు. డ్యాన్స్ చేయగలుగుతారు. అందువల్ల దీనిని ఎక్కువగా పార్టీ డ్రగ్‌గా పిలుస్తూ ఉంటారు.

క్లబ్ డ్రగ్స్: ఎండీఎంఏ, ఎక్స్‌టసీ, ఎల్ఎస్‌డీ మొదలైన వాటిని మనం క్లబ్ డ్రగ్స్‌గా పిలుస్తూ ఉంటారు. వీటి వల్ల ఎక్కువ సేపు ఉత్సాహంగా ఉండగలుగుతారు. ముఖ్యంగా యువతలో వీటి వాడకం చాలా ఎక్కువగా కనిపిస్తుంది. ఇవి ఒకసారి అలవాటు అయితే తరచూ వాటినే కోరుకుంటూ ఉంటారు.

చికిత్సలు: అమెరికాలో మాదకద్రవ్యాల వినియోగం ఆధారంగా చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. సొసైటీ ఆఫ్ ఎడిక్షన్ మెడిసిన్ వారి నిర్వచనం ప్రకారం... మాదకద్రవ్యాలకు అలవాటుపడటం కూడా ఒక దీర్ఘకాలిక రోగం లాంటిదే! దీర్ఘకాలిక రోగాలకు ఏ విధమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయో.. అదే విధంగా మాదక ద్రవ్యాల అలవాటు నుంచి తప్పించటానికి అలాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కొద్దిగా అలవాటు ఉన్నవారికి చికిత్సను అందిస్తే- 30 నుంచి 90 రోజుల్లో అలవాటు నుంచి బయట పడే అవకాశం ఉంటుంది. అయితే ఒకసారి చికిత్స పొందిన తర్వాత కూడా మళ్లీ ఆ మార్గంలో ప్రయాణించే అవకాశాలు ఉంటాయి. అలాంటి పరిస్థితులు రాకుండా చూడాల్సింది కుటుంబ సభ్యులు.. చుట్టూ ఉన్న సమాజమే!

డాక్టర్ ఉత్పల స్రవంతి, ఎండీ
అసిస్టెంట్ ప్రొఫెసర్ - అడిక్షన్ మెడిసిన్
బ్రాడీ స్కూల్ ఆఫ్ మెడిసిన్
గ్రీన్‌వెల్లి, నార్త్‌కెరిలినా, అమెరికా



వేసవిలో బరువు తగ్గడం తేలిక. కాబట్టి ఈ రుతువును శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగించుకోవడానికి ఉపయోగించుకోవాలి. ఇందుకోసం జిమ్‌కు వెళ్లలేని వారు ఇంట్లోనే కొవ్వు కరిగించే వ్యాయామాలు చేసుకోవచ్చు.

ఇంటిపట్టునే వ్యాయామం

ఎలాంటి వ్యాయామం మొదలుపెట్టాలన్నా మొదట శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేయాలి. ఇందుకోసం స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఆ తర్వాతే అసలైన వ్యాయామాలను మొదలుపెట్టాలి. ఇందుకోసం నేల మీద పడుకుని సీతాకోకచిలుక ఆకారంలో కాళ్లూ, చేతులూ కదిలించాలి. ఆ తర్వాత...

కాంబో వర్కవుట్!

- **హై నీస్:** కాళ్ల మధ్య అడుగు దూరం ఉండేలా నిలబడాలి. మోకాళ్లను మడిచి నడుము దగ్గరకు మార్చి, మార్చి లేపుతూ ఉండాలి. ఇలా కాళ్లను లేపినప్పుడు చేతులతో మోకాళ్లను తాకుతూ ఉండాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- **బర్పీ:** రెండు చేతులు గాల్లోకి లేపి ఎగరాలి. వెంటనే ముందుకు నేల మీద పడుకోవాలి. ఆలస్యం చేయకుండా లేచి నిలబడి మళ్లీ గాల్లోకి లేవాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- **మౌంటెయిన్ క్లైంబ్:** చేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం నేలను తాకకూడదు. ఈ భంగిమలో ఉండి, పర్వతం ఎక్కుతున్నట్టుగా కాళ్లను నడుము దగ్గరకు, కిందకూ మార్చి, మార్చి కదిలించాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- **ప్లాంక్:** మోచేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం నేలను తాకకూడదు. ఇలా 30 సెకండ్లు ఉండాలి.

ఈ వ్యాయామాలు 3 సెట్లు చేయాలి.

సూపర్‌మ్యాన్!

చేతులు, కాళ్లూ చాపి కొద్దిగా వంపు తిరిగిన విల్లులా శరీరాన్ని వంచి ఉంచే సూపర్‌మ్యాన్ వ్యాయామం ఇది. ఇందుకోసం...

- నేల మీద బోర్లా పడుకోవాలి.
- చేతులు ముందుకు చాపాలి.
- ఛాతీ, పొట్ట, నడుము నేల మీద ఆనించి ఉంచి, ముందుకు చాపిన చేతులను గాల్లోకి లేపాలి.
- చేతులు లేపిన విధంగానే కాళ్లూ వెనక్కి లేపాలి.

ఈ భంగిమలో 30 నిమిషాలు ఉంటూ, 5 సెట్లు చేయాలి.

పొత్తికడుపు వ్యాయామాలు!

- **క్రంచెస్:** నేల మీద వెల్లకిలా పడుకుని, రెండు చేతులు తల దగ్గర ఉంచి, నడుము పైభాగాన్ని వీలైనంతగా ముందుకు లేపే వ్యాయామం ఇది. ఇలా 25 క్రంచెస్ 3 సెట్లు చేయాలి.
- **లెగ్ రైజ్:** వెల్లకిలా పడుకుని, కాళ్లు రెండూ ఒకేసారి నిటారుగా పైకి లేపి, నడుముకు సమాంతరంగా తీసుకువచ్చి, మళ్లీ దింపేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.
- **సైడ్ అబ్లిక క్రంచెస్:** పక్కకు తిరిగి పడుకుని, కాళ్లు మడవాలి. చేతులను తల వెనకకు తీసుకు వచ్చి, మెడకు ఆసరాగా ఉంచాలి. ఈ భంగిమలో నడుము పైభాగాన్ని పక్కకు లేపే ప్రయత్నం చేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.

ఇలా మొత్తం వ్యాయామాలకు కనీసం 45 నిమిషాలు కేటాయించాలి. ఒక్కొక వ్యాయామానికి మధ్య 30 సెకండ్ల పాటు విరామం తీసుకోవచ్చు. ఈ వ్యాయామాలు చేస్తున్నప్పుడు ఫ్యాన్ లేదా ఏసి వేసుకోకూడదు.

స్ట్రెచింగ్!



ఏ ఓఆర్ఎస్ ఉత్తమం?

ఎండదెబ్బ తగలకుండా ఉండాలంటే ఒంట్లోని లవణాలు కోల్పోకుండా చూసుకోవాలి. చమటతో లవణాలను కోల్పోతే వాటిని వెంటనే భర్తీ చేయాలి. లేదంటే ఎండదెబ్బ బారిన పడతాం. ఈ విషయం మనందరికీ తెలిసిందే! కాబట్టే ఓఆర్ఎస్‌లను తాగుతూ ఉంటాం. అయితే మనకు తెలియని విషయం ఏంటంటే... మెడికల్ షాపుల్లో దొరికే టెట్రాప్యాక్‌లన్నీ అసలైన ఓఆర్ఎస్‌లు కావు. వాటిలో విలువైన ఖనిజ లవణాల కంటే చక్కెర ఎక్కువగా ఉంటుంది. మరి అలాంటప్పుడు అసలైన ఓఆర్ఎస్ ఏదో తెలుసుకోవడమెలా? అని కంగారు పడకండి. ఓఆర్ఎస్ కొనే ముందు ఈ విషయాలను తెలుసుకోండి.



ఎఫ్ఎస్ఎస్ఏఐ పర్మిషన్‌తో...

ఓఆర్ఎస్‌లను తయారు చేసే కొన్ని ఔషధ సంస్థలు 'ఫుడ్ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' ఆమోదంతో ఓఆర్ఎస్‌ను తలపించే పానీయాలను తయారుచేస్తున్నాయి. ప్యాకెట్ల మీద 'ఓఆర్ఎస్'ఎల్, విఐటి'ఓఆర్ఎస్' అనే లేబుళ్లు కనిపిస్తే, వాటి జోలికి వెళ్లకండి. ఈ వింత పేర్లన్నీ మనల్ని పక్కదారి పట్టించి, కొనుగోళ్లు పెంచుకోవడం కోసం ఔషధ సంస్థలు అనుసరించే చిట్కాలని గుర్తు పెట్టుకోండి. ఏది సరైన ఓఆర్ఎస్ పానీయమో, ఏది కాదో తేలికగా కనిపెట్టాలంటే ఇవిగో ఈ అంశాలను గమనించాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం పొందినవి

వీటి మీద డబ్ల్యుహెచ్ఒ ఫార్ములా అని స్పష్టంగా ముద్రించి ఉంటుంది. అలాగే ఈ పదాల కోసం గమనించాలి.

- ఎలెక్ట్రాల్
- వాలైట్
- రాన్‌బాక్సీ ఓఆర్ఎస్
- వాలైట్ ఓఆర్ఎస్
- సిప్లా తయారీ ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్)

ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

మంగళవారం • 5 మార్చి 2024

cinema@andhrajyothy.com

రాజమౌళి, మహేశ్ చిత్రం ఎప్పటినుంచి అంటే...!



దర్శక ధీరుడు రాజమౌళితో చేయబోయే యాక్షన్ అడ్వంచర్ చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు మహేశ్ బాబు. ఇందుకోసం తన లుక్‌ను కూడా సరికొత్తగా మార్చుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి ఆయన అప్‌డేట్ ఇచ్చారు. అందరిలానే తానూ రాజమౌళితో చేసే చిత్రం షూటింగ్ ప్రారంభం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. ప్రొఫెషన్‌ను, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం కత్తి మీద సాము లాంటిదని మహేశ్ అన్నారు. తన రీసెంట్ రిలీజ్ 'గుంటూరు కారం' చిత్రంపై ప్రేక్షకులు చూపిన ఆదరణ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తన జీవితాన్ని మార్చేసిన మూడు సినిమాల గురించి మహేశ్ ప్రస్తావించారు. 'మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు ప్రేక్షకుల ముందు తనను సరికొత్తగా ఆవిష్కరించాయని తెలిపారు. తాను నటించే చిత్రాలకు అంగీకారం తెలిపేముందు పాత్ర, నైతిక విలువలను దృష్టిలోకి తీసుకుంటానని అన్నారు. ఒకసారి చిత్రానికి సైన్ చేశాక దర్శకుడి విజన్ ప్రకారమే ముందుకెళ్తానని తెలిపారు.



అభి, మహీ మళ్లీ కలిశారు!

మన్మథుడు సినిమాలో కలసి నటించిన నాగార్జున, అన్షు అంబానీ మళ్లీ కలిశారు. ఆ చిత్రంలో తన అందంతో అభి మనసునే కాదు ప్రేక్షకులనూ ఆకట్టుకున్నారు అన్షు. 'మన్మథుడు' చిత్రం తర్వాత ప్రభాస్ సరసన 'రాఘవేంద్ర' సినిమాలో కూడా నటించి ఆ తర్వాత తెర మరుగయ్యారు. సచిన్ సాగర్ అనే బిజినెస్ మ్యాన్‌ను పెళ్లి చేసుకుని సినిమాలకు శాశ్వతంగా గుడ్ బై చెప్పేశారు. అప్పుడు అలా మాయమైన అన్షు మళ్లీ ఇప్పుడు హఠాత్తుగా హైదరాబాద్‌లో ప్రత్యక్షమైంది. స్నేహితులను కలుసుకోవడానికి వచ్చిన అన్షు అనుకోకుండా ఓ పార్టీలో నాగార్జునని కలసింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని అన్షు అంబానీ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. బ్లాక్ డ్రెస్‌లో ఉన్న ఇద్దరి ప్రస్తుత ఫొటోను, మన్మథుడు సినిమాలోని ఫొటోను అన్షు షేర్ చేసింది. "22 ఏళ్ల తర్వాత నా కో-స్టార్ నాగార్జునను కలుసుకోవడం ఎంతో సర్‌ప్రైజింగ్‌గా ఉంది. మన్మథుడు సినిమా సెట్‌లో ఎంత హుషారుగా ఉన్నారో ఇప్పటికీ అంతే హుషారుగా ఆయన ఉన్నారు. ఈ మూమెంట్ ఎంతో ప్రత్యేకమైనది" అని పోస్ట్‌లో పేర్కొంది.

తలైవా సెట్స్‌లోకి భల్లాలదేవ



రజనీకాంత్ మూవీ సెట్స్‌లోకి రానా దగ్గుబాటి అడుగుపెట్టారు. 'జైలర్' చిత్రం హిట్ అయినా, ఆ తర్వాత వచ్చిన 'లాల్ సలామ్' సినిమా దెబ్బ తినడంతో రజనీకాంత్ అభిమానులు కొంత నిరాశ చెందారు. అందుకే వాళ్లలో ఉత్సాహం పెంచడానికి మాస్ అంశాలతో ఓ కొత్త సినిమా చేస్తున్నారు తలైవా. 'జై భీమ్' ఫేం టీజీ జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమా పేరు 'వేట్టయాన్'. రజనీకాంత్ 170వ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. ఇందులో రానా దగ్గుబాటి ఓ ముఖ్య పాత్రలో నటిస్తున్నారంటూ ఆ మధ్య లైకా ప్రొడక్షన్స్ సంస్థ ప్రకటించింది. సోమవారం ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయినట్లు రానా ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రంలో ఆయన ఏ పాత్ర పోషిస్తున్నారనేది తెలియాల్సి ఉంది. ఇంకా ఈ చిత్రంలో బిగ్ బీ అమితాబ్ బచ్చన్ నటిస్తుండటం విశేషం. దాదాపు 43 ఏళ్ల తరువాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి ఈ ప్రాజెక్ట్‌కు వర్క్ చేయడంతో ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. వెర్సటైల్ నటుడిగా పేరొందిన ఫహాద్ ఫాసిల్, ప్రముఖ నటి మంజూ వారియర్ కూడా ఇందులో నటిస్తున్నారు.



మిడిల్ క్లాస్ రాముడు

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం టీజర్ విడుదలైంది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకుడు. వాసు వర్మ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది.

గోపీసుందర్ కంపోజ్ చేసిన 'దేఖోరే దేఖో' పాటతో హీరో క్యారెక్టరైజేషన్‌ను వర్ణిస్తూ సాగిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. సర్‌నేమ్‌కు సరెండర్ అయి, ఫ్యామిలీ అంటే వీక్‌నెస్ ఉన్న మిడిల్ క్లాస్ రాముడిగా హీరో విజయ్‌ను టీజర్ లో చూపించారు. ఈ టీజర్ చివరిలో హీరోయిన్ మృణాల్ 'నేను కాలేజికి వెళ్లాలి.. కొంచెం దించేస్తారా' అని అడిగితే, 'లీటర్ పెట్రోలు కొట్టిస్తే దించేస్తా' అంటాడు హీరో. ఇలా ఫ్యామిలీ, క్లాస్, మాస్, లవ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో కట్ చేసిన టీజర్ కంప్లీట్ మూవీని షార్ట్‌గా చూసిన అనుభూతి కలిగించింది. ఈ సమ్మర్‌కు కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా 'ఫ్యామిలీ స్టార్' ఉండబోతోందనే క్లారిటీని ఈ టీజర్ ఇచ్చింది.

'భీమ'లో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్



నిర్మాత కె.కె. రాధామోహన్

'గోపీచంద్ ఇంతకుముందు చాలా పోలీస్ పాత్రలు చేశారు. కానీ 'భీమ'లో పాత్ర విభిన్నంగా ఉంటుంది. కొత్త జానర్‌లో ఉండే కథ ఇది. ఇలాంటిది గోపీచంద్ కూడా చేయలేదు. ఇందులో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ చాలా ఉన్నాయి. సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. పోలీస్ గెటప్ కాకుండా ఇందులో గోపీచంద్ మరో గెటప్ కూడా ఉంది. అదేమిటనేది మార్చి 8న తెలుస్తుంది' అని చెప్పారు నిర్మాత కె.కె. రాధామోహన్. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఆయన నిర్మించిన 'భీమ' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో ముచ్చటిస్తూ 'బాలకృష్ణ గారి 'అఖండ' చిత్రానికి మా సినిమాకీ ఏ మాత్రం పోలిక లేదు. బెంగళూరు, బాదమి పరిసర ప్రాంతాల్లో ఉండే పరశురామ క్షేత్రంలో జరిగే కథ ఇది. శివాలయం, అఘోరాలను యాంబియన్స్ కోసం చూపించాం. అఘోరాలకు ఈ కథతో సంబంధం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. దర్శకుడు హర్షను తెలుగు తెరకు పరిచయం చేయడం గురించి వివరిస్తూ 'ముందు మనం కథని నమ్మాలి. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కథ ఉందా లేదా అని చూడాలి. దానికి తగ్గ నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎన్నుకోవాలి. హర్ష చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. తను కొరియోగ్రాఫర్ కూడా. మా 'బెంగాల్ టైగర్' చిత్రానికి వర్క్ చేశారు. 'భీమ'ని అద్భుతంగా తీశారు. రెండు పాటలకు కొరియోగ్రఫీ కూడా చేశారు' అన్నారు.

సినిమా బడ్జెట్ పెరగడానికి కారణం చెబుతూ 'మంగులూరు, బదామిచ ఉడిపి, మారేడుమిల్లి, వైజాగ్.. ఇలా చాలా ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. అన్నపూర్ణ స్టూడియోలో టెంపుల్ సెట్ వేశాం. కథకు తగ్గట్లుగా ఎక్కడా రాజీ పడకుండా తీశాం. దీని వల్ల బడ్జెట్ పెరిగింది. అయినా బిజినెస్ పరంగా హ్యాపీగా ఉన్నాం. పెద్ద సంఖ్యలో విడుదల చేస్తున్నాం. గోపీచంద్ కెరీర్‌లో బిగ్గెస్ట్ రిలీజ్ ఇది' అని చెప్పారు రాధామోహన్. తన కొత్త సినిమాల గురించి చెబుతూ 'ఆయుష్ శర్మ హీరోగా ఓ హిందీ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఏప్రిల్ 25న విడుదల చేస్తాం. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో ఓ సినిమా ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది' అన్నారు.

ప్రతి భారతీయుడు గర్వించే సినిమా


నిహిర్ కపూర్

సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు రూపొందించిన పాన్ ఇండియా మూవీ 'రికార్డ్ బ్రేక్' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటి జయసుధ తనయుడు నిహిర్ కపూర్ ఇందులో ఒక హీరోగా నటించారు. విడుదల సందర్భంగా ఆయన సోమవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.



- ఇంతకుముందు నేను 'గ్యాంగ్‌స్టర్ గంగరాజు' చిత్రంలో నటించాను. ఆ సినిమా షూటింగ్‌లో శ్రీనివాసరావుగారు 'బాగా చేస్తున్నావు.. నా దగ్గర ఓ కథ ఉంది. నువ్వు యాప్ట్ అవుతావు' అని కథ చెప్పారు. చాలా ఎక్సయిటింగ్‌గా అనిపించి నేను ఈ సినిమా ఒప్పుకొన్నాను. ఇద్దరు అనాథలు అడవిలో పెరుగుతుంటారు. కవలలైన వాళ్లిద్దరూ పట్నం వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఈ చిత్రకథ. చాలా ఆసక్తికరంగా చూపించారు.
- 'దంగల్' చిత్రానికీ ఈ కథకు పోలిక లేదు. ఇందులో కుస్తీ పోటీల గురించి చెబుతూ ఇద్దరు అనాథల జర్నీని ఆకట్టుకొనే విధంగా చూపించారు. సెంటిమెంట్, ఎమోషనల్ అంశాలు కలిగిన కమర్షియల్ చిత్రమిది. సాంగ్స్ ఫైట్స్ బాగుంటాయి.
- రాజస్థాన్, హర్యానా వంటి ప్రాంతాల్లో కుస్తీ పోటీలు ఎక్కువగా జరుగుతాయి. డీటైలింగ్ మీద ఉత్తరాది వారు ఎక్కువ సినిమాలు తీస్తుంటారు. 'రికార్డ్ బ్రేక్' తెలుగు సినిమా అయినా ప్రతి భారతీయుడు గర్వించే విధంగా ఉంటుంది. ఇలాంటి చిత్రం తెలుగుతోనే ఆగిపోకూడదు. అందుకే ఎనిమిది భాషల్లో విడుదల చేస్తున్నాం.
- శ్రీనివాసరావుగారికి సినిమా అంటే ప్యాషన్. దేశభక్తి మిళితమైన మంచి కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా జనాలకు చెప్పాలనుకున్నారు. ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు.
- ఇక నుంచి నటనని కంటిన్యూ చేస్తా. అలాగే దర్శకత్వం కూడా చేయాలనుకుంటున్నాను. స్క్రిప్టులు తయారు చేస్తున్నా.

'రంగ్ రంగ్ రంగీలా'



హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రం పారిజాత పర్వం. సునీల్, చైతన్య రావు, శ్రద్ధా దాస్ , మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. మహిధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం నుంచి 'రంగ్ రంగ్ రంగీలా' అంటూ సాగే ఓ పాటను చిత్ర బృందం విడుదల చేసింది. సంగీత దర్శకుడు రీ క్యాబ్ క్లబ్ నెంబర్‌గా ఈ పాటను కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాటని నటి శ్రద్ధాదాస్ పాడటం విశేషం. ఆమె వాయిస్, గ్లామరస్ ప్రజన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చాయి. ఈ చిత్రానికి ఎడిటర్-శశాంక్ వుప్పుటూరి, డీవీపీ-బాల సరస్వతి, సంగీతం-రీ, ఆర్ట్ డైరెక్టర్-ఉపేందర్ రెడ్డి, సహ నిర్మాత- అనంత సాయి.

గామి నిర్మాణం.. సాహస ప్రయాణం

చాందినీ చౌదరి



విశ్వక్‌సేన్ నటించిన 'గామి' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ చిత్ర కథానాయిక చాందినీ చౌదరి సోమవారం విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

- 'వారణాసి, కుంభమేళ, కశ్మీర్, హిమాలయాలు.. ఇలా విభిన్న లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ టీమ్‌లో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. చాలా సవాల్‌తో కూడిన సరిస్థితుల్ని ఎదుర్కొన్నాం. ముఖ్యంగా వాష్ రూమ్ ఫెసిలిటీస్ లేకపోవడంతో నీళ్లు కూడా తాగేదాన్ని కాదు. దాదాపు నెల రోజుల పాటు అలా షూటింగ్ చేశాం. స్టంట్స్ నేనే రియల్‌గా చేశా. ఒక రకంగా చెప్పాలంటే గామి నిర్మాణం..సాహస ప్రయాణం.
- కథ వినగానే చిత్ర నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుందని అర్థమైంది. ఎందుకంటే చాలా పెద్ద కాన్వాస్ ఉన్న కథ ఇది. దర్శకుడు విద్యాధర్ రాజీ పడని వ్యక్తి . తను అనుకున్నది వచ్చే వరకూ వదిలిపెట్టరు. షూటింగ్‌కు ఎక్కువ సమయం తీసుకున్నాం కనుకే విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. ఇలాంటి సినిమా తెలుగులో ఇంతవరకూ రాలేదు. ఈ సినిమాను ఆదరిస్తే ఇటువంటి చిత్రాలు మరిన్ని వస్తాయి.
- పరిశ్రమలోకి వచ్చి పదేళ్లు అయింది. ఈ ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నా. ఇక్కడ ఆపకుండా ఏదో ఒకటి చేయాలి. కొన్ని సార్లు మనకి ఆప్షన్లు ఉంటాయి. కొన్ని సార్లు ఉండవు. అయినా ముందుకు సాగుతూనే ఉండాలి. పదేళ్ల కెరీర్ పూర్తి చేయడం నా దృష్టిలో పెద్ద డీల్. ఈ ఏడాది నేను నటించిన నాలుగు చిత్రాలు విడుదల అవుతాయి. వాటి వివరాలు నిర్మాతలు చెబుతారు. అలాగే 'ఝాన్సీ' వెబ్ సిరీస్ మరో సీజన్ కూడా రాబోతోంది.

వినూత్నంగా ఆయ్



మ్యాడ్ మూవీతో కుర్రకారును మెప్పించారు నార్నే నితిన్. తాజాగా ఈ నటుడు నయన్ సారికతో కలసి 'ఆయ్' చిత్రంలో నటిస్తున్నారు. అంజి కంచిపల్లి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసుతో సంయుక్తంగా విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. 'ఆయ్' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ను వేగవంతం చేసింది. అందులో భాగంగానే ఈ హిలేరియస్ ఎంటర్టైన్‌మెంట్ టైటిల్‌ను అనౌన్స్ చేశారు. నిర్మాత బన్నీవాస్, నార్నే నితిన్, నయన్ సారిక, డైరెక్టర్ అంజిపల్లి మధ్య జరిగే సరదా ఫోన్ సంభాషణతో టైటిల్‌ను వినూత్నంగా ప్రకటించారు. సరదా సంభాషణ, ఫన్నీ మీమ్స్ రిఫరెన్స్‌లతో సాగే ఈ వీడియో అందరినీ మెప్పిస్తోంది. ఈ వీడియోలో 'సమ్మర్‌లో కలుద్దాం' అంటూ హింట్ ఇచ్చారు. మార్చి 7న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్- సమీర్ కల్యాణి, సంగీత దర్శకుడు- రామ్ మిర్యాల, ఎడిటర్- కోదాటి పవన్ కల్యాణ్, ఆర్ట్ డైరెక్టర్- కిరణ్ కుమార్ మన్నె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- అజయ్ గద్దె, సహ నిర్మాతలు- భాను ప్రతాప్, రియాజ్ చౌదరి.

మర్చంట్లకు తక్షణ సెటిల్‌మెంట్

- ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం ఇంటరాపరబుల్ పేమెంట్ సిస్టమ్
- ఈ ఏడాదిలోనే అందుబాటులోకి

ముంబై: మర్చంట్లకు నిధుల తక్షణ సెటిల్‌మెంట్ సేవలు ఈ ఏడాదిలోనే అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం ఇంటరాపరబుల్ పేమెంట్ సిస్టమ్‌ను ఈ ఏడాదిలోనే ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం తెలిపారు. ఈ వ్యవస్థ ఏర్పాటుకు ఎన్‌పీసీఐ భారత్ బిల్‌పే లిమిటెడ్ (ఎన్‌బీబీఎల్) అనుమతివ్వడం జరిగిందన్నారు. తద్వారా మర్చంట్లకు నిధుల సెటిల్‌మెంట్ త్వరితగతిన జరగడంతో పాటు డిజిటల్ చెల్లింపులపై వినియోగదారుల్లో ధీమా పెంచేందుకు ఇది దోహదపడనుందన్నారు. "ఆన్‌లైన్ మర్చంట్ పేమెంట్ లావాదేవీల కోసం ఉపయోగిస్తున్న పాత విధానాల్లో ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఒకటి. ఆదాయ పన్ను, బీమా ప్రీమియం, మ్యూచువల్ ఫండ్ పేమెంట్స్, ఈ-కామర్స్ తదితర చెల్లింపుల లావాదేవీలకు అధికంగా వినియోగించుకుంటున్న మార్గాల్లో ఒకటిగా ఉంది. ప్రస్తుతం ఇంటర్నెట్ బ్యాంకింగ్ లావాదేవీల ప్రాసెసింగ్ పేమెంట్ అగ్రిగేటర్ల (పీఏ) ద్వారా జరుగుతోంది. కానీ ఈ వ్యవస్థ ఇంటరాపరబుల్ కాదు. అంటే, భిన్న ఆన్‌లైన్ మర్చంట్లకు చెందిన ప్రతి పీఏతో బ్యాంక్ విడిగా అనుసంధానితం కావాలి. దాంతో లావాదేవీల ప్రాసెసింగ్ సంక్లిష్టంగా ఉంద"ని దాస్ అన్నారు. డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

డిజిటల్ చెల్లింపుల్లో 80 శాతానికి యూపీఐ వాటా

భారత డిజిటల్ చెల్లింపుల యాత్రలో తమ వంతు పాత్ర పోషించేందుకు ఆర్‌బీఐ కట్టుబడి ఉందని దాస్ అన్నారు. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) త్వరితగతి చెల్లింపుల విధానంగా దేశీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తం ప్రాచుర్యం పొందిందని అన్నారు. గత ఏడాది చివరినాటికి దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా 80 శాతానికి చేరుకుందన్నారు. 2017లో 43 కోట్ల స్థాయిలో నమోదైన యూపీఐ లావాదేవీలు గడిచిన ఆరేళ్లలో అనూహ్య వృద్ధి చెందాయని, 2023లో 11,761 కోట్ల స్థాయికి చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం యూపీఐ రోజుకు 42 కోట్ల లావాదేవీలను ప్రాసెసింగ్ చేస్తోందన్నారు.

ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్‌కు ఆర్‌బీఐ షాక్



బంగారు రుణాల మంజూరుపై నిషేధం

ముంబై: ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై గట్టి వేటు పడింది. బంగారం తాకట్టుపై సంస్థ జారీ చేసే రుణాలపై నిషేధం విధించిన ఆర్‌బీఐ.. ఇది తక్షణమే అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. రుణం మంజూరు లేదా రుణ చెల్లింపుల్లో విఫలమైన సమయంలో రుణగ్రహీత తాకట్టు పెట్టిన బంగారం స్వచ్ఛత మదింపు, బరువు లెక్కింపు ధ్రువీకరణ విధానంలో తీవ్ర అతిక్రమణలు, లోన్ టు వేల్యూ నిష్పత్తి, తనఖా బంగారం వేలం నిబంధనలు, కస్టమర్లపై చార్జీల విధింపులో పారదర్శకత లేకపోవడంతో పాటు సంస్థలో పలు పర్యవేక్షణ లోపాలను గుర్తించిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్‌కు దేశంలోని 500కు పైగా నగరాల్లో 2,600కు పైగా శాఖలున్నాయి. గత ఏడాది డిసెంబరు 31 నాటికి కంపెనీ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో రూ.24,692 కోట్లకు చేరుకుంది. ఈ పోర్ట్‌ఫోలియో వార్షిక ప్రాతిపదికన 35 శాతం వృద్ధి చెందింది. అంతేకాదు, కంపెనీ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల్లో (ఏయూఎం)లో గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో వాటా 32 శాతంగా ఉంది. ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ గోల్డ్ లోన్స్‌తో పాటు పలు రకాల రుణాలు, తనఖా సేవలను అందిస్తోంది. అందులో బంగారం రుణాల వ్యాపారంపైన మాత్రం ఆర్‌బీఐ నిషేధం విధించింది. గోల్డ్ లోన్స్ మంజూరు/ విడుదల/ కేటాయింపు/ సెక్యూరిటైజేషన్/ రుణాల విక్రయాన్ని తక్షణమే నిలిపివేయాలని సంస్థను ఆదేశించడం జరిగిందని ఆర్‌బీఐ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే రుణాలిచ్చిన వారికి మాత్రం సేవలను కొనసాగించేందుకు అనుమతిచ్చింది. అలాగే, సంస్థ గోల్డ్ లోన్ వ్యాపారంపై ప్రత్యేక ఆడిటింగ్‌కు ఆదేశించింది. ప్రత్యేక ఆడిటింగ్ పూర్తయి, ఆ ఆడిటింగ్‌తో పాటు ఆర్‌బీఐ తనిఖీలో గుర్తించిన లోపాలను సంస్థ సరిదిద్దుకున్న తర్వాతే తాజా ఆంక్షలపై పునఃసమీక్షించనున్నట్లు నియంత్రణ మండలి స్పష్టం చేసింది. గత ఏడాది మార్చి 31 నాటికి కంపెనీ ఆర్థిక స్థితి ఆధారంగా తనిఖీలు జరిపినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కాగా, ఈ తనిఖీల్లో కంపెనీ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియోలో పలు పర్యవేక్షణ లోపాలను గుర్తించినట్లు తెలిపింది. బీఎస్ఈలో ఐఐఎఫ్‌ఎల్ షేరు ధర 3.35 శాతం క్షీణించి రూ.598.10 వద్ద ముగిసింది.



పెప్సీకోకి చెందిన స్లైస్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ నటి నయనతారను నియమించుకుంది. ఈ వేసవిలో మరింత మంది వినియోగదారులకు చేరువయ్యేందుకు నయనతార ప్రచారం ఎంతగానో తోడ్పడుతుందని స్లైస్ వెల్లడించింది.

ఎంజీ మోటార్ ఇండియా... తొలి ఇంటర్నెట్ ఎస్‌యూవీ ఎంజీ హెక్టార్‌లో రెండు కొత్త వేరియంట్లను తీసుకువచ్చింది. షైన్ ప్రొ, సెలెక్ట్ ప్రొ పేరుతో విడుదల చేసిన ఈ హెక్టార్ ప్రారంభ ధర రూ.13.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉంది.



ఈ ఏడాది భారత వృద్ధి రేటు 6.8%

మూడీస్

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలను అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ మూడీస్ మరింత పెంచింది. ఈ సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు 6.1 శాతం ఉంటుందని గతంలో ప్రకటించిన మూడీస్ ఇప్పుడు దాన్ని 6.8 శాతానికి పెంచింది. జీ-20 దేశాల్లో ఒక్క భారత జీడీపీ మాత్రమే ఇంత భారీ వృద్ధి రేటు నమోదు చేయనుందని తెలిపింది. అయితే వచ్చే ఏడాది (2025) మాత్రం భారత వృద్ధి రేటు కొద్దిగా తగ్గి 6.4 శాతం మించక పోవచ్చని అంచనా వేసింది. 2023 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో భారత జీడీపీ 8.4 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతర్జాతీయ ఆటుపోట్లు కూడా నన్నగిల్లుతున్నందున ఈ సంవత్సరం భారత జీడీపీ వృద్ధి రేటుకు ఢోకా ఉండదని పేర్కొంది.

ఇక రెండు లిస్టెడ్ కంపెనీలుగా టాటా మోటార్స్..



ఆమోదం తెలిపిన డైరెక్టర్ల బోర్డు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తన వాణిజ్య, ప్రయాణికుల వ్యాపారాన్ని రెండు లిస్టెడ్ కంపెనీలుగా విభజిస్తోంది. సోమవారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. రెండు రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాల్ని మరింతగా అందిపుచ్చుకునేందుకు ఈ విభజన చేపడుతున్నట్టు తెలిపింది. డైరెక్టర్ల బోర్డు ఆమోదించిన విభజన ప్రకారం వాణిజ్య వాహనాలు, దానికి సంబంధించిన పెట్టుబడులు ఒక లిస్టెడ్ కంపెనీగా, విద్యుత్ వాహనాలు, జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) వంటి ప్రయాణికుల వాహనాల వ్యాపారం, అందుకు సంబంధించిన పెట్టుబడులను మరో లిస్టెడ్ కంపెనీగా విభజిస్తారు.

అందరికీ మేలే: ఈ విభజన కంపెనీ కస్టమర్లు, ఉద్యోగులు, వాటాదారులతో సహా అందరికీ మేలు చేస్తుందని టాటా మోటార్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్లకు మరింత మేలైన అనుభవం, ఉద్యోగులకు మంచి అవకాశాలు, వాటాదారుల వద్ద ఉన్న షేర్లకు మరింత విలువ ఏర్పడుతుందన్నారు. ఈ విభజనకు వాటాదారులు, రెగ్యులేటరీ సంస్థల అనుమతి లభించేందుకు 12 నుంచి 15 నెలల సమయం పడుతుందని భావిస్తున్నారు.

రిలయన్స్ షేరు @ రూ.3,000

స్టాక్ మార్కెట్ దిగ్గజ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు ధర తొలిసారిగా రూ.3,000 మైలురాయిని దాటింది. సోమవారం బీఎస్ఈలో కంపెనీ షేరు ట్రేడింగ్ రూ.2,981 వద్ద ప్రారంభమై.. ఒక దశలో రూ.3,024.80 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1.03 శాతం లాభంతో రూ.3,011.60 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20.37 లక్షల కోట్లు దాటింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్ఐఎల్ షేరు ధర 16.65 శాతం పెరిగింది. గడిచిన ఏడాది కాలంలో 36.52 శాతం వృద్ధి కనబరిచింది. గత ఐదేళ్లలో కంపెనీ షేరు 167 శాతం రిటర్నులు పంచింది. రిలయన్స్ షేరు మున్ముందు మరింత పరుగు తీయవచ్చని బ్రోకరేజీ సంస్థలంటున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	64,080 ▲	58,740 ▲	77,100 ▲
ముంబై	63,480 ▲	58,148 ▲	70,777 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ		విజయవాడ	463
హైదరాబాద్	469	విశాఖపట్నం	500
5వ తేదీ		వరంగల్	471
చిత్తూరు	523		
గోదావరి	463	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126	గోదావరి	128
వరంగల్	126	విజయవాడ	128
కరీంనగర్	126	గుంటూరు	124
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	124
కర్నూలు	126	చిత్తూరు	120
విశాఖపట్నం	121		

కొత్త గరిష్ఠాలకు సూచీలు

ఇంట్రాడేలో 74,000కు చేరువైన సెన్సెక్స్
22,400 ఎగువన ముగిసిన నిఫ్టీ

ముంబై: వరుసగా నాలుగో రోజూ లాభాల్లో పయనించిన భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం సరికొత్త రికార్డు గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ 66.14 పాయింట్ల వృద్ధితో 73,872.29 వద్ద ముగిసింది. సూచీకిది జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి. అంతేకాదు, ఒక దశలో 183.98 పాయింట్ల వరకు లాభపడి 73,990.13 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డు సైతం నమోదు చేసింది. 22,440.90 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని రికార్డు చేసిన నిఫ్టీ.. చివరికి 27.20 పాయింట్ల లాభంతో సరికొత్త గరిష్ఠ ముగింపు స్థాయి 22,405.60 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఈ ఏడాదికి భారత వృద్ధి రేటు అంచనాను భారీగా పెంచడం మార్కెట్ ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం లాభాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ 3.50 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. పవర్‌గ్రిడ్ 2.63 శాతం, మార్కెట్ దిగ్గజ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.03 శాతం పెరిగాయి. కాగా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎం అండ్ ఎం రెండు శాతానికి పైగా నష్టపోయాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.78 శాతం పెరగగా.. మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం తగ్గింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.393 లక్షల కోట్లకు (4.80 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ముక్క ప్రొటీన్ ఐపీఓకు 137 రెట్ల బిడ్లు

ఫిష్‌మీల్, ఫిష్‌ఆయిల్ తయారీ సంస్థ ముక్క ప్రొటీన్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. సోమవారంతో ముగిసిన ఈ ఆఫర్‌కు ఇష్యూ సైజుకు 136.89 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. రూ.224 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వచ్చిన కంపెనీ 5.60 కోట్ల షేర్లను విక్రయానికి పెట్టగా.. ఇన్వెస్టర్లు 766.58 కోట్ల షేర్ల కొనుగోలుకు బిడ్లు సమర్పించినట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. కాగా, ఆర్‌కే స్వామి ఐపీఓ తొలిరోజు పూర్తయ్యేనాటికి ఇష్యూ సైజుకు 2.18 రెట్ల బిడ్లు లభించాయి. ఇక పోతే, మౌలిక రంగ కంపెనీ సిగల్ ఇండియా ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ తాజా ఈక్విటీ ద్వారా రూ.618 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

సామ్‌సంగ్ 'గెలాక్సీ ఎఫ్ 15' 5జీ స్మార్ట్‌ఫోన్



ప్రారంభ ధర రూ.11,999

న్యూఢిల్లీ: సామ్‌సంగ్.. మార్కెట్లోకి సరికొత్త 5జీ స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఎఫ్ 15 విడుదల చేసింది. 4జీబీ, 6జీబీ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ స్మార్ట్‌ఫోన్ ధరలు వరుసగా రూ.11,999, రూ.13,499గా ఉన్నాయి. మేకిన్ ఇండియా విజన్‌కు అనుగుణంగా ఈ ఫోన్‌ను ఇక్కడే అభివృద్ధి చేసినట్లు సామ్‌సంగ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ వెల్లడించారు. జెన్ జెడ్, మిల్లీనియల్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ఫోన్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. 6.5 అంగుళాల ఎస్‌అమోలెడ్ డిస్‌ప్లే, మీడియాటెక్ డైమెన్సిటీ 61,00 ప్లస్ చిప్‌సెట్, 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా,13 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఈ ఫోన్ ప్రత్యేకతలు. 4జీబీ ప్లస్ 128 జీబీ, 6జీబీ ప్లస్ 128 జీబీ స్టోరేజ్‌తో మూడు రంగుల్లో ఈ ఫోన్ అందుబాటులో ఉంటుంది. ఈ నెల 11 నుంచి ఫ్లిప్‌కార్ట్, సామ్‌సంగ్ డాట్‌కామ్, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో ఈ ఫోన్ విక్రయాలు ప్రారంభమవుతాయని బబ్బర్ తెలిపారు. అయితే తొలిసారిగా ఫ్లిప్‌కార్ట్‌పై ఎఫ్15 5జీ ఎర్లీ సేల్‌ను సోమవారం నుంచి ప్రారంభించినట్లు సామ్‌సంగ్ తెలిపింది. కాగా వచ్చే ఏడాది కాలంలో 20 లక్షల గెలాక్సీ ఎఫ్ 15 స్మార్ట్‌ఫోన్లను విక్రయించవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బబ్బర్ తెలిపారు.

స్పోర్ట్స

ఆనంద్‌ను దాటేసిన అర్జున్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ క్లాసిక్ చెస్ విభాగం అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో పదోస్థానంతో టాప్-10లోకి ప్రవేశించి సంచలనం సృష్టించాడు. ఈ క్రమంలో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించాడు. క్లాసిక్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి ప్రస్తుతం అర్జున్ (2754.6) ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. ఆనంద్ (2751) 11వ, ప్రజ్ఞానంద 15వ, గుకేష్ 16వ ర్యాంకుల్లో నిలిచారు. బ్లిట్జ్‌లో టాప్-20లో భారత్ నుంచి ఇద్దరే ఉన్నారు. ఇందులో అర్జున్ 13వ ర్యాంక్‌లో నిలవగా, ఆనంద్ 18వ స్థానంలో ఉన్నాడు. ఇక, చైనాలో జరుగుతున్న షెంజెన్ మాస్టర్స్ టోర్నీలో సోమవారం ముగిసిన నాలుగో రౌండ్‌లో అర్జున్ తెల్ల పావులతో బరిలోకి దిగాడు. సుదీర్ఘంగా సాగిన ఈ పోరులో అర్జున్ 70వ ఎత్తుల్లో చైనా జీఎం మా కున్‌పై గెలిచాడు. ఈ టోర్నీలో అర్జున్‌కు ఇది మూడో విజయం. చైనా జీఎంలు బు జియాంగ్జి, యు యాంగితో కలిసి అర్జున్ ప్రస్తుతం 3 పాయింట్లతో సమంగా ఉన్నా, మెరుగైన టైబ్రేక్ స్కోరు కారణంగా పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచాడు.

భారత టీటీ జట్లకు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ: భారత మహిళల, పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లు పారిస్ ఒలింపిక్ బెర్త్‌లు దక్కించుకొని చరిత్ర సృష్టించాయి. ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా టీటీలో భారత జట్లు ఒలింపిక్ బెర్త్‌లు సాధించడం ఇదే ప్రథమం. గతనెల బుసాన్‌లో జరిగిన వరల్డ్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో కనబర్చిన ప్రదర్శనతో భారత జట్ల ర్యాంకింగ్స్ మెరుగుపడ్డాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత మహిళల జట్టు 13, పురుషుల జట్టు 15వ స్థానాల్లో ఉన్నాయి. టాప్-16 ర్యాంకింగ్స్‌లోపు ఉన్న జట్లను విశ్వక్రీడలకు ఎంపిక చేసినట్టు ప్రపంచ టీటీ సమాఖ్య ప్రకటించింది. భారత మహిళల బృందంలో హైదరాబాద్ అమ్మాయి ఆకుల శ్రీజ, మనికా బాత్రా, అర్చన, అహిక, దియా.. పురుషుల జట్టులో వెటరన్ స్టార్ శరత్ కమల్, హర్మీత్ దేశాయ్, మనవ్ ఠక్కర్, సాథియన్, మనుష్ షా ఒలింపిక్స్ టీమ్ ఈవెంట్ రేసులో ఉన్నారు.



బ్యాడ్మింటన్‌కు సాయి ప్రణీత్ వీడ్కోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగు షట్లర్ భమిడిపాటి సాయిప్రణీత్ బ్యాడ్మింటన్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నట్టు సోమవారం తన సోషల్ మీడియా ఖాతాల్లో తెలిపాడు. 2010లో వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గి, అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రణీత్, టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఈ 31 ఏళ్ల షట్లర్ 2017లో సింగపూర్ సూపర్ ఓపెన్ సిరీస్‌ను, 2019లో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించి సంచలనం సృష్టించాడు. టోక్యో ఒలింపిక్స్ తర్వాత వరుస గాయాలతో సతమతమవుతున్న ప్రణీత్.. కొన్నాళ్లుగా టోర్నీల్లో ఆడడం లేదు. ఇక, త్వరలో అతను అమెరికాలోని ఓ బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. '24 ఏళ్లుగా నాతో బ్యాడ్మింటన్ పెనవేసుకుపోయింది. మిశ్రమ భావోద్వేగాల నడుమ రిటైర్మెంట్ నిర్ణయాన్ని తీసుకున్నా. కోచ్‌గా త్వరలో కొత్త జీవితాన్ని ప్రారంభించనున్నా. ఈ ప్రయాణంలో నన్ను ప్రోత్సహించిన కోచ్‌లు గోపీచంద్, ఆరిఫ్, గోవర్ధన్‌లకు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు' అని ప్రణీత్ చెప్పాడు.

ఫేవరెట్ సాత్విక్ జోడీ

నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: డబుల్స్ నెం:1 జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మంగళవారం నుంచి జరగనున్న ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. గతేడాది చైనా మాస్టర్స్, మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో ఫైనల్లో ఓడిన సాత్విక్ జంట.. ఈసారి టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉంది. 2022లో ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన తర్వాత సాత్విక్-చిరాగ్ నిలకడైన ఆటతో టాప్ ర్యాంక్‌కు ఎగబాకారు. తొలి రౌండ్‌లో మలేసియాకు చెందిన ఆంగ్ యు సిన్-టియో యి యి జోడీతో సాత్విక్ జోడీ తలపడనుంది. అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టోతో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల ఆడనుంది. ఇక సింధు.. తొలి రౌండ్‌లో మిషెల్లి లీ (కెనడా)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగనున్నారు.



ఐదో టెస్టుకు వర్షం ముప్పు!

ధర్మశాల: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరగాల్సిన ఐదో టెస్టుకు వరుణుడు ఆటంకపరిచే అవకాశం ఉంది. ఈనెల 7 నుంచి ధర్మశాలలో ఈ మ్యాచ్ జరుగనుండగా.. తొలి రోజు గురువారం ఉష్ణోగ్రత ఆరు డిగ్రీలకు పడిపోనుంది. అలాగే వర్షం కురిసే అవకాశం 82 శాతంగా ఉంది. శుక్రవారం కూడా చిరు జల్లులకు ఆస్కారం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మూడు, నాలుగు రోజుల్లో సూర్యుడు కనిపించినా ఆఖరి రోజు మేఘావృతంగా ఉండి తిరిగి వర్షం పడే చాన్స్ ఉంది. అయితే ఇలాంటి వాతావరణం ఇంగ్లండ్ జట్టుకు కలిసి వస్తుందని, భారత్ జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుందని మాజీ కెప్టెన్ గవాస్కర్ సూచించాడు.

మూడేళ్లలో నాలుగో సారథి

సన్‌రైజర్స్ కొత్త కెప్టెన్ కమిన్స్



హైదరాబాద్: ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ విన్నింగ్ సారథి ప్యాట్ కమిన్స్‌ను నియమించారు. గత డిసెంబరులో జరిగిన మినీ వేలంలో 30 ఏళ్ల పేసర్ కమిన్స్‌ను సన్‌రైజర్స్ రూ. 20.50 కోట్ల భారీ ధరకు ఖరీదు చేసింది. అప్పుడే కమిన్స్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తారనే వార్తలు వచ్చాయి. సౌతాఫ్రికా ఆటగాడు మార్‌క్రమ్ నుంచి కమిన్స్ పగ్గాలందుకోనున్నాడు. మొత్తంగా గత మూడేళ్లలో వార్నర్, విలియమ్సన్, మార్‌క్రమ్ తర్వాత జట్టు బాధ్యతలు అందుకోనున్న నాలుగో కెప్టెన్ కమిన్స్. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌ను వరుసగా రెండోసారి మార్‌క్రమ్ విజేతగా నిలిపాడు. కానీ, మేనేజ్‌మెంట్ ఈ ప్రదర్శనను పట్టించుకోలేదు. 2023లో సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌ల్లో 4 మాత్రమే నెగ్గింది.

ధోనీ 'కొత్త పాత్ర' పోస్టు కలకలం



న్యూఢిల్లీ: ఐపీఎల్ కోసం సర్వం సిద్ధమవుతుండగా.. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ధోనీ 'కొత్త అవతారం' అంటూ నెట్‌లో చేసిన పోస్టు క్రికెట్ వర్గాల్లో కలకలం రేపింది. ఫేస్‌బుక్‌లో అతడు చేసిన పోస్టు..ఊహాగానాలకు కారణమవుతోంది. 'కొత్త సీజన్, నూతన పాత్ర కోసం ఇక ఆగలేను' అని ధోనీ రాశాడు. దీంతో భవిష్యత్‌లో మహీ ఇక సీఎస్‌కే మెంటార్‌గా వ్యవహరిస్తాడంటూ నెటిజన్లు తమదైన విశ్లేషణలు చేస్తున్నారు.

కాన్వే ఐపీఎల్ ఆడేనా?

చెన్నై జట్టుకు ఐపీఎల్ ఆరంభానికి ముందే గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఓపెనర్ డెవాన్ కాన్వే గాయం కారణంగా లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. మే వరకు అతడు అందుబాటులో ఉండడని సమాచారం. ఇటీవల ఆసీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఈ కివీస్ బ్యాటర్ ఎడమ బొటనవేలికి గాయమైంది. ఈ వారంలోనే సర్జరీ చేయించుకోనున్న కాన్వే కోలుకునేందుకు రెండు నెలల సమయం పట్టనుంది.

మంధాన మెరుపుల్!

- ఎలిస్ పెర్రీ హాఫ్ సెంచరీ
- యూపీపై బెంగళూరు విజయం

మహిళల ప్రీమియర్ లీగ్

50 బంతుల్లో 80



నేటి మ్యాచ్
ఢిల్లీ x ముంబై
రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: సొంత మైదానంలో తమ చివరి లీగ్ మ్యాచ్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయంతో ముగించింది. వరుసగా రెండు ఓటముల తర్వాత కెప్టెన్ స్మృతి మంధాన (50 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 80) సూపర్ బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ అద్భుతంగా కోలుకుంది. ఫలితంగా సోమవారం యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 23 పరుగుల తేడాతో నెగ్గింది. యూపీకి కెప్టెన్ అలీసా హీలీ (38 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) పోరాటం సరిపోలేదు. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 3 వికెట్లకు 198 పరుగులు చేసింది. ఎలిస్ పెర్రీ (37 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 58) హాఫ్ సెంచరీ సాధించింది. ఛేదనలో యూపీ 20 ఓవర్లలో 175/8 స్కోరుకు పరిమితమై ఓడింది. దీప్తి శర్మ (33), పూనమ్ (31) రాణించారు. డివైన్, మోలినెక్స్, వేర్‌హమ్, శోభనలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మంధాన నిలిచింది.

హీలీ పోరాడినా..: భారీ ఛేదనలో యూపీ ఆరంభం బాగున్నా.. మిడిలార్డర్ పేలవ ప్రదర్శన దెబ్బతీసింది. ఓపెనర్ అలీసా హీలీ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. చివర్లో దీప్తి శర్మ, పూనమ్ గెలిపించే ప్రయత్నం చేశారు. మరో ఓపెనర్ కిరణ్ నవ్‌గిరె (18)తో తొలి వికెట్‌కు 47 పరుగులు జత చేసిన హీలీ.. ఓ ఎండ్‌లో వికెట్లు పడుతున్నా ఎదురుదాడి కొనసాగించింది. తొమ్మిదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్న ఆమె 34 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసింది. అయితే ధాటిగా ఆడే ప్రయత్నంలో 13వ ఓవర్‌లో కీపర్ రిచా అద్భుత స్టంపింగ్‌కు పెవిలియన్‌కు చేరింది. అప్పటికి యూపీ ఓవర్‌కు 9 పరుగుల రన్‌రేట్‌తో ఆడుతుండడంతో విజయంపై ఆశలు కనిపించాయి. అటు దీప్తి కూడా బౌండరీల జోరుతో ఆర్‌సీబీని ఒత్తిడికి గురి చేసింది. అయితే ఆశా శోభనకు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో దీప్తి ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత పూనమ్ చెలరేగినా ఫలితం లేకపోయింది.

బాదుడే బాదుడు..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి బరిలోకి దిగిన ప్రతీ బ్యాటరూ అదరగొట్టింది. ఓపెనర్ మంధాన, ఎలిస్ పెర్రీ ధాటికి ఆఖరి 6 ఓవర్ల లోనే జట్టు 72 రన్స్ సాధించడం విశేషం. ఆరంభంలో మరో ఓపెనర్ సబ్బినేని మేఘన (28)తో కలిసి మంధాన మెరుపు ఆరంభాన్ని అందించింది. ఇద్దరూ ఎడాపెడా బౌండరీలతో రెండు, మూడో ఓవర్లలో 12 పరుగుల చొప్పున రాబట్టారు. అయితే ఐదు ఫోర్లతో వేగం చూపిన మేఘన తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించి వెనుదిరిగింది. అనంతరం మంధానకు పెర్రీ జత కలవడంతో యూపీ బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. 34 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన మంధాన కళ్లు చెదిరే షాట్లతో ఆకట్టుకుంది. ఇక 15, 16వ ఓవర్లలో మూడేసి ఫోర్లతో 80 పరుగులకు చేరడంతో స్మృతి సెంచరీ ఖాయమనిపించింది. కానీ ఆమె దూకుడుకు స్పిన్నర్ దీప్తి శర్మ బ్రేక్ వేసింది. దీంతో పెర్రీతో రెండో వికెట్‌కు అందించిన 95 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. 33 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన పెర్రీ 19వ ఓవర్‌లో బాదిన ఓ సిక్సర్ నేరుగా డిస్‌ప్లే కారు అద్దాన్ని పగలగొట్టింది. ఆఖరి ఓవర్‌లో పెర్రీ వెనుదిరగ్గా, రిచా (21 నాటౌట్) ఫోర్‌తో ఇన్నింగ్స్‌ను ముగించి స్కోరును 200 దరిదాపుల్లోకి తెచ్చింది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 198/3 (మంధాన 80, పెర్రీ 58, మేఘన 28; ఎకెల్‌స్టోన్ 1/22).
యూపీ: 20 ఓవర్లలో 175/8. (హీలీ 55, దీప్తి 33, పూనమ్ 31; శోభన 2/29, మోలినెక్స్ 2/29, డివైన్ 2/37, వేర్‌హమ్ 2/38).

రంజీ ఫైనల్లో ముంబై



ముంబై: దేశవాళీ క్రికెట్‌లో బలమైన జట్టు ముంబై 48వసారి రంజీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శార్దూల్ ఠాకూర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. సెమీస్‌లో తమిళనాడుపై ఇన్నింగ్స్ 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 232 పరుగుల లోటుతో.. ఆటకు మూడో రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన తమిళనాడు 162 రన్స్‌కే కుప్పకూలింది. దీంతో ముంబై మరో రెండు రోజుల ఆట మిగిలుండగానే జయకేతనం ఎగురవేసింది. బాబా ఇంద్రజిత్ (70) మినహా మిగతా బ్యాటర్లు కనీస పోరాటం కూడా చేయలేదు. షామ్స్ ములానీ 4 వికెట్లు పడగొట్టగా.. శార్దూల్, మోహిత్, తనుష్ తలో 2 వికెట్లు దక్కించుకొన్నారు. అంతకుముందు 359/9తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబై 378 పరుగులకు ఆలౌటైంది. తమిళనాడు మొదటి ఇన్నింగ్స్‌లో 146 పరుగులు చేసింది. కాగా ఈనెల 10 నుంచి జరుగనున్న రంజీ ఫైనల్‌కు ముంబైలోని వాంఖడే స్టేడియాన్ని వేదికగా ఎంపిక చేసినట్టు ముంబై క్రికెట్ సంఘం సోమవారం ప్రకటించింది.

విదర్భ ఆధిక్యం 261: యష్ రాథోడ్ (97 బ్యాటింగ్) రాణించడంతో.. మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రెండో సెమీ్‌ఎలో విదర్భ పోరాడుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 13/1తో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విదర్భ 343/6 స్కోరు చేసి, మొత్తంగా 261 పరుగుల ఆధిక్యం సాధించింది. రాథోడ్, అక్షయ్ ఆరో వికెట్‌కు 158 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 170 రన్స్‌కే ఆలౌట్ కాగా.. మధ్యప్రదేశ్ 252 పరుగులు చేసింది.

హైదరాబాద్ హ్యాట్రిక్ ఓటమి

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ వరుసగా మూడో ఓటమిని మూటగట్టుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 0-3తో బెంగుళూరు టార్పెడోస్ చేతిలో పరాజయం పాలైంది. మొత్తంగా హైదరాబాద్ జట్టు ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్కటి మాత్రమే నెగ్గింది.

అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు చైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డాగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేంద్రం మళ్లీ విదేశీ బొగ్గు పాట

» దేశీయ థర్మల్ కేంద్రాలు 6 శాతం విదేశీ బొగ్గు వాడాలి

» కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అడ్వయిజరీ విడుదల

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రానున్న ఏప్రిల్-జూన్‌లో అత్యధిక విద్యుత్తు డిమాండ్ నెలకొనే అవకాశం ఉందని కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ అంచనా వేస్తోంది. డిమాండ్‌కు తగ్గట్లుగా థర్మల్ కేంద్రాలకు దేశంలోని బొగ్గును తరలించడం.. చేరవేయడం కష్టంతో కూడుకున్న పని కావడంతో.. దేశీయ బొగ్గు ఆధారిత థర్మల్ కేంద్రాలు విద్యుత్తు ఉత్పత్తి కోసం మండించే బొగ్గులో 6 శాతం విదేశీ బొగ్గు ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్రాల ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శులతో పాటు జెన్‌కోల సీఎండీలకు కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ అడ్వయిజరీని విడుదల చేసింది. రానున్న జూన్ దాకా ఉత్పత్తికి వినియోగించే బొగ్గులో 6 శాతం విదేశీ బొగ్గు వాటా ఉండేలా చూడాలని నిర్దేశించింది. ఆస్ట్రేలియాతో పాటు ఇండోనేషియాలో అత్యధికంగా బొగ్గు నిల్వలుండగా.. వాటిపై గుత్తాధిపత్యం అదానీ సంస్థలదే. దాంతో అదానీ బొగ్గును జెన్‌కోల నుంచి కొనుగోలు చేయడానికే పదే పదే కేంద్రం గత రెండేళ్లుగా అడ్వయిజరీలు విడుదల చేస్తుందని పలువురు మండిపడుతున్నారు. టన్ను రూ.4500-రూ.6000లకు లభించే బొగ్గును వదులుకొని.. రూ.11 వేలకు టన్ను బొగ్గును దిగుమతి చేసుకుంటే కరెంట్ చార్జీలు భారంగా మారతాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బతికున్న రైతు భూమి ఇతరులకు విరాసత్

» తహసీల్దార్ మాయజాలం.. జిల్లేడ్ చౌదరిగూడలో ఘటన

చౌదరిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల మాయాజాలానికి ఓ రైతు నష్టపోయాడు. అతడు బతికుండగానే.. చనిపోయాడని పత్రాలను సృష్టించి, అతడి భూమిని ఇతరులకు విరాసత్ చేశారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట్‌కు చెందిన గడ్డం వెంకటయ్యకు చేగిరెడ్డి ఘణాపూర్‌లో సర్వే నంబర్లు 222/3లో 20 గుంటల సీలింగ్ పట్టా, 16/26(అ)లో 10గుంటల అసైన్డ్ భూమి ఉంది. తహసీల్దార్ కార్యాలయంలో ఆరు నెలల క్రితం అదే గ్రామంలో గడ్డం వెంకటయ్య అనే వ్యక్తి చనిపోయాడని పేర్కొంటూ.. ఆయన కూతుళ్లుగా చెప్పుకొన్న తిమ్మగళ్ల గాయత్రి, హన్మగళ్ల మమత అతడి పేరు మీదున్న భూమిని విరాసత్ చేయాలంటూ దరఖాస్తు చేశారు. తహసీల్దార్ కార్యాలయ అధికారులు రికార్డులను పరిశీలించకుండా గడ్డం వెంకటయ్య తండ్రి నర్సయ్య పేరిట ఉన్న భూమిని పట్టాదారుకు తెలియకుండానే గాయత్రి, మమతలకు విరాసత్ చేశారు. బతికున్న వెంకటయ్య తనకు రైతుబంధు జమ కావడం లేదని ఆన్‌లైన్‌లో రికార్డులను చూసుకోగా.. అతడి పేరుపై భూమి లేదని తేలింది. దీంతో వెంకటయ్య తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను బతికి ఉండగానే తన భూమిని ఇతరుల పేరు మీద మార్చడం ఏమిటని అధికారులను నిలదీశారు. 15 రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకున్న నాథుడు లేడని వెంకటయ్య వాపోయారు. తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

తెలంగాణలో పుట్టడం అదృష్టంగా నిరుద్యోగులు భావిస్తున్నారు: చనగాని దయాకర్

హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపట్టిన నేపథ్యంలో తెలంగాణలో పుట్టడం తమ అదృష్టంగా నిరుద్యోగులు భావిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ తెలిపారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల కనికరం లేకుండా వ్యవహరించిందని విమర్శించారు. సీఎంపై విమర్శలు చేస్తున్న కేసీఆర్, కేటీఆర్‌లు ఆత్మవిమర్శ చేసుకోవాలని సోమవారం పేర్కొన్నారు.

భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలి: సీపీఐ

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'ధరణి బూచీతో భూమి స్వాహా, 'భూదాన్ భూముల్లో కాలనాగులు' శీర్షికలతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శంశాంకను కోరారు. ఈ మేరకు సీపీఐ నాయకులు ఓరుగంటి యాదయ్య, పుస్తకాల నర్సింగ్‌రావు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గండిపేట మండలం పట్టినాగులపల్లి గ్రామ రెవెన్యూ సర్వే నం.186, 187, 188, 189లలో 29ఎకరాల 27గుంటల భూదాన భూమి అన్యాక్రాంతంపై సమగ్ర విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

జీవో 3తో ఆడబిడ్డల నోట్లో మట్టే: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబరు 3తో తెలంగాణ ఆడబిడ్డల నోట్లో మట్టి కొడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సోమవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం తెచ్చిన జీవో 3 వల్ల మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాలు 12శాతమే దక్కే పరిస్థితి వచ్చిందని చెప్పారు. తక్షణమే ఆ జీవోను రద్దు చేయాలన్నారు. మహిళలకు అన్యాయం చేసే జీవోకు వ్యతిరేకంగా భారత్ జాగృతి ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని చెప్పారు. ఈ నెల 8న ధర్నా చౌక్‌లో నల్లరిబ్బన్లు ధరించి ధర్నా చేస్తామని వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రూపాయి కూడా ఇవ్వని ప్రధాని మోదీ పెద్దన్న ఎలా అవుతారో చెప్పాలని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, మోదీ.. ఇద్దరూ బడేమియా చోటేమియాలని అని ఎద్దేవా చేశారు.

5-6 నెలల తర్వాత..

ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి అధికారం చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింది"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంచనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీలను చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

ఎల్‌ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్‌ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్‌ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్‌ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్‌ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్‌ఆర్ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

బయట పడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించకపోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్‌ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివనగర్, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమా బీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతి వేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతి వేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలేరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్ పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎస్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

నేడు పటాన్‌చెరు సభకు మోదీ

పటాన్‌చెరు, మార్చి 4: ప్రధాని మోదీ మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించే బహిరంగ సభకు రానున్నారు. అక్కడి నుంచే ఆయన రూ.7,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రధానితో పాటు గవర్నర్ తమిళి సై, సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా ఈ సభకు హాజరవుతారు. మంగళవారం ఉదయం మోదీ.. సికింద్రాబాద్‌లోని మహంకాళి అమ్మవారిని దర్శించుకుంటారు.

మెదక్ బీజేపీ అభ్యర్థిగా ఆలె భాస్కర్?

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మెదక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయబోయే బీజేపీ అభ్యర్థిగా దివంగత నేత ఆలె నరేంద్ర తనయుడు ఆలె భాస్కర్ పేరు పరిశీలనకు వచ్చింది. పలువురు రాష్ట్ర ముఖ్యనేతలు ఆయన పేరును అధినాయకత్వానికి సిఫారసు చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు అంజిరెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లోనే దీనిపై స్పష్టత రానుందని పార్టీవర్గాలు తెలిపాయి.

టెక్నాలజీలో దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలి: కిషన్‌రెడ్డి

తార్నాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని యువత సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తార్నాకలోని ఐఐసీటీ ఆవరణలో సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మాణ పనులకు మరో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో స్కీం ఫర్ ప్రమోషన్ ఆఫ్ కల్చర్ ఆఫ్ సైన్స్‌లో భాగంగా సీఎస్ఐఆర్, ఐఐసీటీతో కలిసి సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో సైన్స్ సెంటర్‌లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

నన్ను పోగొట్టుకొని మేం ఖతమయ్యామని బాధపడుతున్నారు..

బీఆర్ఎస్ నేతలు టచ్‌లో ఉన్నారు: ఈటల

మేడ్చల్ టౌన్, మార్చి 4: 'నన్ను.. కేసీఆర్ ఎన్ని తిప్పలు పెట్టిండో.. అందరికీ తెలుసు. అయినా అన్నింటినీ తట్టుకుని నిలబడ్డా.. బీఆర్ఎస్‌లో నన్ను అభిమానించే వారు నేటికీ ఉన్నారు. ఇప్పటికీ చాలా మంది బీఆర్ఎస్ నేతలు టచ్‌లో ఉన్నారు. నన్ను పోగొట్టుకుని ఖతమయ్యామంటూ కొందరు బీఆర్ఎస్ నేతలు ఫోన్ చేస్తున్నారు' అంటూ బీజేపీ నేత, మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. తనను కలవడానికి వచ్చిన అభిమానులతో ఆయన మాట్లాడారు. దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసే అవకాశం తనకు బీజేపీ కల్పించిందన్నారు.





ఆదిలాబాద్ బహిరంగ సభకు హాజరైన జనం; సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

కాళేశ్వరంపై కుమ్మక్కు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభోత్సవాలు చేశారు. వీటిలో తెలంగాణకు చెందిన రూ.6,697 కోట్ల విలువైన పనులు ఉన్నాయి. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఎన్టీపీసీకి చెందిన 800 మెగావాట్ల తెలంగాణ సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (రెండో యూనిట్)ను జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని పాల్గొన్నారు. 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పలు మార్లు తెలుగులోనే ఆయన మాట్లాడారు. దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయని, తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, మోదీ గ్యారెంటీ అంటే కచ్చితంగా అమలై తీరుతుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా.. తెలంగాణ ప్రజలు చేసిన కృషికి తగిన గౌరవం దక్కలేదని, 2014 తర్వాత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే తెలంగాణ అభివృద్ధికి, గిరిజనుల ఆత్మగౌరవానికి పెద్దపీట వేసిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నాలుగు వందలకుపైగా లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. '400 సీట్లు' అంటూ బీజేపీకే అందరూ మద్దతు ఇవ్వాలని తెలుగులోనే అన్నారు. తెలంగాణలోని గ్రామగ్రామాన యువకులు, మహిళలు, రైతులు, కార్మికులంతా 'అబ్‌కి బార్ చార్ సౌ పార్' అని నినదిస్తున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో రాంజీ గోండు పేరుతో మ్యూజియంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఏడు టెక్స్‌టైల్ పార్కులను మంజూరు చేసి తెలంగాణకు ఒకటి కేటాయించామని తెలిపారు. సమ్మక్క - సారక్క గిరిజన యూనివర్సిటీ, రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ఇది ఎన్నికల సభ కాదంటూనే 'వికసిత భారత్' సభకు మీరంతా తరలి రావడం సంతోషంగా ఉందన్నారు. 'మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు..' అని అన్నారు.

ఆత్మ నిర్భర్ భారత్ నుంచి వికసిత భారత్ వైపు

ఆత్మ నిర్భర్ భారత్ నుంచి వికసిత భారత్ వైపు పయనిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతుందని, దేశాభివృద్ధికి వేల కోట్ల పనులను చేపట్టామని, గడిచిన 15 రోజుల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. "ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుంది. బీజేపీ అధికారంలోకి రాక ముందు ఆదివాసీ మహిళ రాష్ట్రపతి అవుతుందని ఎవరైనా ఊహించారా!? భగవాన్ బిర్సా ముండా జయంతిని జాతీయ పండుగగా జరుపుతారని ఎవరైనా అనుకున్నారా!?" అని ప్రశ్నించారు. గిరిజనుల అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, వారికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు.

140 కోట్ల మంది నా కుటుంబ సభ్యులే

"మోదీకి కుటుంబం లేదు. ప్రజలే నా కుటుంబం. నా జీవితం మీ సేవకే అంకితం. మీ స్వప్నమే నా సంకల్పం. దేశమే నా కుటుంబం. దేశంలోని 140 కోట్ల మంది నా కుటుంబ సభ్యులే. నా ఇంటిని వదిలిపెట్టి ఓ లక్ష్యంతో వచ్చాను. నా జీవితం దేశం కోసం అంకితం. మీ బిడ్డల భవిష్యత్తు కోసం నేను పరితపిస్తాను" అంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పట్నాలో ఆదివారం జరిగిన ఇండియా సభలో 'మోదీకి కుటుంబం లేదు. దానికి మనమేం చేస్తాం' అంటూ మాజీ ముఖ్యమంత్రి లాలుప్రసాద్ యాదవ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో మోదీ దానికి దీటుగా, భావోద్వేగంతో జవాబు ఇచ్చారు. తన జీవితం తెరిచిన పుస్తకమని వ్యాఖ్యానించారు. 'మీరు మోదీ కుటుంబం' అంటూ తెలుగులో ప్రసంగించారు. తనకంటూ ప్రత్యేకంగా కలలు ఏమీ లేవని, అందుకే దేశంలోని కోట్లాది మంది తనను వారి కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నారని చెప్పారు. 'నా దేశం నా కుటుంబం' అన్న భావనతో మీ కోసం జీవిస్తున్నానని తెలిపారు.

తెలంగాణకు రాముడి ఆశీర్వాదం

అయోధ్య రామ మందిరంలో బంగారు దర్వాజా, మందిరంలోని బంగారు ధ్వజ స్తంభం నిర్మాణంలో తెలంగాణ పాత్ర ఉందని ప్రధాని మోదీ అన్నారు. రామ్‌లల్లా ఆశీర్వాదం తెలంగాణ ప్రజలపై ఉంటుందన్నారు. వికసిత తెలంగాణ లక్ష్యాన్ని తాము తప్పకుండా పూర్తి చేస్తామన్నారు. రానున్న 25 ఏళ్లలో కష్టపడి దేశాన్ని ప్రపంచంలోనే అగ్ర దేశాల్లో ఒకటిగా తయారు చేయాలన్నారు. ప్రజల ఆశీర్వాదం, ప్రేమ తనకు కావాలన్నారు. బహిరంగ సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, సోయం బాపూరావ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణకు పూర్తి సహకారం అందిస్తాం

తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని, రాష్ట్ర పౌరులు కన్న కలలను సాకారం చేసుకోవడానికి అవసరమైన సహాయాన్ని అన్ని విధాలుగా కేంద్రం అందిస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ.56 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తూ.. ఒక్క తెలంగాణకే కాకుండా యావత్ దేశానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి ఆదిలాబాద్ గడ్డ వేదికగా మారిందన్నారు. తెలంగాణ వంటి ప్రాంతాలపై ఇంతకు ముందు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారని ఆరోపించారు. 800 మెగావాట్ల ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో 85 శాతం విద్యుత్తును తెలంగాణకే సరఫరా చేస్తారని చెప్పారు. అంబారి - ఆదిలాబాద్ - పింపాలకుట్టి రైలు మార్గాల విద్యుదీకరణ పూర్తయిందని, ఆదిలాబాద్, ములుగు జిల్లాల్లో రెండు ప్రధానమైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్నివ్వడం ద్వారా లెక్కలేనన్ని ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని తెలిపారు. గడిచిన మూడు నెలల్లో 8.4 శాతం మేర భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిందని, ఇదే వేగంతో కొనసాగితే ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందని వ్యాఖ్యానించారు. గడిచిన పదేళ్లలో పరిపాలనలో కొత్త పంథాను అనుసరించిన సంగతిని గుర్తు చేశారు. దేశంలో 25 కోట్ల మందికిపైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, దీనికి కారణం ప్రభుత్వ సంక్షేమ పథకాలేనని చెప్పారు.

కేంద్రంతో ఘర్షణకు వెళ్లం

మోదీ పెద్దన్నలా సహకరించాలి

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు
ఆ తర్వాత అభివృద్ధిపైనే దృష్టి: రేవంత్

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్ర ప్రజలకే నష్టం కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రంతో ఎలాంటి ఘర్షణ వాతావరణానికి వెళ్లబోమని స్పష్టం చేశారు. కేంద్రంతో కలిసే ముందుకు వెళతామని, రాష్ట్రాభివృద్ధికి మోదీ పెద్దన్నలా సహకరించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, తర్వాత అభివృద్ధిపై దృష్టి సారిస్తామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించిన ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని రాకను రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 4000 మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించాల్సి ఉండగా, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పదేళ్లలో 1,600 మెగావాట్లకే పరిమితమైందని తప్పుబట్టారు. టీఎస్‌టీపీపీ రెండో దశను త్వరగా చేపట్టి పూర్తి చేయాలని కోరారు. 2,400 మెగావాట్ల స్టేజ్-2 నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. కొత్త యూనిట్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు, సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. పూర్తయిన 1600 మెగావాట్ల ప్లాంటు నుంచి 85 శాతం రాష్ట్రానికే కేటాయించడంతో రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీరుతాయన్నారు. ఎన్టీపీసీకి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. హైదరాబాద్ మెట్రో, మూసీ సుందరీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్‌భవన్‌లోనే రాత్రి బస

బేగంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ సోమవారం రాత్రి రాజ్ భవన్లోనే రాత్రి బస చేయనున్నారు. ఆదిలాబాద్‌లో విజయ సంకల్ప సభ తర్వాత చెన్నై వెళ్లి ఆయన.. రాత్రి 9.10 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో ఆయనకు గవర్నర్ తమిళిసై, ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో ఆయన రాజ్‌భవన్‌కు చేరుకున్నారు.



అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేస్తున్న ప్రధాని. చిత్రంలో గవర్నర్, సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి



రామోజీరావుతో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లారు. దాదాపు గంటకు పైగా రామోజీ రావుతో సీఎం పలు అంశాలను చర్చించారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, మారిన ప్రజాపాలన విధానాలపైనా మాట్లాడుకున్నారు. అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా లౌకికవాదాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

కాంగ్రెస్‌కు 46 శాతం ఓట్లు

- బీజేపీకి 30%, బీఆర్ఎస్‌కు 22%
- 12 లోక్‌సభ స్థానాల్లో పార్థాదాస్ సర్వే
- ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌కు 51%
- మోదీకి 38% మద్దతు ఉన్నట్లు వెల్లడి

హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు 46 శాతం ఓట్లు వచ్చే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకుడు పార్థాదాస్ తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12 లోక్‌సభ స్థానాల్లో తమ సంస్థ సర్వే చేయగా.. ఇందులో కాంగ్రెస్ 46 శాతం ఓట్లతో అగ్రస్థానంలో ఉండగా.. 30 శాతంతో బీజేపీ, 22 శాతంతో బీఆర్ఆస్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయని సోమవారం 'ఎక్స్'లో ఆయన ప్రకటించారు. రాష్ట్రంలోని మొత్తం పురుష ఓటర్లలో కాంగ్రెస్‌కు 42%, బీజేపీకి 34%, బీఆర్ఎస్‌కు 21% మంది అనుకూలంగా ఉండగా.. మహిళల్లో 50% మంది కాంగ్రెస్ వైపు, 26% బీజెపి, 23% బీఆర్ఎస్ వైపు ఉన్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీ వైపు 51% మంది మొగ్గుచూపుతుండగా.. నరేంద్ర మోదీకి 38%, ఇతరులకు 9%, కేసీఆర్‌కు 1శాతం మంది అనుకూలంగా ఉన్నారని తమ సర్వేలో తేలిందని పార్థాదాస్ తెలిపారు.

ఐబీ అధికారి ప్రణీత్‌రావు సస్పెన్షన్

బీఆర్ఎస్ హయాంలో విపక్ష నేతల ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు

గత ప్రభుత్వంలో స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుపై వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ పోలీసుశాఖ సోమవారం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈయన ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్‌కి సంబంధించి ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా ఉంటూ ప్రణీత్‌రావు అధికారాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. కాగా, ప్రణీత్‌రావు నేతృత్వంలోని ఓ బృందం ఏకంగా రాష్ట్ర డీజీపీ మీదనే నిఘా పెట్టినట్లు 2021లో అప్పటి విపక్షనేత రేవంత్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.

47 మంది డీఎస్పీల బదిలీ

పోలీస్‌శాఖలో డీఎస్పీల బదిలీల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే దశలవారీగా పెద్ద సంఖ్యలో డీఎస్పీల బదిలీలు జరిగాయి. తాజాగా సోమవారం మరో 47 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు వెయిటింగ్‌లో ఉన్నవారికి పోస్టింగ్స్ లభించక పోగా, ఇప్పటివరకు సస్పెన్షన్‌లో ఉన్న మరికొందరు డీఎస్పీలకు తాజా బదిలీల్లో పోస్టింగ్స్ లభించాయి.

ఓఆర్ఆర్–ఆర్ఆర్ఆర్ మధ్య డెయిరీ క్లస్టర్!

దేశవ్యాప్తంగా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం.. పాలు ఉన్న చోట ఆరోగ్యం, సంపద ఉంటుంది

- 'డెయిరీ ఇండస్ట్రీ' కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి



50వ డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యలో అనేక పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామని.. అందులో భాగంగా డెయిరీ క్లస్టర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. దేశం నలుమూలల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన 50వ డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్‌లో భట్టి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల హయాంలోనే దేశంలోనే శ్వేత విప్లవానికి నాంది పలికారన్నారు. పాడి పరిశ్రమను అసంఘటితరంగం నుంచి సంఘటిత రంగంలోకి తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. 'పాలు పొంగించండి.. సంపద పొందండి.. పాలు ఉన్నచోట ఆరోగ్యం, సంపద రెండూ ఉంటాయి. పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతం. పెట్టుబడులు పెట్టేవారికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న డ్వాక్రా మహిళలను పాడిరంగంలోకి వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం ఐకేపీ పథకాన్ని పునఃప్రారంభించి మహిళలకు వడ్డీలేని రుణాలు అందించబోతున్నామని ప్రకటించారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్తుందన్నారు. గత ప్రభుత్వం పశుసంవర్థక, మత్స్యరంగానికి 2023-24 బడ్జెట్‌లో రూ.1,863 కోట్లు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో రూ.2,002 కోట్లు కేటాయించిందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి.. ఆదిలాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు వెళ్లటంతో.. తన ద్వారా ఈ ప్రత్యేక సందేశాన్ని కాన్ఫరెన్స్‌లో అందించాలని పంపినట్లు భట్టి వెల్లడించారు.

పాల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేదు: తుమ్మల

పాల ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందుకు తగినట్లుగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమల అభివృద్ధికి ప్రైవేటు డెయిరీ సంస్థలు దోహదపడాలని కోరారు. రాష్ట్రంలో పాల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేదని, పాడి ఉత్పత్తిని పెంచాల్సిన అవసరముందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పాడి పరిశ్రమపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకోవటమే కాకుండా, దేశాన్ని పోషించే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. మధిర నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం భట్టి చొరవ తీసుకొని డ్వాక్రా మహిళలకు ఇంటికి ఒక గేదె లేదా ఆవును ఇచ్చి 'ఇందిర డెయిరీ' ఏర్పాటు చేసి గ్రామీణ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారని తుమ్మల కొనియాడారు.

7, 9 తేదీల్లో ఎలివేటర్ కారిడార్లకు శంకుస్థాపన

ఓల్డ్‌సిటీ మెట్రోకు 8న ముహూర్తం.. పనులను ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి కరీంనగర్, నిజామాబాద్ వెళ్లే రెండు కీలక రహదారులకు మహర్దశ పట్టనుంది. సికింద్రాబాద్ నుంచి స్టేట్‌హైవే-1(రాజీవ్ రహదారి), జాతీయ రహదారి-44పై ఎలివేటెడ్ కారిడార్ల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సికింద్రాబాద్‌లో స్టేట్‌హైవే-1 ఎలివేటెడ్ కారిడార్ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ కారిడార్ కార్ఖానా, తిరుమలగిరి మీదుగా వెళ్తుంది. అదేవిధంగా 9న సీఎం ఎన్‌హెచ్-44 ఎలివేటర్ కారిడార్ పనులకు సికింద్రాబాద్‌లో శంకుస్థాపన చేస్తారు. అంతకు ముందు బైరామల్‌గూడ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు.

నెరవేరనున్న పాతనగర మెట్రో కల

హైదరాబాద్ పాతనగర వాసుల మెట్రో కల నెరవేరబోతోంది. 12 ఏళ్లుగా కొనసాగిన నిరీక్షణ త్వరలో ఫలించనుంది. మహాత్మా గాంధీ బస్ స్టేషన్(ఎంజీబీఎస్) నుంచి ఫలక్‌నుమా వరకు పెండింగ్‌లో ఉన్న 5.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్ 8న శంకుస్థాపన చేయనున్నారు. నిజానికి 2012లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెట్రోరైలు ప్రాజెక్టును ప్రారంభించగా.. అప్పట్లో ఎల్‌బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం, జేబీఎస్-ఫలక్‌నుమా మార్గాలను ఎంపిక చేశారు. మొదటి రెండు కారిడార్లతోపాటు.. మూడో కారిడార్‌లో భాగంగా జేబీఎస్-ఎంజీబీఎస్ మధ్య ప్రస్తుతం 57 స్టేషన్లుండగా.. రోజుకు 1,028 సర్వీసులను కొనసాగిస్తున్నారు. కానీ, ఓల్డ్‌సిటీ మార్గానికి మాత్రం మోక్షం కలుగలేదు. జేబీఎస్ నుంచి ఫలక్‌నుమాకు 15 కిలోమీటర్ల మార్గం ఉండగా.. ఆ ప్రాజెక్టు ఎంజీబీఎస్‌కే నిలిచిపోయింది. అక్కడి నుంచి ఫలక్‌నుమా మధ్యలో మతపరమైన కట్టడాలు, ప్రార్థన మందిరాలు-- మొత్తం 103 కట్టడాలు ఉండడంతో.. అప్పట్లో వాటి తొలగింపు ప్రతిపాదనలపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో 5.5 కిలోమీటర్ల మేర పనులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ఓల్డ్‌సిటీ మెట్రోను పూర్తిచేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే మెట్రో విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ అంశంపై పలుమార్లు అధికారులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఓల్డ్‌సిటీలో పెండింగ్ పనులకు ఈ నెల 8న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఫలక్‌నుమా బస్‌డిపో సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మెట్రో అధికారులు వివరించారు. ఏడాదిన్నర కాలంలో ఈ కారిడార్ పూర్తవుతుందని పేర్కొన్నారు. అయితే.. ఈ 5.5 కిలోమీటర్ల నిర్మాణంలో జాప్యం వల్ల.. పెరిగిన ముడి సరుకు కారణంగా పనులకు రూ.2 వేల కోట్ల దాకా ఖర్చవుతాయని తెలిపారు. మొదటి దశలో నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే దారుల్‌షిఫా-పురానీహవేలీ-కోట్లఅలిజా-హరిబౌలి-శాలిబండ-శంషేర్‌గంజ్-అలియాబాద్ మీదుగా ఎలివేటెడ్ కారిడార్ ఉంటుందని మెట్రో అధికారులు వివరించారు. సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలక్‌నుమాల్లో స్టేషన్లు ఉంటాయన్నారు. పురాతన/వారసత్వ కట్టడాలు, ప్రార్థన మందిరాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్‌కు 120 అడుగుల రోడ్డు విస్తరణకు 1,100 ఆస్తులను సేకరించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

సీఎం రేవంత్ సుడిగాలి పర్యటనలు

హైదరాబాద్: సీఎం రేవంత్ ఈ వారమంతా సుడిగాలి పర్యటనల్లో బిజీగా గడపనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనుల ప్రారంభానికి బిజీ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. 7న ఆయన సికింద్రాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత బంజారాహిల్స్‌లో డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ భవన్‌ను ప్రారంభిస్తారు. అదేరోజు సాయంత్రం సిరిసిల్ల జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించి.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అక్కడి నుంచి వేములవాడ రాజన్న ఆలయానికి వెళ్తారు. అనంతరం వేములవాడలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో మాట్లాడుతారు. 8న పాతనగర మెట్రో రైల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అక్కడ కూడా బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 9న ఎల్‌బీనగర్ సమీపంలోని బైరామల్‌గూడలో నిర్మించిన ఫ్లైఓవర్‌ను.. ఆ తర్వాత ఉప్పల్ నల్లచెరువు వద్ద ఎస్టీపీని ప్రారంభిస్తారు. జాతీయ రహదారి-44పై ఎలివేటెడ్ కారిడార్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 11న సీఎం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో పర్యటిస్తారు. భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న తర్వాత పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. బూర్గంపాడులో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారు. ఈ నెల 12న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మహిళా సదస్సులో పాల్గొంటారు.

మూడు పీఆర్‌సీలు కోల్పోయాం

- న్యాయం చేయండి.. సీపీఎస్ రద్దు చేయండి
- పీఆర్‌సీ కమిషన్‌కు ఉద్యోగ సంఘాల వినతులు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సరైన సమయానికి పీఆర్‌సీ వేయకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మూడు పీఆర్‌సీలను కోల్పోవాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రెండో పే రివిజన్ కమిషన్‌కు(పీఆర్‌సీ) సోమవారం పలు ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందించాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని పీఆర్‌సీ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ పి.శివశంకర్‌కు అందజేశారు. కనిష్ఠ వేతనం రూ.32 వేలు, గరిష్ఠ వేతనం రూ.2,95,460 ఉండాలని, 40 శాతం ఫిట్‌మెంట్ కలిపి వేతన స్కేలు నిర్ణయించాలని కోరారు. రెండవ పీఆర్‌సీలో అయినా సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పీఆర్‌సీ కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. గత అయిదేళ్లలో రాష్ట్ర జీఎస్‌డీపీ జాతీయ సగటు కన్నా 60.3 శాతం అభివృద్ధి సాధించినందున ఆమేరకు ఉద్యోగుల వేతనాలు పెరగాల్సిన అవసరం ఉందని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను కోరారు. ఇంటి అద్దె భత్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని కోరారు. కనిష్ఠ వేతనం రూ.35 వేలు, 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని 2023 జూలై 1 నుంచి అమలయ్యేలా ప్రభుత్వానికి నివేదిక అందించాలని పీఆర్‌సీ కమిషన్‌ను పీఆర్‌టీయూటీఎస్ కోరింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ చైర్మన్‌ను కలిశారు. తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఇచ్చిన నివేదికలో పదోన్నతులు రావడం కష్టంగా మారుతున్నందున ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను 5, 10, 15, 20, 25 సంవత్సరాలుగా సవరించాలని కోరింది. రాష్ట్ర అధ్యక్షుడు సి.జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్.నర్సింహులు నేతృత్వంలో పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులు సాధారణ కేటగిరీల్లో వేతనాలు పొందేలా స్థిరీకరణ చేయాలని కోరుతూ పేరివిజన్ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు మహేశ్, కార్యదర్శి విజయ్ కుమార్ కోరారు. వారు సోమవారం శివ

కేసీఆర్, కేటీఆర్ కొలువులు ఊడినందునే..

మీకు ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి తెలిపారు. కోడ్ ముగియగానే.. మిగతావారి ఇళ్లకు నియామక పత్రాలు పంపుతామని వెల్లడించారు. ఎల్బీస్టేడియం చరిత్రలో నిలిచిపోతుందని.. ఎందుకంటే 3 నెలల కాలంలోనే తాను ఈ స్టేడియంలో 30 వేల మందికి నియామక పత్రాలు అందించానని పేర్కొన్నారు. తాను ఈ కార్యక్రమం చేస్తున్నది ప్రచారం కోసం కాదని.. ఆత్మహత్య బాట పడుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు విశ్వాసం, నమ్మకం కల్పించేందుకేనని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడిందని, కొందరు ఆత్మ బలిదానాలు చేసుకొని అమరులై తెలంగాణ సాధించారని.. తమ ఆత్మ బలిదానాలతో భవిష్యత్ తరాలకు ఉద్యోగాలు వస్తాయని వారంతా విశ్వసించారని పేర్కొన్నారు. ఆ బలిదానాలతో సాధించిన తెలంగాణలో.. గత ప్రభుత్వం అమరుల స్ఫూర్తికి విరుద్ధంగా లాభార్జన కోసం, ధనదాహం తీర్చుకోవడానికే పని చేసినట్టు విమర్శించారు. గత పాలకులు ఫాంహౌజ్ మత్తులో ఉంటూ పాలన నడిపారని.. లక్షలాది యువకుల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యారని రేవంత్ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియదని, ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరికేవని, ప్రశ్నపత్రాల మూల్యాంకనం సరిగ్గా ఉండేది కాదని ధ్వజమెత్తారు. విసిగిపోయిన యువత ముందుకు వచ్చి.. తండ్రి, కొడుకు, అల్లుడు, కుమార్తె (కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత) ఉద్యోగాలు ఊడగొట్టడంతోనే తాము అధికారంలోకి వచ్చామని.. ఉద్యమ ఆకాంక్షల మేరకు నియామకాలు చేపడుతున్నామని తెలిపారు.

ఉత్తమ పౌరులను తయారుచేయండి..

తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నానని, ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యానంటే.. ప్రభుత్వ పాఠశాలలో అందించిన విద్యే కారణమని సీఎం పేర్కొన్నారు. తాను గుంటూరులోనో, గుడివాడలోనో చదువుకోలేదని.. అక్కడ చదువుకున్న కొందరు తనకు ఇంగ్లిష్ రాదని అవహేళన చేస్తున్నారని.. కానీ, చైనా, జపాన్, జర్మనీ వారికి ఇంగ్లిష్ రాకున్నా ప్రపంచంతోనే పోటీపడే ఉత్పత్తులను ఆ దేశాలు అందిస్తున్నాయని గుర్తు చేశారు. ఇంగ్లిష్ అనేది ఓ భాష మాత్రమేనని.. ఉద్యోగం, ఉపాధి కల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. "మీదగ్గర చదువుకునే పిల్లలకు ఇంగ్లిష్ రాదంటూ అవహేళన చేసే పరిస్థితిని రానివ్వద్దు" అని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే.. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు ఇచ్చామని చెబుతున్న గత పాలకులు వాటిలో ఎక్కడైనా మౌలిక వసతులు కల్పించారా అని రేవంత్ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అన్ని గురుకులాలు ఒకే చోట ఉండాలన్న లక్ష్యంగా రాష్ట్రంలో తొలిసారి కొడంగల్‌లో మోడల్ గురుకుల పాఠశాల తీసుకురావాలని నిర్ణయించామన్నారు. అక్కడ 25 ఎకరాల్లో రూ.150 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాన్ని ఏర్పాటు చేస్తున్నామని, 119 నియోజకవర్గాల్లో అవకాశం ఉన్న చోట ఈ నమూనా క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఆయన తెలిపారు.

ఉద్యోగాలడిగితే గొర్రెలు.. బర్రెలు..

గత ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట 6 వేల పాఠశాలలను మూసేసి.. దళితులు, గిరిజనులు, వెనుకబడిన ప్రాంతాల్లోని పిల్లలకు విద్యను దూరం చేసిందని సీఎం ఆరోపించారు. "బర్రెలు కాసుకునే వారు బర్రెలు కాసుకోవాలె, గొర్రెలు పెంచుకునే వారు గొర్రెలు కాసుకోవాలె, చేపలు పట్టుకునే వారు చేపలు పట్టుకోవాలె అనేలా పథకాలు తీసుకొచ్చింద'ని మండిపడ్డారు. తాతలు, తండ్రులు గొర్రెలు కోస్తే, బర్రెలు కాస్తే, చెప్పులు కుడితే.. మన పిల్లలూ అవే పనులు చేయాలా అని ఆయన ప్రశ్నించారు. గత ముఖ్యమంత్రి మనవడు పెంచుకున్న కుక్క చనిపోతే వెటర్నరీ డాక్టర్‌పై కేసు పెట్టి లోపలేశారని, మరి ఉద్యోగాలు రాక వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారిని (నాటి పాలకులను) ఉరి వేయాలా వద్దా అని ప్రశ్నించారు. "వారి పెంపుడు కుక్కకున్న విలువ.. పేదల ప్రాణాలకు లేదా" అని నిలదీశారు. తాము వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని.. మెగా డీఎస్సీ ద్వారా 11,604 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయబోతున్నామని పేర్కొన్నారు. మూడు నెలల తమ పరిపాలనను అంచనావేసి.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు.



ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు

నవీన్‌ను ఆదుకుంటాం: సీఎం

అరుదైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నవీన్‌ను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. ఎక్స్ (ట్విటర్)లో తనను ట్యాగ్ చేస్తూ వచ్చిన ఒక సందేశానికి ఆయన స్పందించారు. ఈ మేరకు చిన్న వయసులోనే అరుదైన క్యాన్సర్‌తో పోరాడుతున్న నవీన్ సమస్య తన దృష్టికి వచ్చిందని, వెంటనే అతని కుటుంబ సభ్యుల్ని సంప్రదించి, చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించానని తెలిపారు. ప్రభుత్వమే అన్ని ఖర్చులను భరించి చికిత్సకు అన్ని ఏర్పాట్లను చేస్తుందన్నారు. నవీన్‌కు పూర్తిగా నయమయేంతవరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందిగా నిమ్స్ వైదులకి సూచించినట్టు పేర్కొన్నారు. కాగా, హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్స పొందుతున్న నవీన్‌కు సర్జరీ చేయాలని వైద్యులు సూచించారని, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని, కానీ ఆ శస్త్రచికిత్స ఆరోగ్యశ్రీలో లేదని, సహాయం చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌కు ఒకరు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

తీపి ఉర్దూలో.. శుష్క వాగ్దానాలతో ముస్లింలకు కేసీఆర్ మోసం

- మెట్రో రైలు మార్గం విస్తరణతో.. చిత్తశుద్ధిని నిరూపించుకున్న రేవంత్
- తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తెలంగాణలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ముస్లింలను మోసం చేస్తూ కాలం గడిపిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ విమర్శించారు. కేవలం ఆకర్షణీయమైన నినాదాలు, అనర్గళంగా ఉర్దూ భాషా పలుకులతో తెలంగాణ ముస్లింలను తండ్రి(కేసీఆర్), కొడుకు, బిడ్డ మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు మజ్లిస్ పార్టీ తోడయిందని మండిపడ్డారు. సౌదీ అరేబియాలో ఉన్న షబ్బీర్ అలీ సోమవారం మాట్లాడుతూ.. బలహీన, మైనార్టీ వర్గాల నుంచి నాయకత్వం ఎదగకుండా బీఆర్ఎస్ కుట్ర చేసిందని, అందులో భాగంగానే ఆయా వర్గాల వారికి ఎన్నికల్లో ఆ పార్టీ టికెట్లు ఇవ్వలేదని ఆరోపించారు. హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధి అంటూ మజ్లిస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి దశాబ్దకాలం నాటకం ఆడాయని మండిపడ్డారు. పాతబస్తీలో మెట్రో రైలు మార్గాన్ని విస్తరించకుండా ఆ పార్టీలు జాప్యం చేశాయని ఆరోపించారు. చిత్తశుద్ధి కలిగిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నగరంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసే విధంగా హైదరాబాద్ మెట్రో రైలును అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తోందన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని కల్పించేందుకు తొలిదశలో రూ.2 వేల కోట్ల అంచనా వ్యయం కలిగిన పనులకు ఈ నెల 8వ తేదీన సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు షబ్బీర్ అలీ వెల్లడించారు. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన ఈ మార్గం ద్వారా విమానాశ్రయానికి రవాణా మరింత సులభతరం కావడమే కాకుండా అందరికీ మెట్రో రైలు అందుబాటులో వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని పాతబస్తీతో సహా అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణం జరిగిందని, పాతబస్తీ అభివృద్ధి చెందిందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మెట్రో రైలు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదనపు అడ్వకేట్ జనరల్ సహా ప్రభుత్వ ప్లీడర్ల నియాకంలో ముస్లింలకు ప్రాధాన్యం ఇచ్చిందని ఆయన తెలిపారు.

హస్తంగూటికి రామగుండం, బండ్లగూడ మేయర్లు

- 18 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా..
- కాంగ్రెస్‌లోకి పరకాల మునిసిపల్ చైర్‌పర్సన్

గోదావరిఖని/నార్సింగ్/హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన పెద్దపల్లి జిల్లా రామగుండం, హైదరాబాద్ శివారు బండ్లగూడ మునిసిపల్ కార్పొరేషన్ల మేయర్లు కాంగ్రెస్‌లో చేరారు. వారితో పాటు రెండు కార్పొరేషన్లకు చెందిన 18 మంది కార్పొరేటర్లు కూడా హస్తం గూటికి వెళ్లారు. సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌ల సమక్షంలో రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో పాటు 15 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీపాదాస్ మున్షీ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మేయర్‌తో పాటు కార్పొరేటర్లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. మరోవైపు.. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అనుచరులు, బండ్లగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో పాటు కార్పొరేటర్లు శ్రీలత సురేశ్‌గౌడ్, సాగర్‌గౌడ్, పద్మావతి పాపయ్య యాదవ్, బీఆర్ఎస్ మునిసిపల్ శాఖ అధ్యక్షుడు గోకరి సురేశ్‌గౌడ్ తదితరులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఆ తర్వాత దీపాదాస్ మున్షీ సమక్షంలో వారంతా కాంగ్రెస్‌లో చేరారు. కాగా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన హనుమకొండ జిల్లా పరకాల మునిసిపల్ చైర్‌పర్సన్ అనితరామకృష్ణతో పాటు పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో దీపాదాస్ మున్షీ సమక్షంలో వారంతా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

మోత్కూరు మునిసిపాలిటీ హస్తగతం

మోత్కూరు/మహబూబాబాద్ టౌన్, మార్చి 4: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. మునిసిపాలిటీలో మొత్తం 12మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో చైర్‌పర్సన్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అవిశ్వాసంతో ఖాళీ అయిన చైర్‌పర్సన్ స్థానానికి భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్ ప్రిసైడింగ్ అధికారిగా సోమవారం ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా 11వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ గుర్రం కవితను బీఆర్ఎస్ 1వ వార్డు కౌన్సిలర్ వెంకన్న ప్రతిపాదించగా, బీఆర్ఎస్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య బలపర్చారు. ఒకే అభ్యర్థి పోటీలో ఉండడంతో సమావేశానికి హాజరైన 10మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌గా కవితను ఎన్నుకున్నారు. ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ కవితతో ప్రిసైడింగ్ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు..

మానుకోట మునిసిపల్ వైస్‌చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

మహబూబాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి అలివేలు ప్రకటించారు. 35 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులైన ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుతో కలిపి మొత్తం 38 మంది ఉండగా.. సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అవిశ్వాసానికి అనుకూలంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావుతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్లు 30 మంది ఓటు వేశారు.

వాటాలు తేలేదాకా ప్రాజెక్టులు అప్పగించం

- స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నీటి వాటాలు తేలేదాకా కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేది లేదని తెలంగాణ స్పష్టం చేసింది. ఈ మేరకు గతనెల 12న అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా లేఖ ద్వారా పంపారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించరాదని అసెంబ్లీ తీర్మానం చేసిందని ఆయన గుర్తు చేశారు. కాగా, కృష్ణాబోర్డు నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సభ్యుడిగా ఆర్.ఎస్.శంఖువను నియమిస్తూ కేంద్ర జలశక్తిశాఖ నిర్ణయం తీసుకుంది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఇంటి వద్దకే శివయ్య ప్రసాదం!

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా తెలంగాణలోని ప్రముఖ శివాలయాల ప్రసాదాన్ని నేరుగా భక్తుల ఇంటి వద్దకే అందించేందుకు దేవదాయశాఖ ఏర్పాట్లు చేసింది. మీ-సేవా కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో భక్తులకు శివయ్య ప్రసాదం అందించే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి, కీసర గుట్ట రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఏ ఆలయం నుంచి ప్రసాదం కావాలనుకున్నా.. భక్తులు మీ-సేవా కేంద్రంలో రూ.225 చెల్లిస్తే స్వామివారి ప్రసాదాన్ని ఇంటికే పంపిస్తారు. మహా శివరాత్రి వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్ అవినీతిపై కేంద్రం దర్యాప్తు చేయదేం?

- నీటి వాటా తేల్చకుండా ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదు:జూపల్లి

సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో మందిని అరెస్ట్ చేయించిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, దోపిడీపై మాత్రం ఎందుకు దర్యాప్తు చేయించలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలది అవినీతి, బంధుప్రీతి అంటూ ఆదిలాబాద్ పర్యటనలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఎందుకు విచారణ చేయడంలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తెలిసీ కేంద్రం ఎందుకు దర్యాప్తు చేయించలేదో సమాధానం చెప్పాలన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను తేల్చకుండా కేంద్రం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. నీటి వాటాను తేల్చకుండా రాష్ట్ర ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు బీజేపీకిలేదన్నారు. కేసీఆర్ కుటుంబానిది అవినీతి, బంధుప్రీతి అంటే ఓ అర్థం ఉందని... గాడిదను, గుర్రాన్ని ఒకే గాటన కట్టడం సరికాదన్నారు.

నాగర్‌కర్నూల్ టికెట్ నాకే: మల్లు రవి

లోక్‌సభ ఎన్నికల్లో నాగర్ కర్నూలు నుంచి తన అభ్యర్థిత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టతతో ఉన్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. ఈ విషయాన్ని సీఎం తనకు తెలిపారని వెల్లడించారు. అయితే కాంగ్రెస్‌లో అభ్యర్థుల ఎంపికకు ప్రదేశ్ ఎన్నికల కమిటీ మొదలుకుని కేంద్ర ఎన్నికల కమిటీ వరకు ఒక ప్రక్రియ ఉంటుందని, అది పూర్తయిన తర్వాత నాగర్ కర్నూలు టికెట్ తనకు వస్తుందని మల్లు రవి నమ్మకం వ్యక్తం చేశారు.

యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్‌పై వేటు

యాదాద్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎ. భాస్కర్‌రావు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించినందున ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఉన్న ఆయన అదే నియోజకవర్గంలో మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం పనిచేసిన విషయాన్ని దాచిపెట్టారని, బదిలీని తప్పించుకునేందుకు ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చినందున సస్పెండ్ చేస్తున్నామని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అదనపు కలెక్టర్ ఎక్కడికీ వెళ్లకూడదని ఆదేశించారు. కాగా, ప్రభుత్వ ఉత్తర్వులపై అదనపు కలెక్టర్ ఎ. భాస్కర్‌రావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. జిల్లాలో పనిచేసిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదించి వాటిని పరిశీలించాలని కోరినట్లు సమాచారం.

రిజర్వేషన్ అభ్యర్థులకు..

ఇంటర్‌లో 40% వచ్చినా ఎస్‌జీటీకి అర్హత

- గతంలో 45% మార్కులు తప్పనిసరి
- బీఈడీ, డీఈడీ చదువుతున్న వారూ.. దరఖాస్తులకు అర్హులే.. పాత సిలబస్‌తోనే పరీక్షలు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు పోటీ పడే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు శుభవార్త..! ఈ కేటగిరీ వారికి ఇంటర్‌లో అర్హత మార్కుల శాతాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు టీచర్ పోస్టుల భర్తీకి విధివిధానాలను రూపొందించింది. జిల్లాల వారీగా రోస్టర్ పాయింట్లను.. సబ్జెక్టుల వారీగా పోస్టుల సంఖ్యను ప్రకటించింది. పాత సిలబస్ ప్రకారమే డీఎస్సీని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తొలిరోజు 500 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఎస్‌జీటీ పోస్టులకు పోటీ పడే అభ్యర్థులకు ఇంటర్‌లో కనీస అర్హత మార్కులు జనరల్ కేటగిరీకి 50%, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 45శాతంగా ఉండేది. తాజా మార్గదర్శకాల్లో రిజర్వేషన్ కేటగిరీ(ఎస్సీ, ఎస్టీ, బీసీ)కి ఇంటర్‌లో అర్హత మార్కులను 40శాతానికి తగ్గించారు. ఇక స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) పోస్టులకు పోటీపడే అభ్యర్థులు జనరల్ కేటగిరీకి 50%, రిజర్వేషన్ కేటగిరీకి 45% మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం బీఈడీ, డీఈడీ వంటి ఉపాధ్యాయ కోర్సులను చదువుతున్న వారికీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చారు. అయితే.. వీరంతా ఇప్పటికే టెట్‌లో అర్హత సాధించి ఉండాలి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నాటికి వీరు బీఈడీ/డీఈడీ పూర్తిచేసి ఉండాలి.

త్వరలో ఎడిట్ ఆప్షన్!

ఇప్పటికే డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఒకట్రెండు రోజుల్లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. గత నోటిఫికేషన్ ప్రకారం వీరంతా దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో సొంత జిల్లాల్లో పోస్టులు తక్కువగా ఉన్నవారు పక్క జిల్లాల్లో పోస్టులకు దరఖాస్తులను సమర్పించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు ఇప్పుడు మరోమారు అప్లై చేయాల్సిన అవసరం లేదు. అయితే.. సొంత జిల్లాల్లో పోస్టులు పెరిగిన నేపథ్యంలో.. గత దరఖాస్తులో అభ్యర్థులు మార్పులు చేయడానికి సాఫ్ట్‌వేర్ అనుమతించడం లేదు. అలాంటి వారికి ఎడిట్ ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు పేర్కొన్నారు.

సీఎం గారు.. మాకు ఉద్యోగాలు ఇప్పించండి

- గురుకుల పోస్టులకు ఎంపికైనా హోల్డ్‌లో పెట్టారంటూ 'బీటెక్ బీఈడీ' అభ్యర్థుల ఆవేదన

పంజాగుట్ట: 'కష్టపడి బీటెక్ చదివాం.. టీచర్ కావాలనే ఆశతో బీఈడీ చేశాం. ప్రభుత్వం నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసి ఎంపికయ్యాం. కానీ మమ్మల్ని హోల్డ్‌లో పెట్టారు. సీఎం గారు స్పందించి మాకు ఉద్యోగాలిచ్చి ఆదుకోండి' అని బీటెక్ బీఈడీ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీటెక్, బీఈడీ చదివి ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన రాఘవేంద్ర, అపర్ణ, వినీత, శివానీ రాథోడ్ తదితరులు మాట్లాడారు. గురుకుల ఉపాధ్యాయ నియామక పరీక్షలో బీటెక్, బీఈడీ అభ్యర్థులు 97 మంది ఎంపికైనట్లు చెప్పారు. కొలువు వచ్చిందన్న సంతోషంలో ఉండగానే అందరినీ హోల్డ్‌లో పెట్టారన్నారు. మిగతా వారికి సోమవారం ఎల్బీ స్టేడియంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారని, రేవంత్ ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని కోరారు.

ఆకాశం నుంచి ఊడిపడ్డ పెట్టె!

- అది ఎవరి దగ్గరుంటే వారి జీవితాల్లో అద్భుతాలు
- పథకం ప్రకారం జనాన్ని నమ్మిస్తున్న కేటుగాళ్లు
- రూ.50 కోట్లకు వరంగల్‌లో వ్యక్తికి అమ్మేందుకు స్కెచ్
- జనగామ జిల్లా పెంబర్తి వద్ద పట్టుబడిన ముఠా

జనగామ టౌన్, మార్చి 4: అదో మామూలు పెట్టె! ఆ కేటుగాళ్లు ఏం మాయ చేశారో కానీ దానికి ఉన్న చిన్న అయిస్కాంతం ముక్కను తొలగిస్తే ఆ పెట్టె చిన్నగా వైబ్రేట్ అవుతోంది. పెట్టెకు ఓ బీడీ స్టిక్ తగిలిస్తే నిప్పు రవ్వలొస్తున్నాయి!! ఇదంతా చూపించి.. అదో మహిమ గల పెట్టె అని, ఆకాశం నుంచి ఊడిపడిందంటూ జనాన్ని నమ్మించి వసూళ్లకు పాల్పడ్డారు. దాని ధరను రూ.50 కోట్లు అని చెప్పి, ఓ వ్యక్తికి అంటగట్టే ప్రయత్నాల్లో ఉండగా జనగామ జిల్లా పెంబర్తి వద్ద పోలీసులకు దొరికిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూరు గ్రామానికి చెందిన కేతావత్ శంకర్, నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంఘం బండ గ్రామానికి చెందిన ఖాసిం, వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన మహమ్మద్ అజార్, నల్లగొండ జిల్లా దిండి మండలం దేవత్‌పల్లి తండాకు చెందిన కొర్ర సాసిరాం హైదరాబాద్‌లో కూలీ పనులకు వెళుతుంటారు. ఈ నలుగురు కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే పథకంతో ఓ పెట్టె కొన్నారు. ఆకాశం నుంచి ఉల్కలు తెగిపడ్డప్పుడు ఈ పెట్టె తమకు దొరికిందని, దానికి అద్భుతమైన శక్తులు ఉన్నాయని, అది ఎవరి దగ్గర ఉంటే వారు ఐశ్వర్యవంతులవుతారని చాలా మందిని నమ్మించారు. దానికో రేటు ఫిక్స్ చేసి.. టోకెన్ అమౌంట్ పేరు లక్షల్లో వసూలు చేశారు. తర్వాత వారి నుంచి ఎప్పటికప్పుడు తప్పించుకొని తిరుగుతున్నారు. తాజాగా ఆ పెట్టెకు రూ.50 కోట్ల ధర నిర్ణయించి.. వరంగల్‌లో ఓ వ్యక్తికి అమ్మేందుకు సిద్ధమయ్యారు. సోమవారం హైదరాబాద్ నుంచి నలుగురు కలిసి ఆ పెట్టెను పట్టుకొని ఆటోలో బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పెంబర్తి వై జంక్షన్ వద్ద ఎస్సై సృజన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసి నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు.



నిందితులు ఉపయోగించిన పెట్టె

యువతిని వేధిస్తున్న యువకుడి హత్య

- కత్తితో యువతి కుటుంబసభ్యులపై దాడికి యత్నం
- ఎదురుదాడిలో అక్కడిక్కడే మృతి

మల్యాల, మార్చి 4: ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానంటూ యువతిని మూడేళ్లుగా వేధిస్తున్న ఓ యువకుడు చివరికి యువతి కుటుంబసభ్యుల దాడిలో హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన ఓ యువతిని పెగడపల్లికి చెందిన బోగ మహేశ్ (27) అనే యువకుడు మూడేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ పెళ్లి చేసుకోవాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో రెండేళ్ల క్రితం పోలీస్‌స్టేషన్‌లో యువకుడిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కొద్ది రోజులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా తీరు మార్చుకోని మహేశ్ ఇటీవల మళ్లీ యువతిని వేధిస్తుండడంతో ఆమె కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది మనసులో పెట్టుకున్న మహేశ్ ఆగ్రహంతో సోమవారం యువతి ఇంటిపైకి కత్తితో దాడికి వెళ్లాడు. అక్కడ మహేశ్‌కు యువతి కుటుంబసభ్యులకు మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. అక్కడే ఉన్న యువతి తల్లితో పాటు తాతపై మహేశ్ కత్తితో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో యువతి కుటుంబసభ్యులందరూ మూకుమ్మడిగా మహేశ్‌పై బండరాయితో ఎదురుదాడి చేయడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మహేశ్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన యువతి తల్లి, తాతను చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి పంపించారు.



మహేశ్ (ఫైల్ ఫొటో)

'టానిక్' ఎలైట్‌లో అధికారుల సోదాలు

- దాని అనుబంధ 11 'క్యూ' షాపుల్లోనూ తనిఖీలు
- 'వ్యాట్' ఎగవేత కోణంలో దర్యాప్తు
- ఆహార పదార్థాలు, మిక్సింగ్ సోడాల జీఎస్టీపైనా ఆరా
- ఇవి బీఆర్ఎస్ నాయకుల సన్నిహితులవే

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36లో గల 'టానిక్' ఎలైట్ వైన్ షాపులో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సోమవారం సోదాలు చేపట్టారు. 'టానిక్'కు అనుంబంధంగా ఉన్న మరో 11 'క్యూ' వైన్ షాపుల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైన ఈ సోదాలు రాత్రి 9 గంటల వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి తెప్పించుకుంటున్న ఫారెన్ లిక్కర్‌పై విలువ ఆధారిత పన్ను(వ్యాట్)ను చెల్లిస్తున్నారా లేదా, ఆల్కహాల్ రహిత మిక్సింగ్ సోడాలు, ఇతర ద్రవ పదార్థాలు, ఆహార పదార్థాలపై జీఎస్టీని చెల్లిస్తున్నారా లేదా అన్న కోణంలో సోదాలు చేపట్టినట్లు తెలిసింది. కొన్ని రకాల 'డ్రాట్ బీర్' (అప్పటికప్పుడు తయారు చేసి ఇచ్చేది)కు పన్ను చెల్లిస్తున్నారా లేదా అన్నదానిపైనా వివరాలు సేకరిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనరేట్ నుంచి వెళ్లిన ఒక జేసీ ఆధ్వర్యంలో ఒక డీసీటీఓ, ఆరుగురు ఏసీటీఓలు ఈ తనిఖీలు చేపట్టారు. టానిక్‌కు రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా, ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచైనా రకరకాల మద్యం బ్రాండ్లను తెప్పించుకునే వెసులుబాటు ఉందని ఎక్సైజ్ అధికారులు వివరిస్తున్నారు. సాధారణంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యంపై 70 శాతం మేర వ్యాట్‌ను విధిస్తుంది. ఆల్కహాల్ లేని సోడాలు, ఇతర మిక్సింగ్ డ్రింకులు, కొన్ని రకాల ఆహార పదార్థాలకు జీఎస్టీ చెల్లించాల్సి ఉంది. ఈ చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా, లేదా అని ఆరా తీస్తున్నారు. టానిక్ యజమానులు నగరంలోని కొన్ని మద్యం షాపులకు ఫ్రాంచైజీ ఇస్తున్నారు. ఇలాంటి షాపులకే 'క్యూ బై టానిక్' అని పేరు పెట్టి మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ క్యూ షాపులు నగరంలోని హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, బోయినపల్లి, ఎల్బీ నగర్, ఉప్పల్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వంటి 11 చోట్ల ఉన్నాయి. వీటిలో కూడా అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

బీఆర్ఎస్ హయాంలో లైసెన్సులు

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ టానిక్‌కు 'ఏ-4 ఎలైట్ వైన్ షాపు' కింద అనుమతి ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఇలాంటి ఎలైట్ వైన్ షాపులు, ఎలైట్ బార్లు ఉండవు. ఇది ఎక్సైజ్ పాలసీకి విరుద్ధమని, ముందస్తుగా నోటీసు చేసి, అనుమతులు ఇస్తే తమకు అభ్యంతరం లేదంటూ అప్పట్లోనే సాధారణ వైన్ షాపుల యజమానులు నిరసన వ్యక్తం చేశారు. అయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం లైసెన్సును మంజూరు చేసింది. టానిక్ యజమానులు బీఆర్ఎస్ పార్టీ పెద్దలకు సన్నిహితులు కావడంతోనే అనుమతులు ఇచ్చారంటూ అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. యజమానుల్లో ఒకరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే... టానిక్ యాజమాన్యం కూడా మారినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 5 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

ఆంధ్రప్రదేశ్ గురుకులాల్లో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ సెట్

గుంటూరులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఆర్‌ఈఐఎస్) - ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏపీఆర్‌జేసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 జనరల్ కేటగిరీ, 3 మైనారిటీ కేటగిరీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. మైనారిటీ కాలేజీల్లో ఉర్దూ మీడియం కూడా ఉంది. ట్యూషన్ ఫీజు ఉండదు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అకడమిక్ యాక్టివిటీస్‌తోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తారు. విద్యార్థులకు అవసరమైన ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, డిజిటల్ క్లాసెస్, రీడింగ్ రూమ్‌లు, ప్లే గ్రౌండ్‌లు అందుబాటులో ఉంటాయి. ఐఐటీ/నీట్/సీఏ-సీపీటీ ఎగ్జామ్స్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. 15 నుంచి 20 మంది విద్యార్థులను ఒక గ్రూప్‌గా చేసి వారి సంరక్షణ కోసం ఒక లెక్చరర్‌ను లోకో-పేరెంట్‌గా నియమిస్తారు.

సీట్ల వివరాలు

ఆంధ్ర రీజియన్ గురుకులాలు(జనరల్)

- విజయనగరం జిల్లా-తాటిపూడి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 12, సీఈసీ 15, ఈఈటీ 10, సీజీటీ 11 సీట్లు; బాలికలకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 13, సీఈసీ 15, ఈఈటీ 11, సీజీటీ 10 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునాసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 68, బైపీసీ 51, ఎంఈసీ 42, సీఈసీ 39 సీట్లు ఉన్నాయి.
- తిరుపతి జిల్లా-వెంకటగిరి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.

రాయలసీమ రీజియన్ గురుకులాలు(జనరల్)

- కర్నూలు జిల్లా బనవాసి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- అన్నమయ్య జిల్లా-గ్యారంపల్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- శ్రీ సత్యసాయి జిల్లా-కొడిగెనహళ్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 50, బైపీసీ 30, ఎంఈసీ 25, సీఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఈఈటీ 5, సీజీటీ 5 సీట్లు; బాలికలకు ఈఈటీ 4, సీజీటీ 4 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునాసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 12, బైపీసీ 9, ఎంఈసీ 3, సీఈసీ 6 సీట్లు ఉన్నాయి.

మైనారిటీ గురుకులాలు

- గుంటూరు, కర్నూలు జిల్లాల్లో బాలుర గురుకులాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా-వాయల్పాడులో బాలికల గురుకులం ఉంది. ఒక్కో గురుకులంలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకుగాను ఒక్కోదానిలో మైనారిటీలకు 32, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2 సీట్లు; సీఈసీలో మైనారిటీలకు 28, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఈ గురుకులాల్లో ప్రవేశానికి ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసే రాష్ట్ర విద్యార్థులందరూ(బాలురు, బాలికలు) దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు మొదటిసారే ఉత్తీర్ణులు కావాలి. జనరల్ అభ్యర్థులకు 60 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు రావాలి. అభ్యర్థులందరికీ ఇంగ్లీష్‌లో కనీసం 40 శాతం మార్కులు ఉండాలి. గత సంవత్సరాల్లో పదోతరగతి పూర్తిచేసినవారు ప్రస్తుతం దరఖాస్తుకు అనర్హులు. పదోతరగతి స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా చదివినవారు మాత్రమే ఉర్దూ మీడియంలో చేరేందుకు అర్హులు.

ఏపీఆర్‌జేసీ సెట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ/ఈఈటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ/సీజీటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, బయో సైన్స్ ఫిజికల్ సైన్స్; ఎంఈసీ/సీఈసీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్; ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు.

ఎంపిక వివరాలు

- జనరల్ కేటగిరీ గురుకులాల్లో చేరే విద్యార్థులు; మైనారిటీ గురుకులాల్లో చేరాలనుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు మాత్రమే పరీక్ష రాయాలి. పరీక్షలో సాధించిన మెరిట్ ప్రకారం విద్యార్థులను 1:5 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేసి కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. ఆంధ్ర, రాయలసీమ రీజియన్లకు విడివిడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. స్థానికత, రిజర్వేషన్ నిబంధనలు, స్పెషల్ కేటగిరీ రిజర్వేషన్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్స్ ఇస్తారు.
- మైనారిటీ వర్గాల విద్యార్థులు ఏపీఆర్‌జేసీ సెట్ రాయనవసరం లేదు. వీరికి పదోతరగతిలో సాధించిన మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

ఏపీఆర్‌జేసీ సెట్ రాసే విద్యార్థులకు:

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 17 నుంచి
- **ఏపీఆర్‌జేసీ సెట్ తేదీ:** ఏప్రిల్ 25
- **ఫలితాలు విడుదల:** మే 14
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** మే 20, 21, 22
- **సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్:** మే 28, 29, 30
- **థర్డ్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూన్5, 6, 7

మైనారిటీ విద్యార్థులకు:

- దరఖాస్తు ఫీజు లేదు
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మే 1 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఎంపికైన విద్యార్థుల మొదటి లిస్ట్ విడుదల:** మే 21
- **రెండో లిస్ట్ విడుదల:** మే 31
- **మూడో లిస్ట్ విడుదల:** జూన్ 11
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in



సీఎంఐలో మేథ్స్ ప్రోగ్రామ్‌లు

చెన్నై మేథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఐ)- డిగ్రీ, పీజీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ ఆనర్స్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

బీఎస్సీ ఆనర్స్: మేథమెటిక్స్ - కంప్యూటర్ సైన్స్, మేథమెటిక్స్ - ఫిజిక్స్ విభాగాలు ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తమ్మీద 28 రెగ్యులర్ కోర్సులు నిర్దేశించారు. ఒక్కోదానికి 4 చొప్పున మొత్తం 112 క్రెడిట్స్ ఇస్తారు. కొన్ని స్వల్పకాలిక ఎలక్టివ్ కోర్సులు కూడా ఉంటాయి. వీటికి రెండు లేదా ఒక క్రెడిట్ ఇస్తారు. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో నాన్ క్రెడిట్ కోర్సుని అభ్యర్థులందరూ తప్పనిసరిగా పూర్తిచేయాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ సైన్స్ ఒలింపియాడ్స్(మేథమెటిక్స్/ఫిజిక్స్)లో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు.

స్కాలర్‌షిప్: అకడమిక్ ప్రతిభ, సెమిస్టర్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేసిన 30-35 మంది అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు. వీరికి ట్యూషన్ ఫీజుతోపాటు నెలకు రూ.5000ల ఫెలోషిప్ ఇస్తారు. కుటుంబ వార్షికాదాయం రూ.8లక్షలలోపు ఉంటే ప్రోగ్రామ్ ఫీజు నుంచి మినహాయింపునిస్తారు. అదే రూ.12లక్షలలోపు ఉంటే 50 శాతం రాయితీ ఇస్తారు.

ఎమ్మెస్సీ: మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తమ్మీద 16 రెగ్యులర్ కోర్సులు రూపొందించారు. ఒక్కోదానికి 4 చొప్పున మొత్తం 64 క్రెడిట్స్ ఇస్తారు. చివరి సెమిస్టర్లలో కొన్ని స్వల్పకాలిక ఎలక్టివ్ కోర్సులను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి ఒకటి లేదా రెండు క్రెడిట్‌లు ఇస్తారు.

అర్హత: మేథమెటిక్స్/కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఏ/బీఎస్సీ లేదా బీ మేథ్స్/బీ స్టాటిస్టిక్స్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

స్కాలర్‌షిప్: మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఎంపిక చేసిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజుతోపాటు నెలకు రూ.6,000 ఫెలోషిప్ ఇస్తారు. డేటా సైన్స్ సహా అన్ని విభాగాల అభ్యర్థులకు వారి ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని ట్యూషన్ ఫీజులో రాయితీ/మినహాయింపు ఇస్తారు.

పీహెచ్‌డీ: మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ విభాగాలు ఉన్నాయి. మొదటి రెండు విభాగాలకు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు. ఫిజిక్స్‌లో జాయింట్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (జెస్ట్), ఇంటర్వ్యూల ద్వారా మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. విభాగానికి నిర్దేశించిన పేపర్లలో జెస్ట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయకుండా నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. మొదటి రెండేళ్లు కంపల్సరీ కోర్సు వర్కు పూర్తి చేయాల్సి ఉంటుంది. తరవాత క్వాలిఫయింగ్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. దీనిలో చూపిన ప్రతిభ ఆధారంగా డాక్టోరల్ కమిటీ నిర్ణయం మేరకు రీసెర్చ్ వర్క్‌కు అనుమతిస్తారు. పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ కూడా అందుబాటులో ఉంది.

అర్హత: మేథమెటిక్స్ విభాగానికి ఎమ్మెస్సీ(మేథ్స్)/తత్సమాన కోర్సు; కంప్యూటర్ సైన్స్ విభాగానికి ఎమ్మెస్సీ(కంప్యూటర్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఈ రెండు విభాగాలకు అధిక మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగానికి ఎమ్మెస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణత తప్పనిసరి. ఎన్‌బీహెచ్‌ఎం అర్హత పొందిన అభ్యర్థులకు మేథ్స్ విభాగంలో నేరుగా ప్రవేశం కల్పిస్తారు.

స్కాలర్‌షిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాతి మూడేళ్లు నెలకు రూ.42,000ల స్టయిపెండ్ ఇస్తారు. బుక్ గ్రాంట్ కింద ఏడాదికి రూ.10,000 చెల్లిస్తారు. హాస్టల్ సౌకర్యాన్ని వినియోగించుకోని అభ్యర్థులకు స్టయిపెండ్‌లో 27 శాతాన్ని హెచ్‌ఆర్‌ఏగా చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- బీఎస్సీ పూర్తిచేసిన అభ్యర్థులు తదుపరి కోర్సుల్లో తమ విభాగాన్ని మార్చుకోదలచుకొంటే ప్రీ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరవచ్చు. ఇందులో తాము ఎంచుకొన్న విభాగంలో మొదటి రెండేళ్ల కోర్సు పూర్తిచేసి రెగ్యులర్ ఎమ్మెస్సీ అభ్యర్థులతో సమానంగా పీహెచ్‌డీ క్వాలిఫయింగ్ ఎగ్జామ్‌నకు హాజరు కావచ్చు. వీరికి తక్కువ మొత్తంలో స్కాలర్‌షిప్ కూడా ఇస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 12 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** మే 19
- **ఇంటర్వ్యూలు:** పీహెచ్‌డీ మేథ్స్ ప్రోగ్రామ్‌నకు జూలై 1 నుంచి 4 వరకు; ఎమ్మెస్సీ మేథ్స్ ప్రోగ్రామ్‌నకు జూలై 4 నుంచి 5 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు మొదటి వారంలో
- **వెబ్‌సైట్:** cmi.ac.in

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఒక జత స్త్రీ బీజకోశాలు, ఒక జత స్త్రీ బీజవాహికలు, గర్భాశయం, యోని, అనుబంధ గ్రంథులు ఉంటాయి. ఈ భాగాలు స్త్రీలలో శ్రోణి ప్రాంతంలో ఉంటాయి.

స్త్రీ బీజకోశాలు: ఇవి ఉదర కుహరంలో ఒక జతను కలిగి ఉండి, అండాలను, స్త్రీ బీజకోశ హార్మోనులను ఉత్పత్తి చేస్తాయి. వీటిలో అనేక స్త్రీ బీజ కోశపుటికలు ఉంటాయి. ఈ పుటికలలో అండాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పుటికలు ప్రారంభంలో చిన్న చిన్న బుడగల రూపంలో ఉం టాయి. ప్రతి పుటిక లోను ఒక అండం ఉంటుంది. అండం పరిపక్వం చెందినపుడు, పుటిక పగిలి అండం విడుదలవుతుంది. ఇలా అండం విడుదల కావడాన్ని అండోత్సర్గం అంటారు. అండాలు స్త్రీ బీజ వాహికలోకి ప్రవేశిస్తాయి.

స్త్రీ బీజవాహిక: దీనిని ఫాలోపియన్ నాళం అని కూడా పిలుస్తారు. ఇవి ఒక జత ఉంటాయి. స్త్రీ బీజకోశం నుంచి ఇవి బయలుదేరుతాయి. దీనిలో కాలాంచిక, కలశిక, ఇస్తమస్ అనే నిర్మాణాలు ఉంటాయి. కాలాంచిక అనేది గరాటు ఆకారంలో ఉండి స్త్రీ బీజకోశం నుంచి విడులైన అండాలను సేకరిస్తుంది. కాలాంచిక నిర్మాణం తరవాత భాగమైన కలశికలోకి, కలశిక చివరి భాగమైన సన్నటి గ్రీవము(ఇస్తమస్) ద్వారా గర్భాశయంలోకి తెరచుకుంటుంది. ఫాలోపియన్ నాళంలోని కలశికలో శుక్ర కణాలు, అండంలో ఫలదీకరణ చెందుతాయి.

గర్భాశయం: రెండు వైపులా ఉండే స్త్రీ బీజవాహికలు ఈ గర్భాశయంలోకి తెరచుకుంటాయి. గర్భాశయం... శ్రోణి ప్రాంతంలో మూత్రాశయానికి, పురీషనాళానికి మధ్య విశాలంగా, ధృడంగా, కండరయుతమై అధిక ప్రసరణ గల తలకిందులైన పియర్ ఆకారం పరిమాణంలో ఉండే కోశం లాంటి నిర్మాణం. పెరిమెట్రియం, మయోమెట్రియం, ఎండోమెట్రియం అనే మూడు కణజాలపు పొరలతో గర్భాశయకుడ్యం నిర్మితమైంది. గర్భాశయ ఎండోమెట్రియం రుతుచక్రంలో చక్రీయ మార్పులకు లోనైతే, ప్రసవ సమయంలో గర్భాశయ మెయోమెట్రియం ధృఢమైన సంకోచాలను ప్రదర్శిస్తుంది. దీనిలో పిండ ప్రతిస్థాపనకు అనుకూల వాతావరణపు నియంత్రిత వ్యవస్థ ఉంటుంది. ప్రొజెస్టిరాన్ హార్మోన్ సహాయంతో ఫలదీకరణ చెందిన అండము గర్భాశయ కుడ్యంలో వున్న మృదు కణజాలానికి అతుక్కుంటుంది.

యోని: యోని విశాలంగా ఉండే తంతు-కండర యుత నాళం. దీనిని స్త్రీ బాహ్యజననాంగముగా పేర్కొంటారు. యోనిలో ఊర్ధ్వ, నిమ్న అనే రెండు రంధ్రాలుంటాయి. ఊర్ధ్వ రంధ్రాన్ని బాహ్యప్రసేక రంధ్రం అని, నిమ్న రంధ్రాన్ని యోని రంధ్రం అని పేర్కొంటారు. ప్రసేకం రంధ్రంపైన క్లిటోరిస్ అనే సున్నితమైన సంభించగల నిర్మాణం ఉంటుంది. ఇది పురుష మేహనానికి సమజాతము. యోనిపై భాగంలోని ఉబ్బెత్తు ప్రాంతాన్ని మాన్స్‌ప్యూబిస్ అంటారు. దీని చర్మంపై జఘన రోమాలు, చర్మం కింద కొవ్వు కణజాలపు దిండు ఉంటుంది.

అనుబంధ గ్రంథులు: స్త్రీలలో ప్రత్యుత్పత్తి అనుబంధ గ్రంథులు వరుసగా... బార్థోలిన్ గ్రంథులు, స్కీన్ గ్రంథులు, క్షీర గ్రంథులు. యోని రంధ్రానికి కొద్దిగా కిందగా ఇరువైపులా అమరి ఒక జత బార్థోలిన్ గ్రంథులు ఉంటాయి. వీటి స్రావం యోని మార్గాన్ని సులభంగా జారేటట్లు చేస్తుంది. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని బల్బో యూరెత్రల్ గ్రంథులకు సమజాతం. స్కీన్ గ్రంథులు అనేవి ప్రసేకం కింద ఉంటాయి. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని పౌరుష గ్రంథులకు సమజాతం. ఇవి ప్రేరేపితమైనప్పుడు క్షార జిగట ద్రవాన్ని స్రవిస్తాయి. ఒక జత క్షీర గ్రంథులు శిశు జననాంతరం మాత్రమే పనిచేయడం ప్రారంభిస్తాయి. పురుషులలో ఇవి క్రియారహిత అవశేషాంగాలుగా ఉంటాయి.

బీజ కణోత్పత్తి: బీజకణోత్పత్తి అంటే ప్రాథమిక లైంగిక అవయవాలైన ముష్కం, స్త్రీ బీజకోశాల నుంచి బీజకణాలు(సంయోగ బీజాలు) ఏర్పడటం. పురుషులలో జరిగే బీజకణోత్పత్తిని శుక్రకణోత్పత్తి అని, స్త్రీలలో జరిగే బీజకణోత్పత్తిని అండోత్పత్తి అని అంటారు.

శుక్రకణ నిర్మాణం: శుక్రకణ సూక్ష్మ నిర్మాణంలో...తల, మెడ, మధ్యభాగం, తోక అనే భాగాలు ఉంటాయి. తలభాగంలో ఏక్రోజోమ్ అనే టోపిలాంటి నిర్మాణం ఉంటుంది. ప్రోటియేజ్‌లు, ఏసిడ్ ఫాస్ఫటేజ్, హైలురోనిడేజ్ అనే ఎంజైములు ఏక్రోజోమ్‌లో ఉంటాయి. ఏక్రోజోమ్ అనేది ఫలదీకరణ సమయంలో శుక్రకణం, అండంలోకి చొచ్చుకొని పోయేందుకు సహాయపడుతుంది. తల భాగంలో ఏకస్థితిక కేంద్రం ఉంటుంది. మెడ అనేది తలభాగానికి, మధ్య భాగానికి ఉండే భాగం. మెడ కింది భాగాన్ని మధ్యభాగంగా పేర్కొంటారు. ఈ మధ్యభాగంలో మైటోకాండ్రియాలు చాలా ఉంటాయి. ఇవి శుక్ర కణాల తోక కదలిక, చలనానికి కావలసినంత శక్తిని అందిస్తాయి. మధ్యభాగం కింద ఉన్న నిర్మాణాన్ని తోకగా పేర్కొంటారు. ఈ తోక శుక్రకణం చలించడానికి తోడ్పడుతుంది.



అండం: స్త్రీ బీజకోశం నుంచి విడుదలైన అండం పూర్తిగా పరిణితి చెందినది కాదు. ఇది జోనా పెల్యూసిడా చేత ఆవరించి ఉంటుంది. అండం విడుదల కావడాన్ని అండోత్సరం అంటారు. అండోత్సరం తరవాత గ్రాపియన్ పుటికలలోని గ్రాన్యులోసా కణాలు విభజన చెంది కార్పస్ లూటియం అనే పసుపు రంగులో ఉండే తాత్కాలిక అంతఃస్రావగ్రంథి కణజాలంగా ఏర్పడుతుంది. కార్పస్ లూటియం ప్రొజెస్టిరాన్ అనే హార్మోనును స్రవిస్తుంది.

రుతుచక్రం: స్త్రీ జీవులలో జరిగే ప్రత్యుత్పత్తి వలయాన్ని రుతుచక్రం అంటారు. రుతుచక్రం అంటే ప్రతి నెల గర్భాశయ అంతర ఉపకళ(ఎండోమెట్రియం)లో జరిగే మార్పుల చక్రం. స్త్రీలలో ప్రతి 28 రోజుల కొకసారి రుతుచక్రం జరుగుతుంది. రుతుచక్రం మధ్యలో ఒక అండం విడుదలవుతుంది. రుతుచక్రాన్ని రుతుస్రావ దశ, పుటిక దశ, అండోత్సర దశ, టాలియల్ దశ అనే నాలుగు దశలుగా విభజించవచ్చు. మొదటి రుతుచక్రం యవ్వన దశలో(10 నుంచి 14 సంవత్సరాలు) ప్రారంభమవుతుంది. దీన్ని రజస్వల లేదా మెనార్కి అంటారు. స్త్రీలలో 45 నుంచి 50 సంవత్సరాల వయసు మధ్యలో రుతుచక్రం ఆగిపోవడాన్ని రుతువిరతి లేదా ముట్లుడగడం(మెనోపాజ్) అంటారు.

సంపర్కం - ఫలదీకరణం: సంపర్క సమయంలో మేహనం యోనిలోకి శుక్రద్రవాన్ని స్కలిస్తుంది. చలన సహిత శుక్రకణాలు వేగంగా, ఈదుతూ గర్భాశయ ద్వారం గుండా గర్భాశయంలోకి ప్రవేశించి చివరకు ఫాలోపియన్ నాళం ఇస్తమస్ ద్వారా కలశికలోకి చేరుతాయి. ఇక్కడ స్త్రీ బీజకోశం నుంచి విడుదలై కాలాంచిక ద్వారా వచ్చిన అండంతో కలుస్తుంది. మానవునిలో అంతర ఫలదీకరణ జరుగుతుంది. ఫలదీకరణ తర్వాత సంయుక్త బీజం అనే నిర్మాణం ఏర్పడుతుంది.

పిండ త్వచాలు: పిండ ప్రతిస్థాపన అనంతరం పిండంలోని కొన్ని కణాలు పిండానికి పోషణ, రక్షణ, ఆధారమునివ్వటానికి వేర్వేరు త్వచాలుగా అభివృద్ధి చెందుతాయి. వీటినే పిండ త్వచాలు అంటారు. అవి.. పరాయువు, ఉల్బము, అళిందము, సోనసంచి.



కె.నాగేశములు,
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్




మీకు తెలుసా?

- ఈ బుల్లి పక్షి పేరు 'పివావు'. న్యూజిలాండ్ రాక్ వెన్ అని కూడా పిలుస్తారు. ఇవి న్యూజిలాండ్‌లో ఉంటాయి.
- కాళ్లు కొంచెం పొడవుగా ఉంటాయి. బాల్ మాదిరి గుండ్రంగా ఉంటుంది. తోక కనపడదు.
- కేవలం 10 సెం.మీ. పొడవు ఉంటాయివి.
- ఆడపక్షులు 16 గ్రాములు, మగ పక్షులు 20 గ్రాములు ఉంటాయి. ఆడపక్షులు బ్రౌన్ రంగులో ఉంటే.. మగ పక్షులు గ్రీనిష్ రంగులో ఉంటాయి.



- ఇవి ఒక చోట నుంచి మరోచోటకు వెళ్తాయి. చలికాలంలో మాత్రం రాళ్ల కింద గూళ్లు పెట్టుకుని నివసిస్తాయి.
- పాటలు పాడుకుంటూ జంట పక్షులు గాల్లో వెళ్తుంటాయి.
- వీటి గుండ్రని రెక్కల వల్ల ఇవి రెండు మీటర్ల కంటే ఎక్కువ పైకి ఎగరలేవు. అది కూడా ముప్పయి మీటర్ల కంటే దూరం ఎగరలేవు. అందుకే ఇవి పూర్ ఫ్లయర్స్.
- ఇవి కేవలం మూడు గుడ్లు మాత్రమే పెడతాయి. వీటి పొదిగే కాలం మూడు వారాలు.
- వీటి ఆనవాళ్లు వెయ్యేళ్ల కిందట నుంచి ఉన్నాయి.
- న్యూజిలాండ్‌లో అత్యధికంగా నెటిజన్లు ఈ పక్షికే ఓటు వేయటంతో ఓ ఏడాది 'ఇయర్ ఆఫ్ ది బర్డ్' అయ్యింది.
- చిన్నపాటి పురుగులు, పండ్లు తింటాయి.


జంతువులు ఎన్ని



12 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 246

7	3		4				5	
			5			1		9
					1	3	8	
1					4	5		7
5		7	3					2
	1	5	6					
6		3			8			
	9				5		6	8

సుడోకు - 245 సమాధానం

2	9	7	5	3	6	8	4	1
1	5	4	7	9	8	6	2	3
6	3	8	2	1	4	5	7	9
9	4	5	8	6	7	1	3	2
7	1	6	4	2	3	9	5	8
3	8	2	9	5	1	4	6	7
5	2	1	6	7	9	3	8	4
8	7	9	3	4	5	2	1	6
4	6	3	1	8	2	7	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.